

STAY UPDATED IN REAL-TIME WITH OUR WHATSAPP CHANNEL



GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/53323

# సమయుజ్యోతి

ప్రతీ అక్షరం - ప్రజలకోసం

తెలుగు దిన పత్రిక

CELEBRATING 12TH YEAR ANNIVERSARY

సంపుటి : 12 సంచిక : 178 పేజీలు : 12 ఆదిలాబాద్ వెల రూ : 01 మంగళవారం 30 సెప్టెంబర్ 2025 ఎడిటర్ : ఫైసల్ ఖాన్





## రంగారెడ్డి..పాలమూరు ప్రాజెక్టుపై చర్చకు సిద్ధమా ?

### కేటీఆర్‌కు మంత్రి జూపల్లి సవాల్

**హైదరాబాద్, సెప్టెంబర్29(సమయజ్యోతి):**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మంత్రి జూపల్లి కృష్ణారావు సవాల్ విసిరారు. పాలమూరు రంగారెడ్డిపై కేటీఆర్ చెప్పినవన్నీ అబద్ధాలే అని తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై ఎక్కడైనా తాను చర్చకు సిద్ధమని సవాల్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై కేటీఆర్ అయినా హరీష్ రావు అయిన చర్చకు రావాలని మంత్రి జూపల్లి కృష్ణారావు సవాల్ విసిరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో 90 శాతం పనులు పూర్తి చేసినట్లు నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తా అని అన్నారు. లేదంటే మీరు రాజీనామా చేస్తారా.. అని ప్రశ్నించారు. తాను కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తుందో రాదో అన్నట్లు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తాను ఏం మాట్లాడానో పూర్తి వీడియో చూస్తే తెలుస్తుందని స్పష్టం చేశారు.



## ప్రపంచంలోనే బతుకమ్మకు ప్రత్యేక స్థానం - హరీశ్‌రావు

**హైదరాబాద్, సెప్టెంబర్29(సమయజ్యోతి):**



ప్రపంచంలోనే తెలంగాణకు ప్రత్యేక స్థానాన్ని తెచ్చిన పండగ.. బతుకమ్మ అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తెలిపారు. ప్రపంచంలో పువ్వులను పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణలోనే ఉందని ఆయన పేర్కొన్నారు. దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం కొండపాక మండలం మర్పడ్గ శ్రీ విజయ దుర్గా సమేత శ్రీ సంతాన మల్లిఖార్జునస్వామివారిని ఆయన దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే హరీష్ రావు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ ప్రస్థానంతోపాటు.. ప్రత్యేక రాష్ట్ర సాధనతో ఈ పండుగలు విశ్వ విఖ్యాతమయ్యాయని చెప్పారు.



## బిసి రిజర్వేషన్ల జీవో విడుదలతో

# లైన్ క్లియర్

### మొత్తం ఐదు దశల్లో ఎన్నికలు నిర్వహణ తొలుత ఎంపిటిసి, జడ్పీటిసి ఎన్నికలు తరవాత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నిక వివరాలు వెల్లడించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కుముదిని

**హైదరాబాద్,సెప్టెంబర్29 (సమయజ్యోతి:**

తెలంగాణలో స్థానిక ఎన్నికలకు నగారా మోగింది. బిసి రిజర్వేషన్లపై భారీ కసరత్తు జరిగినా చివరకు 42 శాతం బిసి రిజర్వేషన్లకు జివో విడుదల కావడంతో స్థానికఎన్నికలకు అడుగులు పడ్డాయి. ఈ క్రమంలో రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం షెడ్యూల్ ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా 31 జిల్లాల్లో 565 మండలాల్లో 5,749 ఎంపీటీసీ, 656 జడ్పీటీసీ స్థానాలకు, 12,733 గ్రామపంచాయతీలు, 1లక్షా12వేల288 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌రాణి కుముదిని ప్రకటించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని వివరాలు వెల్లడించారు. మొత్తం ఐదు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. తొలి రెండు దశల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ.. మిగతా మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని వివరించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీలకు అక్టోబర్ 23న తొలివిడత, 27న రెండో విడత ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తామని అన్నారు. గ్రామ పంచాయతీలకు తొలి విడత అక్టోబర్ 31న, రెండో విడత నవంబర్ 4న, మూడో విడత నవంబర్ 8న నిర్వహిస్తామని వివరించారు. పోలింగ్ పూర్తయిన తర్వాత అదేరోజు గ్రామ పంచాయతీల ఓట్ల లెక్కింపు చేపడతామన్నారు. నవంబర్ 11న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓట్ల లెక్కింపు జరుగుతుందని ఎస్ఈసీ తెలిపారు. రాష్ట్రంలో 31 జిల్లాల్లోని 565 మండలాల్లో ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. 5,749 ఎంపీటీసీ, 565 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. 12,733 గ్రామపంచాయతీలు, 1,12,288 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాణికుముదిని వివరించారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది ఎన్నికల కమిషన్. ఇందుకు సంబంధించి అన్ని రాజకీయ పార్టీలతో చర్చలు జరిపామన్నారు ఎన్నికల అధికారులు. మిగతా 2లో

## నిజమైన భారతీయులు నిన్నటి మ్యాచ్‌ను వీక్షించరు - సంజయ్‌రౌత్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్29(సమయజ్యోతి):**

భారత్-పాకిస్థాన్ క్రికెట్ జట్ల మధ్య ఆదివారం రాత్రి జరిగిన ఆసియాకప్ ఫైనల్ మ్యాచ్‌లో భారత్ ఘన విజయం సాధించింది. ఈ క్రమంలో దేశ ప్రధాని, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు సహా పలువురు ప్రముఖులు భారత క్రికెట్ జట్టుకు అభినందనలు తెలియజేశారు. కానీ కొందరు మాత్రం ఈ విజయంపై స్పందించలేదు. దాంతో భారత జట్టును అభినందించని వారిపై బీజేపీ విమర్శలు గుప్పించింది.



## నిండుకుండల్లా తెలంగాణలోని ప్రధాన ప్రాజెక్టులు

### శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి భారీగా వరద ప్రవాహం

**నిజామాబాద్,సెప్టెంబర్29(సమయజ్యోతి:**



తెలంగాణలోని ప్రధాన ప్రాజెక్టులైన సింగూరు, శ్రీరాంసాగర్, నిజాంసాగర్, నాగార్జునసాగర్‌లకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న ప్రవాహంతో జలాశయాలు నిండుకుండలా మారాయి. దీనితో అధికారులు అప్రమత్తమై ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేసి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

# గత పదేళ్లలో ఆర్థిక వ్యవస్థ విధ్వంసం

### సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రం ముందంజ ప్రభుత్వంపై బిఆర్ఎస్ బురద జల్లుతూ విమర్శలు మండిపడ్డ డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్,సెప్టెంబర్29(సమయజ్యోతి:**

బీఆర్ఎస్ పార్టీ తమపై బురద చల్లే ప్రయత్నం చేస్తోందని, కానీ రానున్న స్థానిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరిస్తారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మేము చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల హృదయాలకు తెలుసునని ఆయన అన్నారు. బీఆర్ఎస్ పెద్దలు 10 సంవత్సరాల్లో రాష్ట్రంలో ఆర్థిక, పాలన వ్యవస్థలను విధ్వంసం చేస్తే ప్రణాళికా ప్రకారం వాటిని సరి చేసుకుంటూ ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందని అన్నారు. రాష్ట్రంలోని రైతులు, మహిళలు, యువత కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వారి హృదయాలకు, మనసులకు బాగా తెలుసు అని ఆయన అన్నారు. సామాజిక న్యాయం కోసం రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, ఇందిరమ్మ ప్రభుత్వం బీసీల దశాబ్దాల కోరికను నెరవేర్చిందని ఆయన అన్నారు. అల్పాహారం కోసం 'హరే రామ, హరే కృష్ణ' సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. సాధారణంగా రూ. 19 ఖర్చయ్యే టిఫిన్‌ను కేవలం రూ. 5కే, అలాగే రూ. 30 ఖర్చయ్యే భోజనాన్ని రూ. 5కే అందిస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. మొదటగా ప్రజలకు బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలో ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు.

## స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పరాభవం తప్పదు

### ఆరు గ్యారెంటీలతో మోసం చేసిన రేవంత్ సర్కార్ కాంగ్రెస్ మోసాన్ని గ్రహించిన రాష్ట్ర ప్రజలు ఏ ఎన్నికులు వచ్చినా గెలిచి తీరుతాం : కేటీఆర్

**హైదరాబాద్, సెప్టెంబర్29 (సమయజ్యోతి):**



స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పరాభవం తప్పదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. సోమవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ప్రదీప్ చౌదరితోపాటు పలువురు వివిధ పార్టీల నాయకులు ఎమ్మెల్సీ ఎల్.రమణ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కేటీఆర్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న వాతావరణం చూస్తే.. గల్లీ ఎన్నికైనా, ఢిల్లీ ఎన్నికైనా బీఆర్ఎస్‌కు అనుకూలమే అన్న పరిస్థితి కనిపిస్తుందని ధీమా వ్యక్తంచేశారు. ప్రజలకు తామిచ్చిన ఎన్నికల హామీలను మర్చిపోయారని కాంగ్రెస్ పార్టీ ఆడుకుంటుందని మండిపడ్డారు. ఆరు 'గ్యారెంటీల' పేరుతో కాంగ్రెస్ చేసిన గారడీని ప్రజలు ఇంకా మర్చిపోలేదని స్పష్టంచేశారు. సమాజంలోని రైతులు, మహిళలు, ఆటో డ్రైవర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, యువత, విద్యార్థులు, వివిధ సామాజిక వర్గాల వారు అందరికీ హామీలు ఇచ్చి, కాంగ్రెస్ ఘోరంగా మోసం చేసింది' అని కేటీఆర్ ఆరోపించారు. 'కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు గ్యారెంటీ కార్డులతో చేసిన గారడీలను గుర్తుచేసేందుకు మేం 'బాకీ కార్డులను' తీసుకువచ్చామని పేర్కొన్నారు. ఈ కాంగ్రెస్ బాకీ కార్డులను ఇంటింటికి తీసుకుపోతే, అదే కాంగ్రెస్ పాలిట బ్రహ్మాస్త్రం అవుతుందన్నారు. హైదరాబాద్‌లో ఒక్కటంటే ఒక్క ఫ్లైఓవర్ కూడా కట్టలేదని పేర్కొన్నారు. గత 22 నెలలుగా హైదరాబాద్ నగరంలో ఉన్న రోడ్లను కూడా ప్రభుత్వం నిర్వహించలేకపోతున్నది'

## మాజీ ప్రధానిపై ప్రయాణ ఆంక్షలు నేపాల్ ప్రభుత్వం కీలక ఆదేశాలు

**ఖాట్మాండు,సెప్టెంబర్29(సమయజ్యోతి:**



నేపాల్ మాజీ ప్రధాని కె.పి.శర్మ ఓలిపై నేపాల్ ప్రభుత్వం ప్రయాణ ఆంక్షలు విధించింది. ఓలితో పాటు మాజీ హోంమంత్రి రమేష్ లేఖక్, జాతీయ భద్రతా సంస్థ మాజీ హెడ్ హుతారాజ్ థాపా మరియు మరో ఇద్దరు సీనియర్ అధికారులపై కూడా ప్రయాణ నిషేధం విధించినట్లు అంతర్గత మంత్రి సోమవారం తెలిపారు. హింసాత్మక ఘటనలపై తాత్కాలిక ప్రధాని సుశీల్ కర్కి నియమించిన విచారణ కమిషన్ ఆదివారం ఈ పరిమితులను సిఫారసు చేసింది. అయితే నిషేధం ఇప్పటికే అమలులో ఉందని సోమవారం హోంమంత్రి ఓంప్రకాష్ ఆర్యల్ ఒక ప్రకటనలో తెలిపారు.

## నగరంలో పేదలకు రూ.5కే ల్పాహారం

### రెండుచోట్ల ప్రారంభించిన మంత్రి పొన్నం

**హైదరాబాద్,సెప్టెంబర్29(సమయజ్యోతి:**



హైదరాబాద్‌లోని పేదల ఆకలి తీర్చే లక్ష్యంతో ప్రభుత్వం 'ఇందిరా క్యాంటీన్' పథకాన్ని రేవంత్ సర్కార్ ప్రారంభించింది. ఈ పథకం ద్వారా కేవలం ఐదు రూపాయలకే అల్పాహారం, ఐదు రూపాయలకే మధ్యాహ్న భోజనం అందించనున్నారు. మోతీనగర్, మింట్ కాంపౌండ్ ప్రాంతాల్లో ఈ క్యాంటీన్లను జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రారంభించారు.

# బిసి రిజర్వేషన్ల జీవో విడుదలతో లైన్ క్లియర్


మొదటి పేజీ తరువాయి

ఇక ఎన్నికల్లో భాగంగా 565 మండలాల్లో ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ స్థానిక సంస్థల ఎన్నికలు మొత్తం మూడు దశల్లో జరగనున్నాయి. ఇందులో భాగంగా అక్టోబర్ 23న ఎంపీటీసీ, జడ్పీటీసీమొదటి విడత ఎన్నికలు జగనున్నాయి. ఇక అక్టోబర్ 27న ఎంపీటీసీ, జడ్పీటీసీ రెండో దశ ఎన్నికలు జరగనుండగా.. అక్టోబర్ 31న మొదటి దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 4న రెండో దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు జగనున్నాయి. ఇక చివరగా నవంబర్ 8న మూడో దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతాయి. ఎన్నికలు ముగిసిన తర్వాత నవంబర్ 11న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల కౌంటింగ్ జరగనుంది. మొత్తంగా రెండు దశల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు.. మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. దీనితో తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. అయితే రాష్ట్రమంతటా ఎన్నికల సందడి మొదలవగా కొన్ని గ్రామ పంచాయతీలు, ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించబోవడం లేదని ఎస్ఈసీ ప్రకటించింది. కరీంనగర్, ములుగు జిల్లాల్లో 14 ఎంపీటీసీ, 27 గ్రామ పంచాయతీలకు 246 గ్రామ వార్డులు ఎన్నికలకు దూరంగా ఉండనున్నాయని స్పష్టం చేశారు. కోర్టు కేసుల కారణంగా ఇక్కడ ఎన్నికల నిర్వహణ సాధ్యం కావడం లేదని, హైకోర్టు ఆదేశాల మేరకు ఈ స్థానాల్లో ఎన్నికలు జరగబోవని తెలిపారు. ములుగు జిల్లాలోని 25 గ్రామ పంచాయతీలు, కరీంనగర్ జిల్లాలోని 2 పంచాయతీలకు ఎన్నికలు లేవని స్పష్టం చేశారు.ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు- తొలివిడతనామినేషన్ల స్వీకరణ: అక్టోబర్ 9స్వీకరణకు చివరి తేదీ: అక్టోబర్ 11పరిశీలన: అక్టోబర్ 12నామినేషన్ల ఉపసంహరణ- అక్టోబర్ 15ఎన్నికల తేదీ- అక్టోబర్ 23ఓట్ల లెక్కింపు- నవంబర్ 11ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు- రెండో విడతనామినేషన్ల స్వీకరణ: అక్టోబర్ 13స్వీకరణకు చివరి తేదీ: అక్టోబర్ 15పరిశీలన: అక్టోబర్ 16నామినేషన్ల ఉపసంహరణ- అక్టోబర్ 19ఎన్నికల తేదీ- అక్టోబర్ 27ఓట్ల లెక్కింపు- నవంబర్ 11గ్రామ పంచాయతీ ఎన్నికలు- తొలి విడతనామినేషన్ల స్వీకరణ: అక్టోబర్ 17స్వీకరణకు చివరి తేదీ: అక్టోబర్ 19పరిశీలన: అక్టోబర్ 20నామినేషన్ల ఉపసంహరణ- అక్టోబర్ 23ఎన్నికల తేదీ, ఫలితాలు- అక్టోబర్ 31గ్రామ పంచాయతీ ఎన్నికలు-రెండో విడతనామినేషన్ల స్వీకరణ- అక్టోబర్ 21చివరి తేదీ: అక్టోబర్ 23పరిశీలన: అక్టోబర్ 24నామినేషన్ల ఉపసంహరణ- అక్టోబర్ 27ఎన్నికల తేదీ, ఫలితాలు- నవంబర్ 4గ్రామ పంచాయతీ ఎన్నికలు-మూడో విడత నామినేషన్ల స్వీకరణ- అక్టోబర్ 25చివరి తేదీ: అక్టోబర్ 27పరిశీలన: అక్టోబర్ 28నామినేషన్ల ఉపసంహరణ- అక్టోబర్ 31ఎన్నికల తేదీ, ఫలితాలు- నవంబర్ 8

## ఎన్నికల ప్రవర్తన నియమావళి నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలి: కలెక్టర్లతో వీసీ కాన్ఫరెన్స్లో ఎస్ఈసి రాణి కుముదిని

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

ఎన్నికల ప్రవర్తన నియమావళి నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని ఆదేశించారు. సోమవారం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ హరిత, ఎస్పీ మహేష్ బి గితే తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఈసి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంపిటిసి, జడ్పిటిసి , గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికల నిర్వహణ రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందని వెల్లడించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల జరిగిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి వెంటనే ఎన్నికలు జరిగే గ్రామీణ ప్రాంతాలలో అమలులోకి రావడం జరుగుతుందని అన్నారు. ఎం.సి.సి నిబంధనల ప్రకారం 24 గంటలు, 48 గంటలు, 72 గంటల లోపు తీసుకోవాల్సిన చర్యలను చేపట్టే రిపోర్ట్ అందించాలని అన్నారు. బ్యాలెట్ బాక్స్, పోలింగ్ పర్సనల్ ట్రైనింగ్స్ సరిపోయేంత మెటీరియల్ అన్ని సరిగా చూసుకోవాలని సూచించారు.సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జడ్పీ సీఈఓ వినోద్ కుమార్, డీపీఓ షర్ఫుద్దీన్, జడ్పీ డిప్యూటీ సీఈఓ గీత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## తన స్టాప్ వచ్చిసింది.. ప్రయాణం కొనసాగుతుంది

### చివరి రోజు బస్‌లో ప్రయాణం... సజ్జన్నార్ ఆసక్తికర ట్వీట్

హైదరాబాద్,సెప్టెంబర్29(సమయజ్యోతి:



తెలంగాణ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ పదవి నుంచి హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్‌గా బదిలీ కావడంపై వీసీ సజ్జనార్ భావోద్వేగానికి లోనవుతూ తన 'ఎక్స్' ఖాతాలో ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. తన స్టాప్ వచ్చేసిందని.. బస్సు దిగి కొత్త మార్గం వైపు అడుగులేసే సమయం వచ్చిందని ఆయన పోస్ట్ చేశారు. ప్రయాణాలు ముగుస్తుంటాయని, ప్రయాణికులు దిగిపోతుంటారని.. కానీ రోడ్డు మాత్రం ఎప్పటికీ అలానే ముందుకు సాగుతుందని సజ్జనార్ ట్వీట్ చేశారు. బస్ పార్క్ చేసి.. సరికొత్త సవాల్ వైపు దూసు కెళ్లాల్సిన సమయం వచ్చిందని తెలి పారు. టీజీఎస్ఆర్టీసీకి లైఫ్ లైన్ అయిన ఆర్టీసీ డ్రైవర్లకు, కండక్టర్లకు సజ్జనార్ కృతజ్ఞతలు తెలిపారు. ఆర్టీసీ సంస్థతో, ఉద్యోగులతో ప్రత్యేక అనుబంధం ఏర్పడిందని ఆర్టీసీ ఎండీ సజ్జనర్ అన్నారు. నాలుగేళ్ల పాటు ఎండీగా పని చేశానని.. ఈ సమయంలో ఆర్టీసీలో అనేక సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. ఆర్టీసీ ఎండీ నుంచి హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా బదిలీ అవుతున్న క్రమంలో.. ఆర్టీసీ అధికారులు బాగ్ లింగంపల్లిలోని ఆర్టీసీ కళా భవన్‌లో వీడ్కోలు సభ నిర్వహించారు. ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేశానని సజ్జనర్ అన్నారు. ఉద్యోగులపై దాడులు జరిగినప్పుడు, కఠినంగా వ్యవహరించమని పేర్కొన్నారు. సినీ నటుడు అల్లు అర్జున్ నటించిన ఓ యాడ్‌లో ఆర్టీసీ సంస్థను ప్రతిష్టను దిగజారిన విషయంలో లీగల్ నోటీసులు పంపించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ నాలుగేళ్ళ సమయంలో ఆర్టీసీ సంస్థ అభివృద్ధిలో సహాయ సహకారాలు అందించిన ఉద్యోగులకు సజ్జనర్ ధన్యవాదాలు తెలిపారు. టీజీఎస్ఆర్టీసీ ఎండీగా తన చివరి రోజున వీసీ సజ్జనార్ ప్రజా రవాణాపై తన అనుబంధాన్ని వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. సాధారణ ప్రయాణికుడిలా లక్డీకాపుల్ – టెలిఫోన్ భవన్ బస్టాండ్ నుంచి బస్‌భవన్ వరకు బస్సులో ప్రయాణించారు. యూపీఐ పేమెంట్ చేసి కండక్టర్ వద్ద సొంత ఖర్చుతో టికెట్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రయాణికులతో ముచ్చటించారు. వీసీ సజ్జనార్ హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా బదిలీపై వెళుతున్న సంగతి తెలిసిందే.

## నిండుకుండల్లా తెలంగాణలోని ప్రధాన ప్రాజెక్టులు

### శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి భారీగా వరద ప్రవాహం

నిజామాబాద్,సెప్టెంబర్29(సమయజ్యోతి:

తెలంగాణలోని ప్రధాన ప్రాజెక్టులైన సింగూరు, శ్రీరాంసాగర్, నిజాంసాగర్, నాగార్జునసాగర్‌లకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న ప్రవాహంతో జలాశయాలు నిండుకుండలా మారాయి. దీనితో అధికారులు అప్రమత్తమై ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేసి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టులోకి వరద ప్రవాహం కొనసాగుతోంది. అధికారులు ప్రాజెక్టు 10 గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 158 టీఎంసీల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 94,383 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా, 96,003 క్యూసెక్కులను బయటకు పంపుతున్నారు. 29.917 టీఎంసీల పూర్తి సామర్థ్యం గల ప్రాజెక్టులో ప్రస్తుతం 18.237 టీఎంసీల నీరు ఉంది. ఇక నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి కూడా భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. 39 గేట్లను ఎత్తివేసి 4,10,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులోకి 3,40,000 క్యూసెక్కుల నీరు వస్తోంది. 1091 అడుగుల పూర్తి స్థాయి నీటి మట్టానికి, ప్రస్తుతం 1083.30 అడుగుల వద్ద ఉంది. 80.5 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి, ప్రస్తుతం 54.623 టీఎంసీల నీటి నిల్వ ఉంది. కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 1,50,244 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతోంది. అధికారులు 21 గేట్లను ఎత్తివేసి 1,51,144 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405.00 అడుగులు కాగా, ప్రస్తుతం 1401.22 అడుగుల వద్ద ఉంది. అలాగే, 17.802 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి ప్రస్తుతం 12.736 టీఎంసీల నీటి నిల్వ ఉంది. నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్ ప్రాజెక్టులోకి రికార్డు స్థాయిలో ఇన్ ఎ÷–లో కొనసాగుతోంది. ప్రాజెక్టులోని 26 గేట్లను ఎత్తివేసి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 5,86,379 క్యూసెక్కుల నీరు వస్తుండగా అంతే మొత్తాన్ని బయటకు పంపుతున్నారు. ప్రాజెక్టు నీటిమట్టం 585.50 అడుగులకు చేరింది. భద్రాచలం వద్ద గోదావరి నది నీటిమట్టం 44.3 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది.

## ప్రేమ వ్యవహారంలో దారుణం

### యువకుడిని కొట్టి చంపిన యువతి బంధువులు

జగిత్యాల,సెప్టెంబర్29(సమయజ్యోతి):

జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం రేచపల్లిలో ప్రేమ వ్యవహారం దారుణానికి దారితీసింది. గ్రామానికి చెందిన డ్రైవర్ ఎదురగట్ల సతీష్ (25)ను, అతని ప్రేమ వ్యవహారం నేపథ్యంలో యువతి కుటుంబ సభ్యులు దారుణంగా హతమార్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సతీష్, అదే గ్రామానికి చెందిన ఓ యువతితో కొంతకాలంగా ప్రేమలో ఉన్నాడు. ఈ విషయం తెలిసిన ఆమె బంధువులు పలుమార్లు హెచ్చరించారు. ఆ యువతికి మరో వివాహ సంబంధం చూస్తున్న నేపథ్యంలో, ఈ ప్రేమను కొనసాగించొద్దని సతీష్‌ను వారించారు. అయితే కలత చెందిన సతీష్, ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో ఆ యువతి ఫొటో పెట్టి, తాను ప్రేమిస్తున్నానని ప్రకటిస్తూ, ఆమెను ఎవరూ పెళ్లి చేసుకోరాదని సందేశం పోస్ట్ చేశాడు. దీంతో ఆగ్రహానికి గురైన యువతి బంధువులు, శనివారం రాత్రి సతీష్ ఇంటి దగ్గరికి వెళ్లి కర్రలతో దాడి చేశారు. తీవ్ర గాయాల కారణంగా సతీష్ అక్కడికక్కడే మృతి చెందాడు. జగిత్యాల గ్రామీణ పోలీసు ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం ముగ్గురు నిందితులు నథారి వినంజీ, శాంత వినంజీ, జలాల్‌పై హత్య కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం తరలించగా, నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

## సాగునీటి సంఘాలతో చెరువుల నిర్వహణ

### స్థానిక ఎన్నికల అనంతరం నిర్ణయం

### ఆల్మట్టిపై కెటిఆర్ అసంబద్ధ విమర్శలు

### మీడియాతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్,సెప్టెంబర్29(సమయజ్యోతి):

సాగునీటి సంఘాలతో చెరువులు, కాలువలు నిర్వహించాలని సీఎం నిర్ణయించినట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారు. స్థానిక ఎన్నికల అనంతరం దీనిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. సాగునీటి వినియోగదారుల సంఘాల అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని మంత్రి అన్నారు. హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. మొదట చెరువులతో ప్రారంభించి పెద్ద ప్రాజెక్టుల వరకు విస్తరిస్తామన్నారు. ప్రతి సంఘానికి నీటిపారుదలశాఖ నుంచి ఒక అధికారి కన్వీనర్‌గా ఉంటారని చెప్పారు. రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్, సభ్యులతో చర్చించిన తర్వాత సంఘాలు ఏర్పాటు చేస్తాం. నీటి వినియోగదారుల సంఘాలు ఏర్పాటు చేయాలని గతంలో కోదండరెడ్డి కోరారు. ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచాలన్న కర్ణాటక నిర్ణయానికి వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో వాదిస్తాం. కృష్ణా, గోదావరి జలాల్లో రాష్ట్ర హక్కులపై రాజీపడే ప్రసక్తే లేదు. ప్రాజెక్టులపై భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని మంత్రి ఉత్తమ్ విమర్శించారు. రాజకీయ లబ్ది కోసం అబద్దాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి కేటీఆర్ ఆల్మట్టి ప్రాజెక్టుపై చేసిన కామెంట్స్‌కు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కేటీఆర్ ప్రాజెక్టులపై పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. రాజకీయ లబ్ది కోసం అడ్డగోలు అబద్దాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఆల్మట్టి ఎత్తు పెంచొద్దని సుప్రీంకోర్టు స్టే ఉందని ఆయన గుర్తుచేశారు. ఆల్మట్టి ఎత్తు పెంపుకు తాము వ్యతిరేకమని తేల్చి చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లో ఎత్తు పెంచకుండా అడ్డుకుంటామని ఉత్తమ్ ధీమా వ్యక్తం చేశారు. ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచకుండా సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేశామని మంత్రి ఉత్తమ్ కుమార్ స్పష్టం చేశారు. కోర్టులో వాదనల కోసం సీనియర్ న్యాయవాది వైద్యనాథన్‌ను నియమించామని తెలిపారు. కృష్ణా, గోదావరి నీటి వాటాలో కాంగ్రెస్ హయంలోనే తెలంగాణకు న్యాయం జరిగిందని పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నదీ జలాల్లో తెలంగాణకు అన్యాయమే జరిగిందని ఆరోపించారు. కేటీఆర్ తన మాటలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని ఉత్తమ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తుమ్మిడిహట్టి ఆనకట్ట కోసం సవరణలతో డీపీఆర్ సిద్ధం చేస్తాం. కేబినెట్ ఆమోదం తర్వాత ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు చేపడతాం. చిన్న కాళేశ్వరం, కల్వకుర్తిపై కేబినెట్ పరిశీలనకు చర్యలు తీసుకుంటాం అని ఉత్తమ్ తెలిపారు. ఆల్మట్టి ఎత్తు పెంచొద్దనే అంశంపై సుప్రీం కోర్టులో స్టే ఉంది. ఈ ప్రాజెక్టు ఎత్తు పెంపునకు మేం వ్యతిరేకం. సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేస్తాం. వాదనలు వినిపించేందుకు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్‌ను నియమించాం. కృష్ణా, గోదావరి జలాల్లో కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రానికి న్యాయం జరుగుతుంది. గత పదేళ్లలో నదీజలాల విషయంలో రాష్ట్రానికి అన్యాయమే జరిగిందన్నారు. ఇదిలావుంటే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రేపు(మంగళవారం) ఢిల్లీకి వెళ్లనున్నారు. ఉదయం 6:45 గంటలకు శంషాబాద్ నుంచి ఢిల్లీకి పయనం అవుతారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని ఉత్తమ్ కలువనున్నారు. ఈసారి 80 లక్షల మెట్రిక్ టన్నుల పంట ప్రొక్యూర్ చేయాలని కేంద్రాన్ని కోరనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం 52 లక్షల మెట్రిక్ టన్నుల ప్రొక్యూర్మెంట్ మాత్రమే కేంద్రం అనుమతి ఇచ్చిందని చెప్పారు. మిగిలిన ధాన్యం ప్రొక్యూర్మెంట్‌కు కూడా అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలోని గోదాముల్లో, రైస్ మిల్లులో ధాన్యం నిండిపోయి ఉందన్నారు. ధాన్యం తలింపుకు 300 ట్రైన్స్ ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తానని మంత్రి ఉత్తమ్ వివరించారు. మంగళవారం దిల్లీ వెళ్లి ప్రహ్లాద్ జోషిని కలుస్తా. 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని కోరతాం. రాష్ట్రంలోని గోదాముల్లో, రైసు మిల్లుల్లో ధాన్యం నిండిపోయాయి. వాటిని తరలించేందుకు 300 రైళ్లు ఇవ్వాలని కోరతామని ఉత్తమ్ వెల్లడించారు.

## స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పరాభవం తప్పదు

### -ఆరు గ్యారెంటీలతో మోసం చేసిన రేవంత్ సర్కార్-కాంగ్రెస్ మోసాన్ని గ్రహించిన రాష్ట్ర ప్రజలు

### -ఏ ఎన్నికులు వచ్చినా గెలిచి తీరుతాం : కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్29(సమయజ్యోతి):

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పరాభవం తప్పదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. సోమవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ప్రదీప్ చౌదరితోపాటు పలువురు వివిధ పార్టీల నాయకులు ఎమ్మెల్సీ ఎల్.రమణ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కేటీఆర్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న వాతావరణం చూస్తే.. గల్లీ ఎన్నికైనా, ఢిల్లీ ఎన్నికైనా బీఆర్ఎస్‌కు అనుకూలమే అన్న పరిస్థితి కనిపిస్తుందని ధీమా వ్యక్తంచేశారు. ప్రజలకు తామిచ్చిన ఎన్నికల హామీలను మర్చిపోయారని కాంగ్రెస్ పార్టీ ఆడుకుంటుందని మండిపడ్డారు. ఆరు 'గ్యారెంటీల' పేరుతో కాంగ్రెస్ చేసిన గారడీని ప్రజలు ఇంకా మర్చిపోలేదని స్పష్టంచేశారు. సమాజంలోని రైతులు, మహిళలు, ఆటో డ్రైవర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, యువత, విద్యార్థులు, వివిధ సామాజిక వర్గాల వారు అందరికీ హామీలు ఇచ్చి, కాంగ్రెస్ ఘోరంగా మోసం చేసింది' అని కేటీఆర్ ఆరోపించారు. 'కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు గ్యారెంటీ కార్డులతో చేసిన గారడీలను గుర్తుచేసేందుకు మేం 'బాకీ కార్డులను' తీసుకువచ్చామని పేర్కొన్నారు. ఈ కాంగ్రెస్ బాకీ కార్డులను ఇంటింటికి తీసుకుపోతే, అదే కాంగ్రెస్ పాలిట బ్రహ్మాస్త్రం అవుతుందన్నారు. హైదరాబాద్ నగరంలో ఒక్కటంటే ఒక్క ఫ్లైఓవర్ కూడా కట్టలేదని పేర్కొన్నారు. గత 22 నెలలుగా హైదరాబాద్ నగరంలో ఉన్న రోడ్లను కూడా ప్రభుత్వం నిర్వహించలేకపోతున్నది' అని మండిపడ్డారు. హైదరాబాద్ నగరానికి మన హయాంలో చేసిన అభివృద్ధిని చూసి, మరోసారి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మనకు ఓటువేసి గెలిపిస్తారన్న నమ్మకం ఉన్నది. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ సునామీలా విస్తరిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ చెప్పిన అభయహస్తం భస్మాసుర హస్తమని తేలిపోయిందని తెలిపారు. ఆ మేరకు ప్రజల నుంచి స్పందన వస్తుంది. రాబోయే ఎన్నికల్లో కేసీఆర్‌ను తిరిగి అధికారంలోకి తెచ్చుకోవాలన్న స్పష్టమైన ఆలోచన ప్రజల్లో కనిపిస్తున్నది. ఇది రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల ప్రజల్లో ఉన్నది. కాంగ్రెస్ పార్టీని తరిమికొట్టి, తిరిగి ప్రజల సంక్షేమ, అభివృద్ధి పాలన కోసం కేసీఆర్ సారథ్యంలో ప్రభుత్వం రావాలన్న ఆకాంక్ష బలంగా ఉన్నదని స్పష్టమవుతోంది' అని కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్ వచ్చిన తర్వాత ఎరువుల కోసం లైన్లలో నిలబడి కొట్లాడే పరిస్థితి వచ్చిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులు గ్రామాల్లో ఆగ్రహావేశాలతో ఉన్నారు. మహిళలకు ఇస్తామని చెప్పిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ చేసిన మోసంపై ఆగ్రహం



వ్యక్తమవుతుందని వివరించారు. నాలుగు వేల రూపాయల పెన్షన్ ఇస్తామని చెప్పి వృద్ధులను మోసం చేసిందన్నారు. యువతకు రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యార్థులు, విద్యార్థినులకు స్కూటీలు అని చెప్పి మాటతప్పారా లేదా అని ప్రశ్నించారు?. తెలంగాణలో పరిస్థితులు ఇంత దారుణంగా ఉంటే.. రేవంత్‌రెడ్డి మాత్రం రోమ్ నగరం తగలబడుతుంటే ఫిడేలు వాయించిన నీరో చక్రవర్తిలా వ్యవహరిస్తున్నడు' అని విమర్శించారు.

## గ్రామీణ ప్రాంతాల స్ఫూర్తికి అద్దం పట్టిన మేళా

### మహిళా శక్తి బజార్‌ను సందర్శించిన గవర్నర్

### రాజ్‌భవన్‌లో ఘనంగా బతుమ్మ వేడుకలు

హైదరాబాద్,సెప్టెంబర్29(సమయజ్యోతి):

శిల్పారామం పక్కన ఉన్న 'ఇందిరా మహిళా శక్తి బజార్'లో కొనసాగుతున్న సరస్ మేళాను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడున్న స్టాళ్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. 'మహిళా స్వయం సహాయక బృందాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్టాళ్లు బాగున్నాయి. గ్రామీణ ప్రాంతాల స్ఫూర్తి, మార్కెటింగ్ ఇన్నోవేషన్‌కు ఈ మేళా అద్దం పడుతోంది. 20కిపైగా రాష్ట్రాల ప్రతినిధులు ఏర్పాటు చేసిన 150కిపైగా స్టాళ్లు తమ ప్రత్యేకతను చాటుకుంటున్నాయి. తెలంగాణలోని నకాశీ చిత్రకళ నుంచి ఒడిశా పట్టచిత్రాల వరకు అన్నీ ఇక్కడ లభిస్తున్నాయి. మేళాను చక్కగా నిర్వహిస్తున్నారు.'ఇందిరా మహిళా శక్తి' నినాదం ద్వారా 65 లక్షల మంది మహిళలు సంఘటితమవుతున్నారు. తెలంగాణలో మహిళా సాధికారత అనేది ఉద్యమంలా ముందుకు సాగడం సంతోషంగా ఉంది. నేను గతంలో పోచంపల్లిని సందర్శించాను. అక్కడ లభించేవి కేవలం చీరలు, దుస్తులే కావు.. తెలంగాణ చరిత్ర సంస్కృతి' అని గవర్నర్ పేర్కొన్నారు. ఈశాన్య రాష్ట్రాల నుంచి వచ్చి స్టాళ్లు ఏర్పాటు చేసిన నిర్వాహకులను గవర్నర్ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. అంతకుముందు మంత్రి సీతక్క గవర్నర్‌కు ఘనంగా స్వాగతం పలికారు. మహిళా కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ బండ్రు శోభారాణి, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ పాల్గొన్నారు. ఇదిలావుంటే రాజ్‌భవన్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. గవర్న జిష్టణుదేవ్ వర్మ,ఆయన సతీమణి సుధావర్మలు హాజరై బతుకమ్మలను తిలకించారు. వారిని అభినందించారు.

# మూల నక్షత్రం పర్వదినం..

## బాసర సరస్వతిని దర్శించిన కలెక్టర్ అభిలాష అభినవ్ దంపతులు

సమయజ్యోతి న్యూస్, నిర్మల్ బ్యూరో,

సెప్టెంబర్ 29.

మూల నక్షత్రం పర్వదినం సందర్భంగా బాసర సరస్వతి అమ్మవారిని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ దంపతులు దర్శించుకున్నారు. బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో సోమవారం జరిగిన మూల నక్షత్రం ప్రత్యేక దర్శనానికి జిల్లా కలెక్టర్ దంపతులకు ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ ఘన స్వాగతం పలికారు. అనంతరం వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మూల నక్షత్రం పర్వదినం సందర్భంగా వేలాది మంది భక్తులు బాసర సరస్వతి అమ్మవారి దర్శనానికి రానున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ముందుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను కలెక్టర్ స్వయంగా ఆలయ ప్రాంగణంలో పరిశీలించి, ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ ఎం హరిత

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గా ఎం.హరిత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా సమీకృత కార్యాలయానికి రాగా, అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తన ఛాంబర్ లో కలెక్టర్ ఎం హరిత బాధ్యతలు స్వీకరించారు. అనంతరం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు పుష్పగుచ్చం అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, అధికారులు, సిబ్బంది కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఏఓ రాంరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



# సద్దుల బతుకమ్మ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా ముస్తాబాద్ మండల ప్రజలు, శాంతియుత వాతావరణంలో వేడుకలను జరుపుకోవాలని సోమవారం ఎస్సై సిహెచ్ గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజల భద్రత కోసం పోలీస్ శాఖ విస్తృతమైన బందోబస్తు ఏర్పాట్లు చేసిందని, మహిళలు, బాలికలపై వేధింపులు జరగకుండా మఫ్టీ పోలీసులను నియమించినట్లు, మహిళలను తాకడం, ఫోటోలు లేదా వీడియోలు తీసేందుకు ప్రయత్నించడం వంటి చర్యలను అత్యంత తీవ్రంగా పరిగణించి, సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోబడతాయని, పండుగ సందర్భంగా డీజేలు అనుమతించబడవు. కేవలం మైక్ / స్పీకర్లు మాత్రమే వినియోగించవచ్చు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.



# కుటుంబ సమేతంగా బాసర ఆలయాన్ని దర్శించుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

సమయజ్యోతి న్యూస్ సెప్టెంబర్ 29 బజార్ హత్నూర్

నిర్మల్ జిల్లాలో గల ప్రముఖ శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి దేవస్థానాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దేవి నవరాత్రుల్లో భాగంగా ఎనిమిదవ రోజు మూల నక్షత్రం సందర్భంగా సోమ వారం నాడు మహాగౌరి అలంకరణ సందర్భంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ గతంలో కేసీఆర్ బాసర ఆలయ అభివృద్ధి కొరకు రూ. 50 కోట్లు మంజూరు చేశారని కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 10 కోట్లు మాత్రమే వినియోగించి రూ. 40 కోట్లను రద్దు చేయడం సరైన పద్ధతి కాదని ఆ 40 కోట్లను సైతం ఆలయ అభివృద్ధికి వినియోగించాలని అన్నారు. వీరి వెంట బాసర మండల కన్వీనర్ శ్యామ్, బిద్రేల్లి సర్పంచ్ డిగంబర్ తదితరులు ఉన్నారు.




# కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్పీ

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గా హరిత బాధ్యతలు స్వీకరించగా, ఎస్పీ మహేష్ బి గితే సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కు పుష్ప గుచ్చం అందించి, శుభాకాంక్షలు తెలియజేశారు.



# గిర్నూర్ దుర్గా దేవి వద్ద కుంకుమపూజ

సమయజ్యోతి న్యూస్ సెప్టెంబర్ 29 బజార్ హత్నూర్

బజార్ హత్నూర్ మండలం లోని గిర్నూర్ గ్రామంలో దుర్గాదేవి మండపం వద్ద కుంకుమ పూజ చేయడం జరిగింది గ్రామంలోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దుర్గా దేవి కుంకుమ పూజ చేసి ప్రజలు సుఖ సంతోషాల తో ఉండాలని పడి పంటలు సమృద్ధిగా పండాలని దేవి వేడుకున్నారు ఈ కార్యక్రమంలో దుర్గా దేవి కమిటీ సభ్యులు గవ్వల దేవేందర్ . సోనా నారాయణ మునేశ్వర్ సత్యనారాణ జక్కుల గంగయ్య గొల్ల నాగు వినోద్ గొల్లనాగు విలాస్ దేశెటి నగేష్ లక్కం గంగయ్య సోనా విజయ్ ఒద్ది భూమన్న గ్రామస్తులు పాల్గొన్నారు



# బాలుడిపై గుంపులుగా కుక్కల దాడి.. ప్రభుత్వ ఆసుపత్రిలో యాంటీ రాబిస్ ఇంజక్షన్ల కొరత.. కుక్కల నివారణ చర్యలు పట్టని గ్రామపంచాయతీ

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ మండల కేంద్రంలో బాలుడిపై కుక్కల దాడి ఘటన జరిగింది. బాల్కొండ పెద్ద బజారు వాసి సయ్యద్ మోయిస్ తనయుడు సయ్యద్ అబూజర్, వీధిలో ఆడుకుంటుండగా కుక్కల దాడి జరిగింది. తీవ్రంగా గాయపడ్డ బాలుడికి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో యాంటీ రాబిస్ ఇంజక్షన్లు అందుబాటులో లేక, నిర్మల్ జిల్లా పట్టణ కేంద్రానికి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మండల కేంద్రంలోని ఆస్పత్రిలో యాంటీ రాబీస్ ఇంజక్షన్లు అందుబాటులో లేకపోవడంపై విమర్శలు తలెత్తాయి. అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని ప్రజలు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా బాల్కొండ మేజర్ గ్రామపంచాయతీ, కుక్కల నివారణపై ఎలాంటి చర్యలు చేపట్టకుపోవడం, ప్రజల ప్రాణాలను పణంగా పెడుతున్నారని ప్రజలు ఆందోళన చేస్తున్నారు.



# బాధిత కుటుంబానికి బాల్యమిత్రుల ఆర్థిక సాయం

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన బాలకృష్ణ అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందగా, పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు, బాల్య స్నేహితులు కడమంచి రవి, కొల్లూరి నాగరాజు, తమ మిత్రుల ఆర్థిక సహకారంతో బాధిత కుటుంబానికి 14,500 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆర్థిక సాయం చేసిన బాల్య మిత్రులకు, ఆ కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.



# డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ కి మాతృ వియోగం.ప్రముఖుల పరామర్శ

సమయజ్యోతి న్యూస్ సెప్టెంబర్ 29 బజార్ హత్నూర్

బేల కీర్తన డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ డా వేముగంటి వరప్రసాదరావు కి మాతృ వియోగం కలిగింది. వారి పెద్దమ్మ వేముగంటి మనోహారమ్మ ఈ నెల 24 న అనారోగ్యంతో మరణించిన సందర్భంగా ఆయనను ఆయన సోదరుడు ని ఆయన స్వ గ్రామం కరీంనగర్ జిల్లా తాడికల్ లో ప్రముఖులు పరామర్శించారు. మనకొండూర్ శాసన సభ్యులు డా సత్యనారాయణ పీసీసి సభ్యులు బత్తిని శ్రీనివాస్ గౌడ్ అలాగే రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు సోదరులు హర్కర ప్రసాదరావు పరామర్శించారు. కుటుంబ సభ్యులు కి భరోసా ఇచ్చారు.



# సాహిత్య కిరీటి పురస్కారాన్ని అందుకున్న డా జొన్నకూటి.

సమయజ్యోతి సెప్టెంబర్ 29 తాళ్లపూడి

ఐ ఎస్ ఓ సర్టిఫికెట్ తో పాటు 36 వరల్డ్ రికార్డ్స్ సాధించిన ఏకైక సాహితీ సంస్థ శ్రీ శ్రీ కళా వేదిక 155 వ కార్యక్రమాన్ని హైదరాబాద్ లోని బిర్లా ఆడిటోరియం నందు ఆదివారం నాడు ఘనంగా నిర్వహించారు. శ్రీ శ్రీ కళా వేదిక సి ఈ ఓ డా కత్తిమండ ప్రతాప్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సుమారు 150 మంది కవులకు, రచయితలకు, సామాజిక సేవా కార్యకర్తలకు సాహిత్య కిరీటి పురస్కారాన్ని అందచేశారు. తాళ్లపూడి మండలం పైడిమెట్ట గ్రామానికి చెందిన కవి, రచయిత, వ్యాసకర్త, ప్రచురణ కర్త, జర్నలిస్ట్, ఉపాధ్యాయులు, సామాజిక సేవ కార్యకర్త డా జొన్నకూటి ప్రమోద్ కుమార్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. శ్రీ శ్రీ కళా వేదిక చైర్మన్ డా కత్తిమండ ప్రతాప్, జాతీయ ప్రధాన కార్యదర్శి డా టి పార్థ సారథి, జాతీయ మహిళా విభాగం అధ్యక్షురాలు జి ఈశ్వరి భూషణం ల చేతుల మీదుగా డా ప్రమోద్ సాహిత్య కిరీటి పురస్కారాన్ని అందుకున్నారు.



GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/5332
సమయజ్యోతి
ప్రతీ అక్షరం - ప్రజలకోసం
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# ఆపరేషన్ ఆసియా కప్ అదరహో !

ఆపరేషన్ సిందూర్ అంత ఆనందం..ఆసియాకప్‌లో భారత్ విజయఢంకా మోగించడంతో దేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా మరోమారు ఆనందోత్సాహాలు వెల్లివిరిసాయి. ప్రధాన పట్టణాలు మొదలుకుని ప ల్లెల వరకు ప్రజలంతా ముఖ్యంగా క్రికెట్ అభిమానులు టీవీలకు అతుక్కుపోయి కూర్చున్నారు. చాలాకాలం తరవాత పాక్‌తో క్రికెట్ ఆడడంతో ప్రజల్లో ఎక్కడ లేని ఉత్సాహం నెలకొంది. ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ పాక్‌పై దాడులు జరుగుతుంటే సైతం ప్రజలు టీవీలకు అతుక్కుపోయారు. ఎప్పటికప్పుడు విశేషాలు తెలుసుకున్నారు. మన సైనికలు పోరాటాన్ని గురించి తెలుసుకున్నారు. విమానదాడులు జరుగుతుంటే ఆనందించారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ఉగ్రస్థావరాలపై దాడులను ఆనందించారు. ఇప్పుడు మళ్లీ క్రికెట్‌లో పాక్ ప్రత్యర్థి కావడంతో అంతే ఆనందంతో మునిగిపోయారు. బ్యాటింగ్, బౌలింగ్ అంతటా మానవాళ్లు ఆధిపత్యం ప్రదర్శించడాన్ని ఎంజయ్ చేశారు. పాకిస్థాన్‌పై అదిరే విజయం సాధించి భారత్ ఆసియా కప్ విజేతగా నిలిచింది. ఉత్కంఠగా సాగిన ÷నైల్ పోరులో దాయాది జట్టుపై టీమ్‌ఇండియా 5 వికెట్ల తేడాతో నెగ్గింది. తొలుత బౌలర్లు విజృంభించడంతో పాక్ 19.1 ఓవర్లలో 146 పరుగులకే ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత్ 19.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. మ్యాచ్‌లో భారత ఆటగాళ్లు తమదైన శైలిలో విజృంభించి పాక్‌కు చెమటలు పట్టించారు. ఈ క్రమంలో టీమ్‌ఇండియా ఆసియాకప్ 2025 విజేతగా నిలిచింది. దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మన చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆత్మవిశ్వాసమే బ్రహ్మాస్త్రంగా చేసుకొన్న భారత క్రికెటర్లు కఠిన పరిస్థితుల్లోను పాక్‌ను సులభంగా ఓడించారు. మ్యాచ్ ప్రారంభంలో ప్రత్యర్థి ఓపెనర్ల దూకుడును మన బౌలర్లు చూసినప్పటికీ.. ఎటువంటి ఆందోళన లేకుండా ఏకాగ్రతతో వారిని కుప్పకూల్చారు. బ్యాటింగ్ సమయంలో క్రికెటర్లు మన టాప్ బ్యాటర్లు త్వరగా ఔటవడాన్ని చూశారు. అయినా ఏమాత్రం వెనకడుగు వేయకుండా తమ ఉక్కు సంకల్పంతో ప్రశాంతంగా, ఓపిగ్గా లక్ష్య ఛేదన పూర్తి చేశారు. పాకిస్థాన్‌ను ఫైనల్‌లో చిత్తు చేసిన టీమ్‌ఇండియా తొమ్మిదోసారి ఆసియా కప్ ఛాంపియన్‌గా నిలవడంతో దేశం మొత్తం సంబరాల్లో మునిగిపోయింది. టాస్ గెలిచిన భారత జట్టు మొదట బౌలింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ జట్టు 19.1 ఓవర్లలో 146 పరుగులకు ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత్ 19.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 150 పరుగులు చేసింది. ఇలా ఓవరాల్‌గా తొమ్మిదోసారి ఆసియాకప్‌ను టీమ్‌ఇండియా కైవసం చేసుకుంది. ఏడుసార్లు వన్డే ఫార్మాట్లో, రెండుసార్లు టీ20 ఫార్మాట్లో ఈ టోర్నీలో విజయం సాధించి చరిత్ర సృష్టించింది. ఈ నేపథ్యంలో పలువురు ప్రముఖులు, మాజీలు టీమ్‌ఇండియాకు సోషల్ మీడియా వేదికగా తమ అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. అదే సమయంలో రాత్రి అంతటా బాణాసంచా కాల్చి ఎంజాయ్ చేశారు. టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ సౌరభ్ గంగూలీ 'ఎక్స్' వేదికగా భారతజట్టును అభినందించాడు. 'వెల్ డన్ ఇండియా. ఒత్తిడిలో భారత జట్టు మొదట బంతితో తర్వాత బ్యాట్‌తో రాణించింది. భారత యువ క్రికెటర్లు అద్భుతం' అని అన్నాడు. టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్.. ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్‌కు సంబంధించి మూడు పోస్టులు పెట్టాడు. 'వరుణ్ చక్రవర్తి, కుల్‌దీప్ యాదవ్, అక్షర్ పటేల్‌లు మ్యాచ్ విన్నర్లు. వీరు మిడిల్ ఓవర్లలో చక్కగా బౌలింగ్ చేశారు' 'పాకిస్థాన్ తన ఎనిమిది వికెట్లను భారత స్పిన్నర్లకు సమర్పించుకుంది' 'తిలక్ వర్మలో చాలా నైపుణ్యముంది. అతడి టెక్నిక్ బాగుంది. అతడు క్రీజులో చివరివరకు ఉండి.. ఫైనల్‌లో పాకిస్థాన్‌పై టీమ్ ఇండియా నెగ్గేలా చేశాడు. అతడు చాలా మెరుగయ్యాడు. నిలకడగా కూడా రాణించాడు. ఆసియా కప్ 2025ను టీమ్‌ఇండియా కైవసం చేసుకోవడంపై బీసీసీ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా స్పందించారు. 'ఆసియాలో ఓటమి ఎరుగని విజేత. పాకిస్థాన్‌పై 3-0తో గెలిచిన టీమ్‌ఇండియాకు అభినందనలు వెల్లువెత్తాయి. తిలక్‌వర్మ, కుల్‌దీప్ ఒత్తిడిలోనూ అద్భుతంగా రాణించారు.భారత జట్టు విజయంపై ఐసీసీ ఛైర్మన్ జైషా ఎక్స్‌లో తన స్పందనను తెలిపారు. 'ఆసియా కప్ 2025ను గెలుచుకున్న టీమ్‌ఇండియాకు అభినందనలు. ఇండియన్ క్రికెట్‌లో ఇది గర్వించదగ్గ క్షణం. భారతజట్టు ప్రదర్శన అత్యద్భుతం. ఈ టోర్నీలో టీమ్‌ఇండియా నిలకడగా రాణించింది. ఆటగాళ్లు, సహాయ సిబ్బందికి అభినందనలు వెల్లువెత్తాయి. టీమ్‌ఇండియా తొమ్మిదో సారి ఆసియా కప్ ఛాంపియన్‌గా నిలవడంపై ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్రా , కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ హర్షం వ్యక్తంచేశారు. పాక్‌పై భారత్ విజయం సాధించిన తీరుని ఆనంద్ మహీంద్రా ప్రశంసించారు. ఈక్రమంలో ఆసియా కప్‌పై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ కీలక వ్యాఖ్యలు చేశారు. విజయాల సంబరాల్లో మునిగి అందరూ క్రికెటర్లను ప్రశంసిస్తున్నారే తప్ప.. ఎవరూ తెర వెనక కృషిని పట్టించుకోవట్లేదని విచారం వ్యక్తంచేశారు. తరచూ జట్టు కోసం నిందలు పడే కోచ్ గంభీర్, టీమ్‌ను ఎంపిక చేసిన సెలక్టర్ల ను అభినందించాలన్నారు. జట్టు తప్పు చేస్తే ఎప్పుడూ వారే నిందలు పడతారని.. అదే టీం విజయం సాధించినప్పుడు మాత్రం ఎవరూ వారిని పట్టించుకోరని పేర్కొన్నారు.

# ఎన్ని రకముల తర్పణాలు ఉన్నాయో తెలుసుకుందామా....!

## తృప్తినిచ్చే అర్పణం తర్పణం









సమయజ్యోతి ప్రత్యేకం తెలుగు దినపత్రిక

1.) తర్పణం అంటే ఏమిటి?
పితృదేవతలకు తృప్తినిచ్చి, వారికి ఊర్ధ్వ లోకాలను ప్రాప్తించేలా చేయడమే తర్పణం. విధి విధానాలను బట్టి, సందర్భాన్ని బట్టి తర్పణం పలురకాలు.
2. ) తర్పణము ఎన్నిరకాలు ?
తర్పణము రెండు విధములుగా చేయ వచ్చును అవి సకామ లేక నిష్కామములు.
సకామ తర్పణములో కొన్ని ప్రత్యేక ద్రవ్యముల ద్వారా తర్పణము చేస్తారు.
నిష్కామ తర్పణము జలముతో చేయబడుతుంది. ఋగ్వేదులు, యజుర్వేదులు, సామ, అధర్వణ వేదాలను అనుసరించేవారు ఒక్కో రకమైన తర్పణ విధానాన్ని అవలంబిస్తారు.
ప్రధానంగా తర్పణాలు నాలుగు రకాలు.
1-గరుడ తర్పణం: -
ఎవరైనా పరమపదించిన రోజున చేసే తర్పణాన్ని గరుడ తర్పణం అంటారు.
2-బ్రహ్మ యజ్ఞ తర్పణం: -
నిత్యానుష్టానం లో భాగంగా విడిచే తర్పణాలు ఇవి.
3-పర్వైణి తర్పణం : -
యేటా చేసే పితృకర్మల తరువాతిరోజు ఇచ్చే తర్పణాలు.
4-సాధారణ తర్పణం : -
అమావాస్య రోజున, పుణ్యనదీ స్నానాలలో, పుష్కరాలలో, సంక్రమణ, గ్రహణ సమయాలలో విడిచే తర్పణాలు.
మన ఋషులు ఇటువంటి తర్పణాలను 96 పేర్కొన్నారు.
ౡ3.) తర్పణాలు ఎందుకు వదులుతాము?
తర్పణము చేయడము వలన దేవతలు శీఘ్రముగా సంతుష్టులౌతారు. లేదా వారిని సంతృప్తి పరచే విధిని తర్పణము అని అందురు. దేవతలను ప్రసన్నము చేసుకొనబడుటకు, వారిని ప్రీతీ చేయుట కొరకు ఈ తర్పణము వదల బడుతుంది.
ౡ4.) ఏ తర్పణానికి ఎటువంటి ఫలితం ఉంటుంది ?
1. తేనె ద్వారా తర్పణము చేయడము వలన అన్ని కోరికలు నెర వేరుతాయి, అన్ని పాతకములు నాశనము అవుతాయి.
2. కర్పూర జలముతో తర్పణము చేస్తే, రాజు వశ మౌతాడు.
3. పసుపు కలిపిన జలముతో తర్పణము చేస్తే, సామాన్య వ్యక్తి వశమౌతాడు.
4. ఆవు నేతితో తర్పణము చేస్తే, %ా%.సుఖము
5. కొబ్బరి నీళ్ళతో తర్పణము చేస్తే, %ా%. సర్వ సిద్ధి
6. మిరియాలు కలిపిన జలముతో తర్పణము చేస్తే.. శత్రు నాశనము.
ౡ5. )తర్పణం ఎలా వదలాలి ?
కల్పోక్త ప్రకారముగా సాధకుడు, స్నాన, పూజా, హెూమ సమయము లందు ప్రతి రోజు దేవతల ప్రీతి కొరకు తర్పణము గావించవలయును. దేవతలకు వారి నామ మంత్రములు ఉచ్చరించుచు, దేవ తీర్థము ద్వారా తర్పణము చేయ వలెను. వారి నామములకు "స్వాహా" చేర్చి తర్పణము లీయవలెను.
(అగ్ని పురాణము, బ్రహ్మ పురాణము, మంత్ర మహోదధి నుంచి సేకరించ బడినది)
మహాలయ పక్షాలు ఎలా పెట్టాలి?
మరణించిన తండ్రి, తాత, ముత్తాతలను తలచుకుని పుత్రులు నిర్వహించే శ్రాద్ధ తర్పణ, పిండప్రదానాది పితృయజ్ఞ విధులన్నీ జరుపుకోవడానికి నిర్దేశించిన ఈ పదున్నెదు రోజులనే మహాలయ పక్షాలు అంటారు. వీటినే పితృపక్షము అనీ అపరపక్షములనీ కూడా అంటారు.
మరణించిన మన పితృదేవతలకు భక్తిగా ఆహారాన్ని అందించి, వారి ఆకలి తీర్చడమే ఈ మహాలయ పక్షముల ముఖ్యోద్దేశము.
భాద్రపద బహుళపాడ్యమి నుంచి భాద్రపద అమవాస్య వరకు మధ్యనున్న పదిహేను రోజులు మహాలయ పక్షములు అంటారు. మరణించిన తండ్రి, తాత, ముత్తాతలను తలచుకుని పుత్రులు నిర్వహించే శ్రాద్ధ తర్పణ, పిండప్రదానాది పితృయజ్ఞ విధులన్నీ జరుపుకోవడానికి నిర్దేశించబడిన ఈ పదున్నెదు రోజులనే మహాలయ పక్షాలు అంటారు.
ౡపితృదేవతలకు.... ఆకలా...? అనే సందేహం కలుగవచ్చు. ఈ కనిపించే సకల చరాచర జగత్తు మొత్తం ఆకలి అనబడే సూత్రం మీదనే నడుస్తోంది.
అన్నాద్భవంతి భూతాని పర్జన్యాదన్న సంభవః"
"యజ్ఞాద్భవతి పర్జన్యో యజ్ఞఃకర్మ సముద్భవః"
అన్నం వలన ప్రాణికోటి జన్మిస్తుంది. వర్షం వలన అన్నం లభిస్తుంది. యజ్ఞం వలన వర్షం కురుస్తుంది. ఆ యజ్ఞం కర్మ వలననే సాధ్యమౌతుంది. అంటే... అన్నం దొరకాలంటే మేఘాలు వర్షించాలి. మేఘాలు వర్షించాలంటే... దేవతలు కరుణించాలి. దేవతలు కరుణించాలంటే వారి ఆకలి తీరాలి. వారి ఆకలి తీరాలంటే యజ్ఞాల ద్వారా వారి వారి హవిర్భాగాలు వారికి అందజేయాలి. ఎందుకు ఇంత తతంగం అని అడగొచ్చు. మరణించిన ప్రాణి ఆత్మ రూపంలో పితృలోకంలో ఉంటుంది. ఆ ఆత్మ తన పూర్వకర్మానుభవం కోసం తిరిగి ఈ భూమిమీద జీవాత్మగా అవతరించడానికి ... అన్నాన్ని ఆశ్రయించి, తద్వారా పురుష ప్రాణి దేహంలో ప్రవేశించి, శుక్ల కణముగా రూపొంది, స్త్రీ గర్భకోశంలో ప్రవేశించి, శిశువుగా రూపాంతరం చెంది ఈ భూమి మీదకు వస్తుంది.
మరణించిన మన పితరులకు మోక్షం కలగాలంటే కర్మ పరిపక్వం కావాలి. అలా జరగాలంటే... పితృదేవతలు దేహధారణ చేసి ఈ లోకంలోకి రావాలి. అలా రావాలంటే వారికి అన్నాన్ని అందించాలి. అది రక్తం పంచుకు పుట్టిన పుత్రులే అందించాలి. అప్పుడే వారికి పితృఋణం తీరుతుంది. ఋణం తీరడమే మోక్షం అంటే. ఎవరికైనా ఇంతే.. తద్దినాలు పెడుతున్నాం కదా... మహాలయ పక్షాలు పెట్టాలా?
అనే సందేహం తిరిగి కలుగవచ్చు. మరణించిన తండ్రి తిథినాడు పుత్రుడు తద్దినం పెట్టడం హిందూ సాంప్రదాయంలో అనాది నుంచి వస్తున్న ఆచారం. పితృతిథినాడు పుత్రుడు తన తండ్రి, తాత, ముత్తాతలను తలచుకుని పితృయజ్ఞాన్ని నిర్వహిస్తాడు.
మరి పుత్రులు లేనివారి సంగతి ఏమి ? వారి గతి అధోగతేనా ? అంటే కాదు. అంటుంది శాస్త్రం. మన కుటుంబాలలో ఏ కారణం చేతనో పెళ్ళికాని సోదర, సోదరీలు మరణించి ఉండవచ్చు. లేదా పెళ్ళయినా సంతానం కలుగని దంపతులు మరణించి ఉండవచ్చు. లేదా ప్రమాదాల్లో మరణించిన చిన్న పిల్లలు ఉండవచ్చు. లేదా యుద్ధాలలో కానీ, శిక్షల ద్వారా కానీ, ఆత్మహత్యల ద్వారాకానీ, ప్రకృతి వైపరీత్యాల (భూకంపాలు, వరదలు) ద్వారా కాని గుర్తు తెలియక మరణించి ఉండవచ్చు. అటువంటి వారందరికి కూడా తిలోదకాలిచ్చి వారిని ఊర్ధ్వలోకాలకు పంపడం కోసం ఈ మహాలయ పక్షాలు నిర్దేశించబడ్డాయి.
పితృతిథి నాడు మూడు తరాల వారికి (తండ్రి, తాత, ముత్తాత) మాత్రమే తిలోదకాలతో పిండప్రదానం ఇవ్వబడుతుంది. కానీ ఈ మహాలయ పక్షాలు, పదిహేను రోజులు వంశంలో మరణించిన వారందరికీ మాత్రమే కాక, పుత్రులు లేని గురువులకు (గురువు కూడా తండ్రితో సమానం) స్నేహితులకు కూడా తిలోదకాలతో, పిండప్రదానం ఇచ్చే అర్హత, అధికారం ఉంది. దీనినే "సర్వకారుణ్య తర్పణ విధి" అంటారు. ఏ కారణం చేతన్నెనా తద్దినం పెట్టలేని పరిస్థితి ఏర్పడి, తద్దినం, పెట్టకపోతే ఆ తద్దినం పెట్టని దోషం మహాలయం పెట్టడం వలన పోతుంది. పితృయజ్ఞం చేసిన వారసునికి సకల ఐశ్వర్యాలు కలగాలనీ .... పిల్లపాపలతో ఆనందంగా ఉండాలనీ దీవిస్తారు.
ౡమహాలయ పక్షాలు ఎలా పెట్టాలి?
సాధారణంగా తండ్రి చనిపోయిన తిథినాడు మహాలయం పెట్టడం ఉత్తమమం. ఏ కారణం చేతన్కెనా అలా పెట్టడం వీలుకాని పరిస్థితిలో మహాలయ అమావాస్యనాడు పెట్టడం ప్రశస్తం. దీనినే సర్వ పిత్రు అమావాస్య అంటారు. ఈ రోజునే మరణించిన బంధువులందరికీ... వారి వారి తిథులతో సంబంధం లేకుండా మహాలయం పెట్టాలి.
క్రింది సంవత్సరం చనిపోయిన వారికి భరణి లేక భరణి పంచమి తిథులలో అనగా మహాలయ పక్షాలు మొదల్కెన 4 లేక 5 రోజున మహాలయం పెట్టాలి.
భార్య మరణించిన వాడు అవిధవ నవమినాడు అనగా తొమ్మిదవ రోజున మహాలయం పెట్టాలి. ఆ రోజున సుమంగళిగా మరణించిన తన భార్యను తలచుకుని ఒక సుమంగళికి భోజనం పెట్టి, పసుపు, కుంకుమ, గాజులు, పూవులు, చీర, పెట్టి సత్కరించి పంపాలి.
పిల్లలు చనిపోతే... వారికి పన్నెండవ రోజున మహాలయం పెట్టాలి. చిన్న పిల్లలు అంటే ఉపనయన వయస్సు (పది సంవత్సరములు) దాటనివారు. ఒకవేళ పది సంవత్సరముల వయస్సు లోపే ఉపనయనము జరిగి ఉంటే... ఆ పిల్లవాడు మరణించిన తిథినాడే మహాలయం పెట్టాలి.ఇక ప్రమాదాలలో కానీ, ఉరిశిక్ష వల్ల కానీ, ఆత్మహత్య చేసుకుని మరణించిన వారికి ఘట చతుర్థినాడు అనగా అమావాస్య ముందురోజున పెట్టాలి

కామిడి సతీష్ రెడ్డి భూపాల్ పల్లి జిల్లా
9848445134

# సమాజానికి దిక్సూచి రచయితలే.

## తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామిడి సతీష్ రెడ్డి

సమయజ్యోతి ప్రతినిధి జోగులాంబ గద్వాల



సమాజానికి దిక్సూచి రచయితలేనని తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామిడీ సతీష్ రెడ్డి అన్నారు జోగులాంబ గద్వాల జిల్లా శాంతినగర్ మండల కేంద్రంలో ప్రముఖ కవి రచయిత అనేక జోక్స్ పుస్తకాలను ప్రచురించిన షేక్ అస్లాం షరీఫ్ ఆధ్వర్యంలో వెలువడిన నవ్వులే నవ్వులు జోక్స్ పుస్తకాన్ని వారు ఆవిష్కరించారు అనంతరం సతీష్ రెడ్డి మాట్లాడుతూ సామాజిక సమస్యలపై రచయితలు రచనలు చేయాలని ప్రతి దినపత్రికలో ఎడి టోరియల్ పేజీలో వ్యాసకర్తలకు పేజీ కేటాయించడం జరిగిందని రచయితలు సామాజిక అంశాలపై వ్యాసాలు రాసి సమాజా వికాసానికి దోహదం చేయాలని పేర్కొన్నారు షేక్ అస్లాం షరీఫ్ జోగులాంబ గద్వాల్ జిల్లా రచయితల సంఘం కన్వీనర్ గా పనిచేస్తూ సామాజిక సమస్యలపై స్పందించడం జరుగుతుందని నిత్యం కలంతో పోరాటం చేస్తూ ఎన్నో రచనలు చేశారని ఒక సిరాచుక్క లక్ష మెదల్ల కలయికని పేర్కొన్నారు వారి ఆధ్వర్యంలో వెలువడిన నవ్వులే నవ్వులు జోక్స్ పుస్తకంలో 108 జోక్స్ ఉన్నాయని ఆ జోక్స్ చదివితే అందరం కడుపుబ్బ నవ్వడం తో పాటు మానసిక ఆరోగ్యం కలుగుతుందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో షేక్ అస్లాం షరీఫ్ వరంగల్ నుండి వచ్చిన కాకతీయ టూర్ టీచర్స్ అందరికీ ప్లాస్టిక్ రహితంగా ఉండాలనే కోరికతో వారి నాన్నగారు కీర్తీ శేషులు షేక్ ఖాదర్ షరీఫ్ తల్లి షేక్ ముంతాజ్ బాను పేర్ల మీద ఉన్న ప్రేమతో బట్ట సంచులను పెన్నులను డైరీలను బహూకరించారు ఈ కార్యక్రమంలో వరంగల్ కాకతీయ టూర్ టీచర్స్ కమిటీ ప్రతినిధులు తంగెళ్ళరాజిరెడ్డి లింగంపల్లి నరసింగ రావు భూక్య బాపురావు కామిడి శ్రీధర్ రెడ్డి మారం దేవేందర్ రెడ్డి కుంభం తిరుపతిరెడ్డి రావుల సంపత్ రెడ్డి బండి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

# ఎడపల్లిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

## ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల సందర్శన

## ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి దరఖాస్తులపై సమీక్ష

**సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్, సెప్టెంబర్ 29 :**

ఎడపల్లి మండల కేంద్రంలో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులపై ఒక్కో గ్రామం వారీగా రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమీక్ష జరిపారు. వచ్చిన దరఖాస్తులలో ఆయా మాడ్యుల్స్ లో ఎన్ని అర్జీలు పరిష్కరించారు, ఎన్ని పెండింగ్ లో ఉన్నాయి, ఎంతమందికి నోటీసులు ఇచ్చారు, క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ పూర్తయ్యిందా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా సాదాబైనామా దరఖాస్తులను పరిష్కరించాలని అన్నారు. భూభారతి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అర్జీల పరిష్కారంలో జాప్యం జరుగకుండా రోజువారీగా దరఖాస్తుల పరిశీలనను పర్యవేక్షిస్తూ, వేగవంతంగా వాటిని పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను చేపడుతున్న తీరును పరిశీలించి సూచనలు చేశారు. గడువు లోపు ఎస్.ఐ.ఆర్ పూర్తి చేయాలని అన్నారు. అంతకుముందు ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాల ప్రగతి గురించి ఆరా తీశారు. లబ్దిదారులు అందరూ నిర్మాణాలు చేపట్టి త్వరితగతిన పూర్తి చేసుకునేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు. చేసుకునేలా చూడాలన్నారు. ఇప్పటికే నిర్మాణాలు పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులు ఉన్నారు.



# ప్రజావాణికి 40 ఫిర్యాదులు

**సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్, సెప్టెంబర్ 29 :**

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 40 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఏసీపీ రాజా వెంకట్ రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ముచ్చింతల్ సమతా మూర్తి ని దర్శించుకున్న కాకతీయ టూర్స్ టీచర్స్ సభ్యులు

**రంగా రెడ్డి సమయ జ్యోతి ప్రతినిధి**

ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన కాకతీయ టూర్ టీచర్స్ కమిటీ సభ్యులు చివరి రోజు రంగా రెడ్డి జిల్లా సంశబాద్ పరిధి లోని ముచ్చింతల్ లో వున్నా బారీ సమతా మూర్తి విగ్రహం రామానుజ మూర్తి 216 అడుగుల ఎత్తులో ఉండి స్టేట్యూ ఆఫ్ ఈక్వలిటీ గా పేరు గాంచింది అని 108 దివ్య దేశాలను చూసీ భాగ్యం కలిగిందని సభ్యులు లింగం పల్లి నర్సింగ రావు వొల్లాల అశోక్ గౌడ్ అన్నారు రామానుజ మూర్తి ఆశీస్సులు తీసుకున్నారు. సమతా మూర్తి ఆలయం రమణీయంగా ఉందని ఆలయం చరిత్ర ఎంతో ప్రాశస్త్యం పొందిందని ఆలయంలో ఉన్న అన్ని దేవాలయాలు ఆధ్యాత్మికను ఉట్టిపడేలా చేసాయని కాకతీయ టూర్స్ కమిటీ సభ్యులు అన్నారు అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు నాలుగు రోజులపాటు జరిగిన ఈ కాకతీయ టీచర్ టూర్స్ యాత్ర విజయవంతం అయిందని సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాకతీయ టూర్ టీచర్స్ సభ్యులు బండి రాజేంద్రప్రసాద్ కామిడి శ్రీధర్ రెడ్డి భూక్య బాబురావు కామిడీ సతీష్ రెడ్డి తంగెళ్ల రాజిరెడ్డి మారం దేవేందర్ రెడ్డి కుంభం తిరుపతి రెడ్డి రావుల సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



# కుంకుమార్చనలు.. అన్నదానం

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పోచమ్మ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గామాత సన్నిధానంలో మహిళలు కుంకుమార్చనలు నిర్వహించారు. నిర్వాహకులు, వందలాది భక్తులకు అన్నదానం చేశారు.



# దేవి శరన్నవరాత్రులు..

## మహిళలు బోనాలతో శోభాయాత్ర

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

దుర్గామాత నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఊరంతా పండుగ వాతావరణం మధ్య బాల్కొండ మండలం నాగపూర్ గ్రామంలో సోమవారం సాయంత్రం మహిళలు బోనాలతో శోభాయాత్ర నిర్వహించి, బోనాలను దుర్గామాతకు సమర్పించి, పూజలు నిర్వహించారు. ఊరంతా పాడిపంటలతో విలసిల్లాలని మొక్కుకున్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.



# పదవీ విరమణ చేస్తున్న ఎస్.ఐ కు సన్మానం

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి నిజామాబాద్**

కలెక్టరేట్ లో విధులు నిర్వర్తిస్తూ, ఈ నెల 30న పదవీ విరమణ చేస్తున్న పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ ఎం.డీ.నసీరుద్దీన్ ను ఘనంగా సన్మానించారు. ఆయనను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి పూల మాలలు, శాలువాతో సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. నసీరుద్దీన్ అందించిన సేవలను కొనియాడారు.



# దుర్గామాత సన్నిధానంలో భక్తులకు అన్నదానం

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో రాక్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గామాత సన్నిధానంలో సోమవారము విశేష పూజలు నిర్వహించిన అనంతరం నిర్వాహకులు వందలాది భక్తులకు అన్నదానం చేశారు.



# బతుకమ్మ పండగ ఏర్పాట్లను పరిశీలించిన కార్పొరేటర్ పుష్పానగేష్

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**

మంగళవారం శ్రీనివాస్ నగర్ కాలనీ సండే మార్కెట్ లో బతుకమ్మ పండుగ జరుగుతుందని కార్పొరేటర్ పుష్పానగేష్ తెలిపారు ఉత్తమ బతుకమ్మ లకు 1వ 20,000/- , 2వ 15,000/- 3వ 10,000/- రూపాయల బహుమతులు ఐదుగురుకి పట్టు చీరలు కన్సోలేషన్ ప్రైజ్ లు ఇవ్వనున్నామని కార్పొరేటర్ పుష్పానగేష్ తెలిపారు ఓల్డ్ రామచంద్రాపురం రాయసముద్రం చెరువు కోనేరు వద్ద గ్రామం మొత్తం పెద్ద ఎత్తున జరగనున్న బతుకమ్మ పండుగ సంబరాలలో పాల్గొనే సందర్భంగా స్థానిక రామచంద్రాపురం కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు బూరుగడ్డ పుష్పనగేష్ జిహెచ్ఎంసి అధికారులతో కలిసి పర్యటించి ఏర్పాట్లను పర్యవేక్షించారు కోనేరు లో నీరు తీసి నూతన నీరు విడుదల చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు కోనేరు వద్ద లైట్ ను చుట్టూ ప్రక్కల పెట్టి ఎక్కడ చీకటి లేకుండా చూడాలని సూచించారు సండే మార్కెట్ లో పెద్ద ఎత్తున వేయనున్న స్టేజి మరియు సౌండ్ సిస్టం ఏర్పాట్లను పరిశీలించారు ఐలాపూర్ ఐలేష్ చిగురు శ్రీను ముదిరాజ్ నాగరాజు గౌడ్ కిరణ్ గౌడ్ సంపత్ గౌడ్ రాములు యాదవ్ సంతోష్ మహిపాల్ గౌడ్ కృష్ణ గారెళ్ల శ్రీశైలం సామ్రాట్ రఫీ మల్లేష్ సుంకు స్వామి రవీ గౌడ్ హన్మంతు రమేష్ కాసాల వీరేశం కుమ్మరి రాజు తదితరులు పాల్గొన్నారు



# ఒడ్డే ఓబన్న జీవితం స్ఫూర్తిదాయకం

## పటాన్చెరు శాసనసభ్యులు గూడెం

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**

భావి తరాలకు ఒడ్డే ఓబన్న జీవితం స్ఫూర్తిదాయకమని పటాన్చెరువు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస నగర్ కాలనీలో వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఒడ్డే ఓబన్న విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిపాయిల తిరుగుబాటుకు ముందు స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి తో కలిసి బ్రిటీష్ సేనలపైన వీరోచిత పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి ఓబన్న అని కొనియాడారు అతని త్యాగాలను భావితరాలకు అందించే లక్ష్యంతో విగ్రహాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు,ఈ కార్యక్రమంలో వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ జైపాల్ వడ్డ సంఘం అధ్యక్షులు లింగయ్య రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నగేష్ మాజీ కార్పొరేటర్ అంజయ్య, సీనియర్ నాయకులు పరమేష్ యాదవ్ ఐలేష్ యాదవ్ పెద్ద రాజు తదితరులు పాల్గొన్నారు



# భారతీయ తపాలా చెల్లింపు బ్యాంక్ సేవలు ప్రారంభం

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండల కేంద్రంలో సోమవారము ఐపిపిబి మేనేజర్ కళ్యాణ్, భారతీయ తపాలా చెల్లింపు బ్యాంకు సేవలను ప్రారంభించారు. వినియోగదారులకు అన్ని రకాల తపాల సేవలు అందుతాయని మారుమూల గ్రామాల్లో భీమా సౌకర్యం, నగదు డిపాజిట్లు జమ చేసుకోవడం, ఖాతాలు తెరవడం, ఏటీఎం కార్డులు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎంపీడీవో విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ భారతీయ తపాలా చెల్లింపు బ్యాంకు సేవలను ప్రజల్లో ప్రచారం చేసి, వారు వినియోగించుకునేలా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమానికి మండల సూపర్డెంట్ రమణ, మండల ఎంపీఓ గంగ మోహన్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ భరత్, డాక్టర్ రాజు, పాత్రికేయులు శివప్రసాద్, శంకర్, గోపి, మురళి,నాల రాజు, నర్సింగ్ రావు, మల్లేష్, శంషుద్దీన్, షాదుల్లా, యూసుఫ్ పాల్గొన్నారు.



# రిటర్నింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

జిల్లా కేంద్రం ఆదిలాబాద్ లోని జిల్లా పరిషత్ మీటింగ్ హాల్లో సోమవారం ఉదయం ఎంపీటీసీ,జడ్పీటీసీ లు,గ్రామ పంచాయతీలకు సాధారణ ఎన్నికలు - 2025.రిటర్నింగ్ అధికారులకు,మధ్యాహ్నం సెకండ్ ఆర్డినరీ ఎలక్షన్స్,2025 గ్రామ పంచాయతీ సర్పంచ్,ఉప సర్పంచ్,వార్డు సభ్యుల ఎన్నికల సందర్భంగా రిటర్నింగ్ అధికారి (స్టేజ్-2),అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు స్టేజ్ 1 గా నియమితులైన అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా,అదనపు కలెక్టర్ రాజేశ్వర్ లోకల్ బాడి,సంబంధిత అధికారులతో కలసి శిక్షణకు సంబంధించి దిశా నిర్దేశం చేశారు.




# కొత్తకోటలో ఘనంగా బతుకమ్మ మహోత్సవాలు

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి కొత్తకోట**

కొత్తకోట పట్టణం రచ్చకట్ట మహిళల ఆధ్వర్యంలో గత వారం రోజులుగా ఆరాధ్య దైవంగా బతుకమ్మ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సోమవారం పట్టణంలో బతుకమ్మలను, బొడ్డెమ్మలను ఊరేగింపుగా కోలాటాలు ఆడుతూ పాడుతూ ఊరేగింపుగా తరలించారు. గోవింద హళ్లి దగ్గర ఉన్న కోంటిదాన్ని కుంటకు చేర్చి బతుకమ్మలను నిమజ్జనం చేశారు.



# సరవస్వతీ దేవిగా కనకదుర్గమ్మ ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు


**విజయవాడ,సెప్టెంబర్29(సమయజ్యోతి):**

ఇంద్రకీలాద్రిపై 2025 దసరా ఉత్సవాలు వైభవంగా కొనసాగుతు న్నాయి. 'మూలా నక్షత్రం' కావడంతో సోమవారం సరస్వతీ దేవి అలంకారంలో దుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారి దర్శనానికి భారీగా భక్తులు తరలివచ్చారు. అమ్మవారి దర్శనానికి అర్ధ రాత్రి నుంచే భక్తులను అనుమతించారు. దీంతో క్యూలైన్లన్నీ నిండిపోయాయి. అమ్మవారి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. వినాయక గుడి నుంచి సుమారు 3 కిమీ మేర భక్తులు బారులు తీరారు. ఉదయం 9:30 గంటలకు లక్ష మంది భక్తులు అమ్మవారిని దర్శనం చేసుకున్నారని బెజవాడ ఆలయ అధికారులు తెలిపారు. ఈరోజు 3 లక్షల పైచిలుకు భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. మూల నక్షత్రం సందర్బగా వీఐపీ, వీవీఐపీ దర్శనాలను రద్దు చేశారు. అన్ని క్యూ లైన్‌లలో ఉచిత దర్శనం ఏర్పాట్లు చేశారు. తిరుపతి తరహాలో భక్తులకు హోల్డింగ్ పాయింట్స్, పదికి పైగా కంపట్మెంట్స్ ఏర్పాటు చేశారు. క్యూ లైన్లలో ఉన్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. క్యూ లైన్లలో ఉన్న భక్తులకు వాటర్ బొట్టిల్స్, బిస్కెట్ పాకెట్స్, పాలు, మజ్జిగ పాకెట్స్ పంపిణి చేస్తున్నారు. సరస్వతిదేవి అలంకారంలో దర్శనమిస్తున్న జగన్మాత దుర్గమ్మను కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివ కుమార్, శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, హోంమంత్రి వంగలపూడి అనిత, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) దర్శించుకున్నారు. మధ్యాహ్నం 3:30 గంటల నుంచి 4:30 నిముషాలకు సీఎం చంద్రబాబు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారు.

# దుర్గాదేవి నిమజ్జనానికి అన్ని ఏర్పాటులను పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**సమయజ్యోతి న్యూస్ నిర్మల్**

**బ్యూరో సెప్టెంబర్ 29.**



దుర్గాదేవి నిమజ్జనానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని దుర్గాదేవి విగ్రహాలను నిమజ్జనం చేసే వినాయక సాగర్ చెరువు (బంగల్పేట్ చెరువు) ను కలెక్టర్ పరిశీలించారు. చెరువుగట్టు వెంబడి రక్షణ కోసం ఏర్పాటుచేసిన బారికేడ్లను పరిశీలించారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దుర్గాదేవి విగ్రహాల నిమజ్జనంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని చెప్పారు. మెరుగైన లైటింగ్ తో పాటు, క్రేన్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు ఎవరు చెరువులోకి దిగకుండా ఉండేలా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. నిమజ్జనం కార్యక్రమం పూర్తయిన వెంటనే పారిశుద్ధ్య పనులు చేపట్టాలని అన్నారు.అంతకుముందు కలెక్టర్, బంగల్పేట్ శ్రీ మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన కలెక్టర్ కు పూజారులు ఘన స్వాగతం పలికారు. మహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కలెక్టర్ కు అమ్మవారి ఫోటోను బహుకరించారు. పూజారులు ఆలయ చరిత్రను, విశిష్టతను వివరించారు. దసరా పర్వదినం సందర్భంగా ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున, వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్య క్రమాలలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, మున్సిపల్ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# జిల్లాలోని మద్యం దుకాణాలకు దరఖాస్తులను స్వీకరించిన : జిల్లా ఎక్సైజ్ అధికారి అబ్దుల్ రజాక్

**సమయజ్యోతి న్యూస్, నిర్మల్ బ్యూరో, సెప్టెంబర్ 29.**

జిల్లాలోని మద్యం దుకాణాలకు దరఖాస్తులను స్వీకరించినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి అబ్దుల్ రజాక్ తెలిపారు.జిల్లాలోని మద్యం దుకాణాలకు సంబంధించి ఈరోజు ఏడు దరఖాస్తులు స్వీకరించినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి రజాక్ తెలిపారు. ఈ దరఖాస్తుల స్వీకరణ గడువు అక్టోబర్ 18 వ తేదీతో ముగుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఒక్క దరఖాస్తులు మూడు లక్షల రూపాయల రుసుము ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైన వేయడాని అవకాశం ఉందన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో మద్యం దుకాణాలకు అక్టోబరు 23 న లక్కీ డ్రా నిర్వహించబోతున్నట్లు చెప్పారు. 47 మద్యం దుకాణాలకు సంబంధించి గౌడ కులస్థులకు మూడు, దుకాణాలు, ఎస్సీలకు ఐదు దుకాణాలు, ఎస్టీలకు ఒకటిగా రిజర్వేషన్లు కల్పించినట్లు చెప్పారు. రిజర్వేషన్ కల్పించిన దుకాణాలకు దరఖాస్తు చేసుకునేవారు కుల ధృవీకరణ పత్రంతో పాటు, మూడు లక్షల రూపాయల డిడి లేదా చలాన్ జతపరుచాల్సి ఉంటుందన్నారు. కుల ధృవీకరణ పత్రం సమయానికి అందని పక్షంలో వారు నవంబరు 15 తేదీ వరకు అందజేయాల్సి ఉంటుందన్నారు. అండర్ టేకింగ్ పత్రం జతపరచాల్సి ఉంటుంది. డిడి లేద చలాన్లను "జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి, నిర్మల్" పేరున తీయాల్సి ఉంటుందని తెలిపారు.



# పలు ఉద్యోగాలకు ఎంపికైన పాటిల్ జ్యోష్న

**సమయజ్యోతి న్యూస్ సెప్టెంబర్ 29 బజార్ హత్నూర్**



బజార్ హత్నూర్ మండలం లోని గిర్నూర్ గ్రామానికి చెందిన పాటిల్ మల్లయ్యా ప్రేమ దంపతుల కూతురు పాటిల్ జ్యోష్న గ్రూప్ 1 ఎంపికైంది ఇంతకు ముందు నిర్వహించిన పలు ఉద్యోగాలకు ఎంపికైనది మూడవ తరగతి వరకు శిశు మందిర్ ఇచోడ,లో పదవ తరగతి వరకు బెల్లంపల్లి ,లో ఇంటర్మీడియట్ సింగరేణి కళాశాల మంద మర్రి లో బీ ఎస్సీ ఫారెస్ట్ ఎమ్మెస్సీ అటవీ కళాశాల ములుగు,లో విద్యను అభ్యసించినది 2023 హైకోర్టు నోటిఫికేషన్ లో ఉట్నూర్ కోర్టు జూనియర్ అసిస్టెంట్ గా ఉద్యోగం సాధించినది 2024 లో గ్రూప్ 4 పరీక్ష రాసి హైదరాబాద్ లోని అంబేద్కర్ యూనివర్సిటీ లో జూనియర్ అసిస్టెంట్ గా ఎంపికయ్యారు గ్రూప్ 3 లోను మంచి ర్యాంకు సాధించినది తాజాగా గ్రూప్ 1 లో ఎం పీ డి ఓ నియామకం పత్రం అందుకుంది నిరంతరం శ్రమ తోనే విజయం సాధించవచ్చు అని జ్యోష్న పేర్కొన్నారు ఆమెను గ్రామస్తులు బంధువులు అభినందించారు

# రాజకీయ నాయకులు అమర వీరులను స్మరించుకోవడమే మరిచారు

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి మందమర్రి**

మందమర్రి పట్టణంలో ఆదివారం జరిగిన భగత్ సింగ్ జయంతిని పట్టణనికి చెందిన మాజీ సైనికుడు, సింగరేణి సంస్థలో సెక్యూరిటీ గా పనిచేస్తున్న రాజేష్ పహెల్వాల్ భగత్ సింగ్ జయంతిని నిర్వహించి భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి తన దేశభక్తిని చాటాడు నేటి యువత భగత్ సింగ్ ను ఆదర్శంగా తీసుకొని అవినీతి రహిత సమాజం కోసం దేశాభివృద్ధి కోసం పాటుపడాలని కోరడం జరిగింది. ఈ సందర్భంగా వికాస సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు హెచ్ రవీందర్, జిల్లా అధ్యక్షుడు సుందిర్ల రాజయ్య లు మాట్లాడుతూ మాజీ సైనికుడు సింగరేణి ఉద్యోగి రాజేష్ పహెల్వాల్ దంపతులు




స్వాతంత్ర్య సమరయోధుడు షీహిద్ భగత్ సింగ్ జయంతిని గుర్తుంచుకొని జరుపుకోవడం దేశం కోసం స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన ఇలాంటి వారిని స్మరించుకోవడం రాజేష్ పహెల్వాల్ దేశభక్తి చూస్తుంటే గర్వంగా ఉందని అదేవిధంగా ఈనాటి యువత తరానికి ఆదర్శమని తెలిపారు. ఇంక్విలాబ్ జిందాబాద్ అనే నినాదంతో బ్రిటిష్ సైన్యంతో పోరాడి వారిని గడగడలాడించిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ 23 ఏళ్ల పిన్న వయస్సులోనే దేశం కోసం తన ప్రాణాలను అర్పించిన ఆయన త్యాగం అందరికీ స్ఫూర్తిదాయకమని

ఈనాటి రాజకీయ నాయకులు దేశం కోసం పోరాడి అమరులను స్మరించుకోవడమే మరిచిపోయారని ఉన్నారు. ఈ కార్యక్రమంలో దావనపల్లి తిరుపతి, రాంరెడ్డి, లక్ష్మీదేవి, నక్క వెంకటస్వామి, కుమారస్వామి, కొమ్ములు తదితరుడు పాల్గొన్నారు.

# గ్రూప్ 1 లో 72వ ర్యాంకర్ కిషన్ పటేల్.. డీఎస్పీగా నియామకం.. యువతకు స్ఫూర్తిదాయకం

**సమయజ్యోతి హనుమకొండ ప్రతినిధి**

హనుమకొండ విద్యారణ్యపురి సాయి గణేశ్ కాలనీ నివాసి బీటెక్ అభ్యర్థి కిషన్ పటేల్(25) బీసీ మున్నూరు కాపు, తెలంగాణ గ్రూప్-1 లో 72వ ర్యాంక్ సాధించి డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ) గా నియమితులయ్యారు. ఆయనకు హైదరాబాద్ శిల్పారామంలో పోలీసు విభాగం నుండి అధికారికంగా పోస్టింగ్ ఆర్డర్ లభించింది. ఆయన డిఎస్పీగా ఉద్యోగ నియమాకాన్ని సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, స్నేహితులు సంతోషం వ్యక్తం చేసి, అభినందించారు. హెచ్ఎం కూరోజు దేవేందర్ శాలువాతో సన్మానించారు. కిషన్ కృషి, పట్టుదల, నిబద్ధతను అభినందించారు. యువతకు ప్రేరణగా నిలుస్తుందని ప్రశంసించారు. కిషన్ విజయయాత్రలో తల్లి తండ్రులు సునీతా రాణి, యుగేందర్ పటేల్, నానమ్మ కొమురమ్మ అందించిన మద్దతుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.



# సద్దుల బతుకమ్మ వేడుకలు

## పల్లెలతో సహా పట్టణాల్లో ఆనందోత్సాహం

**హైదరాబాద్,సెప్టెంబర్29(సమయజ్యోతి):**

సద్దులబతుకమ్మపై తెలంగాణ అంతటా గందరగోళం ఏర్పడింది. ఏ రోజు జరుపుకోవాలన్న సందిగ్ధత ఏర్పాడింది. చివరకు 9 రోజులు అయితే సోమవారం, గౌరమ్మను పంపించే వ్యవహారంతో సంబంధం లేకుండా మంగళవారం, మధ్యే మార్గంగా కొన్నిచోట్ల బుధవారం జరుపుకోవాలని నిర్ణయించారు. ఈ యేడు ఒక్కోచోట ఒక్కోరోజు సద్దుల బతుకమ్మ నిర్వహించడం గమనార్హం. మొత్తంగా తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమైన బతుకమ్మ పండగ తుది అంకానికి చేరింది. సద్దుల బతుకమ్మతో బతుకమ్మ సంబరాలు ముగియనున్నాయి. గతంలో ఎప్పుడూ లేనంతగా వరదలు ముంచెత్తడడంతో హైదరాబాద్ తదిర ప్రాంతాల్లో బతుకమ్మ కళ తప్పింది. ఊరూవాడా వారం రోజులుగా బతుకమ్మ పండగ జోరుగా సాగాల్సి ఉన్నా వర్షాల భయంభయంగా ఆడపడచులు బతుకమ్మను ఆడిపాడారు. ఆడపడుచుల రాకతో గ్రామాలు కళకళలాడాల్సి ఉన్నా ఎక్కడా పెద్దగా సందడి కానరాలేదు. గతంలో సద్దుల బతుకమ్మ వేడుకలుకు పల్లెలు మొదలు పట్టణాల వరకు ముస్తాబయ్యేయి. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా బతుకమ్మను నిర్వహించేవారు. సిద్దిపేట, వరగంల్ తదితర పట్టణాల్లో వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. ప్రకృతి రమణీయకతకు బతుకమ్మ నిదర్శనం. ఆశ్వయుజ మాసం శుద్ధ పాఢ్యమి నుంచి తొమ్మిది రోజుల పాటు బతుకమ్మను వేడుకగా జరుపుకుంటారు. రంగురంగుల పూలను త్రికోణాకృతిలో పేర్చి, అలంకరించిన బతుకమ్మల చుట్టూ చప్పట్లు కొడుతూ..ఆడి, పాడతారు. అప్పుడు మహిళలు పాడే పాటలు మనసుకు హత్తుకుంటాయి. ఏరోజు ప్రత్యేకత ఆ రోజుదే. ఇలా తొమ్మిది రోజులు ఆడిన బతుకమ్మలను నీటిలో నిమజ్జనం చేసి, నైవేద్యంగా పెట్టిన ప్రసాదాన్ని ఆడపడుచులంతా పంచు కుంటారు. తొమ్మిదో రోజు వేడుకగా సద్దుల బతుకమ్మను నిర్వహించి గౌరీదేవిని సాగనంపుతారు. ఇదో రకంగా గౌరీపూజను చేయడం.. అమ్మవారికి దసరా ముందు శరన్నవరాత్రులు ఎలా జరుపుతామో తెలంగాణాలో 9రోజులపాటు బతుకమ్మ వేడుకలను అలా జరుపడం ఆనవాయితీ. ఈ 9 రోజుల్లో కూడా తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి మహిళలంతా గుమిగూడా ఆడుకోవడం...ఆడపిల్లలను ఇంటికి రప్పించి వేడుక చేయడం పెద్ద సరదా. రంగురంగుల పుష్ప సౌందర్యాల హంగులతో సింగారించుకొనే బంగరు కల్పవల్లిగా బతుకమ్మను తెలంగాణవాసులు భావిస్తారు. ఓ పళ్లెంలో గుమ్మడి ఆకులు పరచి, వాటిని పసుపు కుంకుమలతో అలంకరిస్తారు. ముందుగా గుమ్మడి పువ్వుల్ని అమర్చి- అక్కడే తంగేడు, బీర, గన్నేరు, నిత్య మల్లె, బంతి వంటి పుష్పాల్నిపేర్చి కూర్చుడం కళాత్మకంగా చేస్తారు. అదే పువ్వుల దొంతరపై తమలపాకులో పసుపు గౌరమ్మను అలంకరిస్తారు. ఆ పుష్ప సముదాయాన్నే బతుకమ్మగా వ్యవహరిస్తారు. మహిళలు లయాత్మకంగా అడుగులు వేస్తూ, చుట్టూ ప్రదక్షిణ చేస్తారు. బతుకమ్మ ఆవిర్భావం, గౌరీదేవి లీలలు, సామాజిక జీవన రీతులు, కుటుంబాల అనుబంధాలు, పురాణగాథలు, ఇతిహాస ఘట్టాల్ని వారు పాటల రూపంలో ఆలపిస్తారు. పసుపుబొట్టు పేరిట తాంబూలాలు ఇచ్చి పుచ్చుకొంటారు. బతుకమ్మను పసుపు, కుంకుమలతో ఆరాధించి వివిధ రకాల పదార్థాల్ని నివేదన చేస్తారు. ఆటపాటల అనంతరం, ప్రతి నిత్యం జలాశయాల్లో నిమజ్జనం చేయడం ఈ సంప్రదాయంలో ఒక భాగం. ప్రకృతి స్వరూపిణిగా అమ్మవారిని భావించి, వివిధ పుష్పాలతో పేర్చి 'బతుకమ్మ'గా ఆరాధిస్తారు. పూలతో బతుకమ్మ ఆవిర్భవించడం, ఆటపాటలతో అలరింతగా వేడుక చేయడం, నిమజ్జనంతో అనంత ప్రకృతిలో సంలీనం కావడం అనేవి- జగన్మాత సృష్టి, స్థితి, లయాత్మక తత్వాలకు సంకేతాలుగా భావించాలి. మహాలయ అమావాస్య నుంచి మహర్నవమి వరకు సాగే ఈ ఉత్సవం తెలంగాణ సాంస్కృతిక సౌరభాల్ని వెదజల్లుతుంది. అందుకే మన జీవన విధానం, సామాజిక ఏకత్వానికి మన పండుగలు ప్రతీకలుగా నిలుస్తున్నాయి. తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమైన బతుకమ్మ పండగలో ప్రకృతి ఆరాధనతో పాటు కుటుంబ కట్టుబాటు, ఆచారాలు ఇమిడి ఉన్నాయి. ఆటపాటల నేపథ్యంగా, నిత్య జీవన రీతికి అనుగుణంగా ఈ సంబరాల్ని కొనసాగించారు. తొమ్మిది రోజులూ గౌరీదేవి పుట్టింటికి తరలి వచ్చినట్లు భావిస్తారు. తమ ఇంటి ఆడబిడ్డగా బతుకమ్మను భావిస్తూ, ఆరాధన చేస్తారు. తొమ్మిదో రోజున సద్దుల బతుకమ్మకు సాగనంపు వేడుక నిర్వహించడం సద్దుల బతుకమ్మ ప్రత్యేకత.

# ప్రజలకు బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు

## రిజర్వేషన్లతో బీసీ బిడ్డలకు పండుగ వాతావరణం

**హైదరాబాద్, సెప్టెంబర్29(సమయజ్యోతి):**

ప్రజలందరికీ మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. సోమవారం గాంధీభవన్‌లో మంత్రులు మీడియాతో మాట్లాడుతూ.. దసరా కంటే ముందే బీసీ బిడ్డలకు పండుగ వాతావరణం వచ్చిందన్నారు. మాతృమూర్తికి ప్రసవ వేదన అనేది ప్రకృతి ఇచ్చిన వరమని.. అలాగే 42 శాతం రిజర్వేషన్లు బీసీ బిడ్డలకు ఇచ్చిన వరంగా పేర్కొన్నారు. 'మేము ఎంతో మాకు అంతా వాటా' అని రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో కులగణన చేశారని.. కులగణన ఆధారంగా బీసీ రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. తాము ఎవరికీ వ్యతిరేకం కాదని... ఎవరి నోటి కాడ ముద్ద లాక్కోవడం లేదని స్పష్టం చేశారు. వాస్తవానికి బీసీలకు రిజర్వేషన్లలలో ఇంకా వాటా రావాలి కానీ కుదించుకొని 42 శాతం రావాలి అని అడుగుతున్నామని చెప్పుకొచ్చారు. పార్టీ మెప్పు కోసం, నాయకుల మెప్పు కోసం ఎవరూ మాట్లాడి సమాజంలో తలవంపులు తెచ్చుకోవద్దని అన్ని పార్టీల బీసీ నాయకులకు తాము కోరుతున్నామన్నారు. ఇది న్యాయపరమైన కోరికగా వెల్లడించారు.రిజర్వేషన్లు అమలు కాకపోతే బీసీ బిడ్డలు ఇంకా వెనకబడిపోతారన్నారు. జయలలిత బీసీ రిజర్వేషన్లు పెంచి 9 షెడ్యూలు పెట్టినప్పుడు జయలలిత పార్టీ కేంద్రంలో అధికారంలో లేదని తెలిపారు. రాష్ట్రాల్లో ప్రజలు కోరుకుంటున్నారు కాబట్టి కేంద్రం బిల్లుకు ఆమోదం తెలపాలని అన్నారు. 'అంతేకాని మీరే హామీ ఇచ్చారు.... మీరే చేయాలి అని బట్ట కాల్చి మీద వేస్తాం అంటే ఎలా?' అని మండిపడ్డారు. రాష్ట్ర పరిధిలో ఉన్న అన్ని ప్రయత్నాలు చేశామని....ఇప్పుడు కేంద్రం చేయాలన్నారు. అది చేయకపోగా అనుమానాలు ఉన్నాయి అంటున్నారని... అనుమానాలు ఉంటే వ్యక్తం చేయమని కూడా చెప్పామన్నారు. అవేమీ చేయకుండా బీజేపీ నాయకులు కాళ్లలో కట్టె పెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. బీసీ బిడ్డలందరికీ పోటీ చేసే అవకాశం దొరికింది... దయచేసి అన్ని వర్గాలు సహకరించాలని మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీహరి కోరారు.

# రాష్ట్రంలో ఫుల్‌గా రియల్‌ఎస్టేట్ దందా

## రాష్ట్రాన్ని దోచుకుంటున్న రేవంత్-తెలంగాణ ఆస్తులను ప్రైవేటు కంపెనీలకు : మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్29(సమయజ్యోతి):**

సీఎం రేవంత్‌రెడ్డికి రియల్‌ఎస్టేట్ దందా తప్పిదే ఇంకేం తెలియదని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ దందా ఫుల్‌గా నడుస్తున్నదని ఆరోపించారు. ఓ పథకం ప్రకారం ఎల్ అండ్ టీ సంస్థపై ఒత్తిడి తెచ్చి హైదరాబాద్ మెట్రో నుంచి తప్పించారని, తద్వారా రూ.వెయ్యి కోట్లు లాభం పొందాడన్నారు. రాష్ట్ర ప్రజలపై రూ.15 వేల కోట్ల భారం మోపారని విమర్శించారు. హైదరాబాద్ మెట్రో ప్రజలకు అందుబాటులో లేకుండా చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్ మెట్రోకు ఉన్న రూ.35వేల కోట్ల ఆస్తులను ఆదాని, మెగాకి కట్టబెట్టడానికి ప్రణాళిక సిద్ధం చేశారన్నారు. హైదరాబాద్ తెలంగాణ భవన్ బీఆర్ఎస్ నేతలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీసీ ప్రజలను మోసం చేసి తెలంగాణ ప్రజలపై రుద్దాలని చూస్తున్నారని చెప్పారు. ఈ ప్రభుత్వం, ముఖ్యమంత్రి అంటేనే ప్రకలకు ఒక జోక్ అయిందని ఎద్దేవా చేశారు. పెరుగుతున్న జనాభాకు ఇంకో 50 ఏండ్లకు సరిపోయే పద్ధతుల్లో మెట్రోను మూడు ఫేజ్‌ల్లో విస్తరించాలని కేసీఆర్ ఆనాడు చెప్పారని గుర్తుచేశారు. దీనికి క్యాబినెట్ సమావేశంలో చర్చ చేసి, మంత్రుల అభిప్రాయాలను తీసుకొని అవసరమున్న చోట మెట్రో విస్తరణ చేయడానికి ప్రణాళికలు చేశారని తెలిపారు. మూడు ఫేజ్‌ల్లో హైదరాబాద్ లోని అన్ని ప్రాంతాల ప్రజలకు అనువుగా ఉండేవిధంగా, శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు కలుపుతూ మెట్రోను కట్టాలని కేసీఆర్ ప్రణాళికలు చేశారన్నారు. ముఖ్యమంత్రి ఒక మాట మాట్లాడితే, మంత్రులు, ఎమ్మెల్యేలు మరో మాట మాట్లాడుతున్నారు. ఫ్యూచర్ లేని సిటీ ఫ్యూచర్ సిటీ అన్నారు. జనమే లేని చోట, ఇండ్లు లేని చోట, జనావాసాలు లేని చోట ఫోర్త్ సిటీకి రోడ్లు వేస్తా, మెట్రో తీసుకోపోతా అని రేవంత్ రెడ్డి అంటున్నాడని మండిపడ్డారు. గురుశిష్యులు ఇద్దరు కలిసి ఒకే రైలులో అమరావతికి వెళ్తారా అని ప్రశ్నించారు.



రాష్ట్రంలో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉంది. కాంగ్రెస్ వచ్చాక ఒక్క తట్టెడు మట్టి కూడా వేయలేదు. ఇల్లు లేని దగ్గర రోడ్లు వేయడం రేవంత్ మూర?త్వమే అవుతుంది. స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయి అని ప్రజలు నమ్మడం లేదని, ఈ ప్రభుత్వంపై విశ్వాసం లేదన్నారు.వీళ్ళు ప్రభుత్వాన్ని నడుపుతున్నారా? సర్కస్ నడుపుతున్నారా?. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మైక్ ముందు ట్రిపుల్ ఆర్ రోడ్డు వెంటనే పూర్తి చేస్తామని అంటాడు.. బాధితులు వెళ్తే అది ఇప్పట్లో అవ్వదు వెళ్లిపోండి అని అంటాడు. సినిమాలకు ముందు రోజు టికెట్ రేట్లు పెంచితే, తనకు తెలియకుండా పెంచారు అని అంటాడని విమర్శించారు. మరో మంత్రి జూపల్లి కృష్ణారావు లిక్కర్ బ్రాండ్లను తనకు తెలియకుండా మార్చారని, నోటిఫికేషన్లు ఇచ్చారని అంటాడని మండిపడ్డారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నిరుద్యోగులకు ఇస్తామన్న ఉద్యోగాలు ఇవ్వకుండా ఈ ప్రభుత్వం మోసం చేసింది అంటాడు.. మళ్ళీ పొద్దుగాల రేవంత్ రెడ్డికి, నాకు మధ్య గ్యాప్ ఏమి లేదని అంటాడని ఎద్దేవా చేశారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఈ ప్రభుత్వంలో కమిషన్ల దందా నడుస్తుంది.. పొల్యూషన్ చేస్తున్న కంపెనీలను తగలబెడుతా అని అంటాడు. ఎల్లారెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు నా నియోజకవర్గంలో వరదలు వచ్చాయి, మా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ప్రపంచ బ్యాంకుకు లేఖ రాశాడు. ప్రపంచ బ్యాంకు కేంద్రం అనుమతి లేకుంటే రాష్ట్ర ప్రభుత్వానికే అప్పు ఇవ్వదు, ఆయన తన నియోజకవర్గానికి అప్పు ఇవ్వాలని లేఖ రాశాడు. చొప్పదండి కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అసలు రిజర్వేషన్లే సరిగ్గా చేయలేదని చీఫ్ సెక్రటరీకి లేఖ రాశాడు. అసలు ఈ ప్రభుత్వంలో ఏం నడుస్తుందని జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు.

# పైరసీతో నిర్మాతలకు కోట్లల్లో నష్టాలు

## మొదటిసారిగా పైరసీ గ్యాంగ్‌ను పట్టుకున్నాం : సీపీ ఆనంద్

**హైదరాబాద్, సెప్టెంబర్29(సమయజ్యోతి):**



సినిమాల పైరసీ వల్ల నిర్మాతల కష్టం వృథా అవుతోందని.. ఈ పరిశ్రమ బాగా ప్రభావానికి గురవుతోందని హైదరాబాద్ సీపీసీవీ ఆనంద్ వ్యాఖ్యానించారు. పైరసీపై తెలుగు ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పేర్కొన్నారు. నాలుగు నెలలు కష్టపడి దర్యాప్తు చేశామని గుర్తుచేశారు. దేశంలో మొదటి సారి పైరసీ చేస్తున్న ఓ గ్యాంగ్‌ను పట్టుకున్నామని వెల్లడించారు. 2023లో భారత దేశంలోని చిత్ర పరిశ్రమ రూ. 22,400 కోట్లు పైరసీతో నష్టపోయిందని చెప్పుకొచ్చారు సీపీ సీవీ ఆనంద్. 2024లో తెలుగు చిత్ర పరిశ్రమ రూ. 3700 కోట్లు నష్టపోయిందని తెలిపారు. ఈ అంశాలన్నీ దృష్టిలో ఉంచుకుని సమగ్ర దర్యాప్తు చేశామని పేర్కొన్నారు. పైరసీ మూవీస్ వల్ల ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు కూడా ప్రేక్షకులు అలవాటు పడుతున్నారని చెప్పుకొచ్చారు. ఓ వెబ్‌సైట్, టెలిగ్రామ్ ద్వారా పైరసీ మూవీలు స్ట్రీమింగ్ చేస్తున్నారని వివరించారు. సర్వర్స్ హ్యాకింగ్‌తో పాటు క్యామ్ కార్డర్ ద్వారా నిందితులు సినిమాలను పైరసీ చేస్తున్నారని తెలిపారు. బెట్టింగ్ గేమింగ్ యాప్స్ నిర్వాహకులు పైరసీ చేసేవారికి డబ్బులు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు సీపీ సీవీ ఆనంద్. బెట్టింగ్ యాప్ నిర్వాహకులు పైరసీ మూవీల ద్వారా వారి యాప్‌లను ప్రచారం చేసుకుంటున్నారు. తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఫిర్యాదు అందుకున్న వెంటనే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. తమిళ్ బ్లాస్టర్స్, ఫైవ్ మూవీ రూల్స్, తమిళ్ మూవీ వెబ్‌సైట్ లలో పైరసీ సినిమాలను అందుబాటులో ఉంచుతున్నారు. ఈ కేసులో హైదరాబాద్‌కు చెందిన జానా కిరణ్ కుమార్ అత్తాపూర్‌లోని మంత్ర మాల్ థియేటర్‌లో సినిమా కాపీ చేశాడు. ఫిర్యాదు అనంతరం 44 మంది అనుమానితులను విచారించిన తర్వాత అసలు నిందితుడు జానా కిరణ్ కుమార్‌గా తేలింది. చాలా సినిమాలని అత్తాపూర్‌లోని మంత్ర థియేటర్‌లో మొబైల్‌తో రికార్డ్ చేసి సిరిల్ అనే వ్యక్తికి అందచేశారు. నలబై మూవీలు థియేటర్‌లో కాపీ చేశాడు. ప్రతి సినిమాకు 300 నుంచి 400 డాలర్లను బిట్ కాయిన్స్ రూపంలో కిరణ్ కుమార్ తీసుకుంటున్నాడు. అనంతరం క్రిఫ్టో కరెన్సీ ట్రేడింగ్ ఫ్లాట్ ఫాంని ఉపయోగించి ఇండియన్ కరెన్సీలోకి మార్చుకుంటున్నారు. సినిమా పైరసీ చేయడానికి అనువైన సీటు చూసుకుని.. టికెట్ బుక్ చేసుకుని హై ఎండ్ కెమెరా ఉన్న ఫోన్‌తో రికార్డ్ చేస్తారు. స్క్రీన్ ఆఫ్ ఉన్నా కెమెరాల్లో వీడియో రికార్డ్ చేసే యాప్ ద్వారా అనుమానం రాకుండా ఇదంతా చేస్తున్నారు. అలాగే, బీహార్‌కు చెందిన అర్సలన్ అహ్మద్ కూడా హిందీ భోజ్‌పురి సినిమాలు రికార్డ్ చేసి సిరిల్‌కు పంపుతాడు' అని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

# హైదరాబాద్ చేరుకున్న తిలక్ వర్మ

## శంషాబాద్‌లో ఘనంగా స్వాగతం

**హైదరాబాద్,సెప్టెంబర్29(సమయజ్యోతి):**

ఆసియా కప్ ఫైనల్ హీరో, తెలుగు క్రికెటర్ తిలక్ వర్మకు శంషాబాద్ ఎయిర్ పోర్టులో గ్రాండ్ వెల్కమ్ లభించింది. ఆసియా కప్ ముగించుకుని ఢిల్లీ నుంచి సోమవారం రాత్రి శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకున్న తిలక్ వర్మకు ఎయిర్ పోర్టులో కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. భారీ గజమాలతో అదిరిపోయే వెల్కమ్ పలికారు.తెలంగాణ ప్రభుత్వం తరుపున రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి తిలక్ వర్మకు ఎయిర్ పోర్టులో స్వాగతం పలికి అనంతరం సన్మానించారు. తిలక్ వర్మను చూసేందుకు భారీ సంఖ్యలో అభిమానులు శంషాబాద్ విమానాశ్రయానికి తరలివచ్చిన నేపథ్యంలో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. తిలక్ తన సొంత కారు సన్ రూఫ్ నుంచి ఫ్యాన్స్?కు అభివాదం చేస్తూ ఇంటికి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా శివసేనా రెడ్డి మాట్లాడుతూ..పాకిస్తాన్‌తో జరిగిన ఆసియా కప్ ఫైనల్లో అద్భుతమైన ప్రతిభ ప్రదర్శించి హైదరాబాద్ తెలంగాణకే కాదు యావత్ దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చిన తిలక్ వర్మను అభినందించారు. క్లిష్ట పరిస్థితుల్లో తిలక్ వర్మ జట్టును గెలిపించిన విధానం యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తుందని ఆయన అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తిలక్ వర్మను ప్రత్యేకంగా అభినందించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.ఇండియా?పాక్ మధ్య మ్యాచ్ ఎలా ఉండాలని సగటు అభిమాని కోరుకుంటాడో ఆదివారం దుబాయ్ వేదికగా జరిగిన ఫైనల్ పోరు అచ్చం అలానే సాగింది. అనూహ్య మలుపులు తిరుగుతూ ఉత్రూతలూగించింది. ఆధిపత్యం చేతులూ మారుతూ తీవ్ర ఉత్కంఠను రేకెత్తించింది. తొలి పది ఓవర్లలో బ్యాటింగ్‌లో ఓ రేంజ్‌లో విజృంభిస్తున్న పాక్‌ను ఇండియా స్పిన్నర్లు చుట్టేశారు. 180 స్కోరు పక్కా అనుకుంటే 150 కూడా దాటకుండా పడగొట్టేశారు. 147 రన్స్ చిన్న టా÷-గ్గ్÷ట్ ఛేజింగ్ ఇండియాకు నల్లేరు మీద నడకే అనుకుంటే.. నాలుగు ఓవర్లు తిరిగే సరికి టాప్?3 బ్యాటర్లు పెవిలియన్ బాట పట్టేశారు. పాక్ చేతిలో ఓడిపోతే ఎలా అన్న భయం మెల్లగా మొదలైంది. హార్ట్‌బీట్ అమాంతం పెరిగింది. అప్పుడొచ్చాడు మన హైదరా'బాద్‌షా' తిలక్ వర్మ. క్రికెట్ వరల్డ్‌లోనే అతి పెద్ద మ్యాచ్‌లో .. అత్యంత ఒత్తిడిలోనూ నిర్భయంగా.. అద్భుతంగా ఆడుతూ పాక్ బౌలింగ్‌ను చీల్చి చెండాడాడు. ఇటుకా ఇటుకా పేరుస్తూ తన కెరీర్‌లో చిరకాలం నిలిచిపోయే ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించి తెలుగు క్రికెటర్ తిలక్ వర్మ హీరో అయ్యాడు.

# సాగర్‌కు భారీగా వరదనీరు

## 26 క్రస్ట్ గేట్లు ఎత్తివేత

**నాగార్జునసాగర్,సెప్టెంబర్29(సమయజ్యోతి):**

ఎగువన కురుస్తోన్న వర్షాలతో నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌కు వరద పొటెత్తింది. సోమవారం రాత్రి సాగర్‌ప్రాజెక్ట్‌కు ఉధృతంగా వరద నీరు రావడంతో26 క్రస్ట్ గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు అధికారులు. ప్రాజెక్ట్‌కు 6,25,810 క్యూసెక్కుల ఇన్ ఎ÷-లో వస్తుండగా.. ప్రాజెక్ట్ ఇప్పటికే నిండుకుండలా ఉండటంతో వచ్చిన నీటిని వచ్చినట్లే కిందకు వదులుతున్నారు అధికారులు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుత నీటి మట్టం585.20 అడుగులుగా ఉంది. పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.0450 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 295.010.టీఎంసీల నీరు నిల్వ ఉంది. జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. నాగార్జున సాగర్ డ్యాంకు భారీగా వరద పొటెత్తడంతో దిగువ ప్రాంత ప్రజలకు ప్రాజెక్ట్ అధికారులు ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ప్రస్తుతం ప్రాజెక్ట్?కు 6 లక్షల ఇన్ ఎ÷-లో వస్తుండగా వరద మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. దిగువ కృష్ణ పరివాహక ప్రాంతంలో ఉన్న మత్స్యకారులు, పశువుల కాపరులు, సమీప గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

# ఆస్తులను అమ్మేందుకు అనుమతి ఇవ్వాలని సుప్రీంకోర్టును ఆశ్రయించిన సహారా

**న్యూఢిల్లీ, సెప్టెంబర్29(సమయజ్యోతి):**

సహారా గ్రూప్ కంపెనీల కంపెనీ పాలసీ మేకర్స్ ఈ గ్రూప్ ఆస్తులను అదానీ ప్రాపర్టీస్ లిమిటెడ్‌కు విక్రయించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకు అనుమతి కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. మహారాష్ట్రలోని అంబీ వ్యాలీ, లక్నోలోని షహారా సిటీతో సహా వివిధ ఆస్తులను అదానీ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు విక్రయించడానికి అనుమతి కోరుతూ సహారా ఇండియా కమర్షియల్ కార్పొరేషన్ లిమిటెడ్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై అక్టోబర్ 14న విచారణ జరిగే అవకాశం ఉన్నది. న్యాయవాది గౌతమ్ అవస్థి దాఖలు ఈ పిటిషన్ దాఖలు చేశారు. సెప్టెంబర్ 6 నాటి టర్మ్ షీట్‌లో పేర్కొన్న నిబంధనలు, షరతులపై గ్రూప్ ఆస్తులను అదానీ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు విక్రయించేందుకు అత్యున్నత న్యాయస్థానం అనుమతి కోరుతూ పిటిషన్ దాఖలు చేసింది సహారా గ్రూప్. పెండింగ్‌లో ఉన్న సహారా గ్రూప్ కేసుల్లో దాఖలు చేసిన మధ్యంతర దరఖాస్తులో కోర్టు ఎప్పటికప్పుడు జారీ చేసిన వివిధ ఆదేశాలకు అనుగుణంగా.. అనుమతి పొందిన తర్వాత ఎస్ఐసీసీఎల్, సహారా గ్రూప్ కొన్ని చరాస్తులు, స్థిరాస్తుల అమ్మకాలను చాలా కష్టంతో చేయగలిగాయని తెలిపింది. ఈ నిధులను సెబీ–సహారా రీఫండ్ ఖాతాలో జమ చేశారు. మొత్తం రూ.24,030 కోట్ల ప్రిన్సిపల్ మొత్తంలో సహారా గ్రూప్ తన చరాస్తులు, స్థిర ఆస్తుల అమ్మకం, లిక్విడేషన్ ద్వారా సుమారు రూ.16వేల కోట్లు సేకరించి, సెబీ–సహారా రీఫండ్ ఖాతాలో జమ చేసింది అని తెలిపింది. ఎస్టేట్ బ్రోకరేజ్ కంపెనీల సేవలను ఉపయోగించినప్పటికీ సహారా గ్రూప్ ఆస్తులను లిక్విడేట్ చేయడం, విక్రయించడంలో సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) అసమర్థతను ఎత్తి చూపుతూ.. సెబీ–సహారా రీఫండ్ ఖాతాలో జమ చేసిన మొత్తాన్ని చాలా కష్టంతో, దరఖాస్తుదారు, సహారా గ్రూప్ ప్రయత్నాల ద్వారా జమ చేశామని ఎస్ఐసీసీఎల్ తెలిపింది. నవంబర్ 2023లో సహారా గ్రూప్ చీఫ్ సుబ్రతా రాయ్ మరణం తర్వాత.. గ్రూప్ తన ఏకైక నిర్ణయాధికారిని కోల్పోయిందని ఎస్ఐసీసీఎల్ పేర్కొంది. ఆయన తన జీవితకాలంలో గ్రూప్ తరపున అన్ని నిర్ణయాలు తీసుకున్నారని.. దివంగత సుబ్రతా రాయ్ కుటుంబ సభ్యులు సహారా గ్రూప్ రోజువారీ వ్యాపార కార్యకలాపాలు, నిర్వహణలో పాల్గొనలేదని.. అయితే పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడాలనే కుటుంబ సభ్యుల కోరికను దృష్టిలో ఉంచుకుని సహారా గ్రూప్ ఆస్తులను సాధ్యమైనంత ఎక్కువ ధరకు విక్రయించాలని.. ఈ కోర్టు జారీ చేసిన ఆదేశాలను పాటించాలని, సహారా గ్రూప్ బాధ్యతలను తీర్చాలని, ప్రస్తుత ధిక్కార చర్యలను ముగించాలని నిర్ణయించినట్లుగా పిటిషన్‌లో పేర్కొంది. వాటాదారుల ప్రయోజనాల కోసం, ముఖ్యంగా సహారా గ్రూప్ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎస్ఐసీసీఎల్ తెలిపింది.ఎస్ఐసీసీఎల్ ప్రకారం.. ప్రస్తుత మార్కెట్ పరిస్థితులు, ఆచరణీయమైన ఆఫర్లు లేకపోవడం, అనేక పెండింగ్ వ్యాజ్యాల కారణంగా ఈ ప్రయత్నాలు ఎలాంటి సానుకూల ఫలితాలను ఇవ్వలేదని.. ఇది సమష్టిగా కొనుగోలుదారుల విశ్వాసాన్ని దెబ్బతీసిందని, ఆస్తుల మార్కెట్ సామర్థ్యాన్ని గణనీయంగా ప్రభావితం చేసిందని తెలిపింది. దివంగత సుబ్రతా రాయ్ కుటుంబ సభ్యులు, సహారా గ్రూప్, ఇతర సీనియర్ అధికారులపై బహుళ దర్యాప్తు సంస్థలు విచారణలు ప్రారంభించడం ద్వారా ప్రయత్నాలు మరింత క్లిష్టంగా మారాయని ఎస్ఐసీసీఎల్ పేర్కొంది. తాము పేర్కొన్నవన్నీ సమాంతర, సమన్వయం లేని చర్యలు పెట్టుబడిదారులు, డిపాజిటర్ల మనసులో గందరగోళం, విరుద్ధమైన కథనాలు, అవసరమైన అనుమానాలను సృష్టించడమే కాకుండా సహారా గ్రూప్ తన ఆస్తులను డబ్బు ఆర్జించడానికి, కోర్టు ఆదేశాలను పాటించడానికి చేస్తున్న ప్రయత్నాలను సమర్థవంతంగా అడ్డుకుంటున్నాయని పిటిషన్‌లో వెల్లడించింది.

# బతుకమ్మకు రెండు గిన్నిస్ రికార్డులు

## హర్షం వ్యక్తం చేసిన మంత్రులు

## వేడుకకు హాజరైన అందాల ముద్దుగుమ్మలు

**హైదరాబాద్,సెప్టెంబర్29(సమయజ్యోతి):**

తెలంగాణ బతుకమ్మ సంబరాలు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్‌ను సొంతం చేసుకున్నందుకు మంత్రులు సీతక్క,జూపల్లి కృష్ణారావులు హర్షం వ్యక్తం చేశారు.గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి బతుకమ్మ వేడుక నమోదైంది. పది వేల మంది మహిళలు బతుకమ్మ చుట్టూ తిరుగుతూ.. పాటలు పాడుతుండగా గిన్నిస్ బుక్ ప్రతినిధులు వివరాలను నమోదు చేసుకుని ఫలితాన్ని ప్రకటించారు. ఒకేసారి పది వేల మందితో బతుకమ్మ ఆడించి గిన్నిస్ రికార్డుల్లో స్థానం దక్కించుకోవడమే లక్ష్యంగా మహా బతుకమ్మ కార్యక్రమం కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. ఈ మేరకు అధికారుల అంచనాలను మించి మహా బత్తుకమ్మ రెండు గిన్నిస్ రికార్డులను సొంతం చేసుకుంది. యి. ఏకంగా రెండు గిన్నిస్ రికార్డులను సాధించి చరిత్ర సృష్టించాయి. హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో మహా బతుకమ్మ కార్యక్రమాన్ని అధికారులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ కోసం 10 వేల మందితో బతుకమ్మ వేడుకను అధికారులు చేపట్టారు. మహా బతుకమ్మ దగ్గర గిన్నిస్ బుక్ రికార్డు సభ్యుల పర్యవేక్షణ చేశారు. ఈ నేపథ్యంలో మహా బతుకమ్మ కార్యక్రమం ఏకంగా రెండు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులను సొంతం చేసుకుంది. అతిపెద్ద జానపద నృత్యంగా తెలంగాణ బతుకమ్మ ఒక గిన్నిస్ రికార్డు సాధించింది. మరో రికార్డుగా 66.5 అడుగుల భారీ బతుకమ్మ చుట్టూ ఒకేసారి 1,354 మంది మహిళలు లయబద్ధంగా బతుకమ్మ ఆడి మరో గిన్నిస్ రికార్డు క్రియేట్ చేశారు. ఈ మేరకు తెలంగాణ బతుకమ్మ వేడుకకు 2 గిన్నిస్ రికార్డులు దక్కాయి. ఇలా తెలంగాణ పూల సింగిడి.. ఆడబిడ్డల పండుగ బతుకమ్మ మరో అరుదైన ఘనత దక్కించుకుంది. బతుకమ్మ వేడుకలను పురస్కరించుకుని సోమవారం సరూర్ నగర్ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో భారీ ఎత్తున బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరూర్ నగర్ స్టేడియంలో 63 అడుగులు ఎత్తు, 11 అడుగుల వెడల్పు, 7 టన్నుల బరువుతో భారీ బతుకమ్మను ఏర్పాటు చేశారు. ఆకాశాన్నంటే ఈ 63 అడుగుల మెగా బతుకమ్మ 'అతిపెద్ద బతుకమ్మ'గా గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించింది. దీంతో పాటు బతుకమ్మ మరో ఘనత దక్కించుకుంది. ఈ 63 అడుగుల భారీ బతుకమ్మ చుట్టూ 1354 మంది మహిళలు ఒకేసారి ఆడిపాడారు. దీంతో ఒకేసారి ఎక్కువ మంది మహిళలు ఆడిపాడిన తెలంగాణ జానపద నృత్యంగా బతుకమ్మ గిన్నిస్ బుక్ రికార్డ్ నమోదు చేసింది. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు స్వయంగా పరిశీలించి ఈ మేరకు ప్రకటన చేశారు. తెలంగాణ పూల సింగిడి బతుకమ్మ 2 గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సాధించడం పట్ల మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ..బతుకమ్మ ఖ్యాతిని ప్రపంచానికి చాటామని అన్నారు.బతుకమ్మ గిన్నిస్ బుక్ రికార్డ్ కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. ఆడబిడ్డలు అందరి జీవితాల్లో వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. గల్లి నుంచి గ్లోబల్ వరకు ఏదైనా సాధిస్తామని మహిళలు నిరూపించారన్నారు. ఏ రంగంలోనైనా ముందుడుగు వేస్తామని అన్నారు. ఇంతగొప్ప కార్యక్రమం చేసిన సీఎం, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. బతుకమ్మకు ప్రతిష్టాత్మక గిన్నిస్ రికార్డ్ కోసం రెండు నెలలుగా కృషి చేసి కార్యక్రమం విజయవంతం చేసిన అందిరికి ఈ సందర్భంగా సీతక్క అభినందలు తెలియజేశారు. సరూర్‌నగర్ స్టేడియంలో మహా బతుకమ్మ వేడుకలకు మిస్ వరల్డ్ ముద్దుగుమ్మలు హాజరై.. స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచారు. థాయ్‌లాండ్‌కు చెందిన మిస్ వరల్డ్ ఒపాల్ సుచత



చువాంగ్ పాల్గొని బతుకమ్మను వేడుకలను తిలకించారు. అనంతరం మంత్రి సీతక్కతో కలిసి అందాల భామలు బతుకమ్మ ఆడారు. ఈ మేరకు మిస్ వరల్డ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర కల్చర్ అంటే తనకు ఎంతో ఇష్టమని తెలిపింది. కాగా, తెలంగాణ బతుకమ్మ సంబరాలు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్ సొంతం చేసుకున్నాయి. ఏకంగా రెండు గిన్నిస్ రికార్డులను సాధించి.. చరిత్ర సృష్టించాయి. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ కోసం 10 వేల మందితో బతుకమ్మ వేడుకను ప్రభుత్వం చేపట్టింది. ఈ నేపథ్యంలో మహా బతుకమ్మ కార్యక్రమం ఏకంగా రెండు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులను సొంతం చేసుకుంది.

# ఆ పదిమంది ముమ్మాటికీ పార్టీ మారారు: పల్లా

**హైదరాబాద్,సెప్టెంబర్29(సమయజ్యోతి):**

తెలంగాణ రాజకీయాల్లో ఫిరాయింపు ఎమ్మెల్యేలపై వాయిదా వేయలేని ఉత్కంఠ కొనసాగుతోంది. 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరిన విషయం బహిరంగంగా వెల్లడైన సంగతి తెలిసిందే. ఎమ్మెల్యేల ఫిర్యాదు నేపథ్యంలో స్పీకర్‌కు ఇప్పటికే 8 మంది ఎమ్మెల్యేలు వివరణ ఇచ్చారు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు ఆదేశాలతో స్పీకర్ విచారణ చేపట్టారు.విచారణ సందర్భంగా ఫిరాయింపు ఎమ్మెల్యేల తరుపున వచ్చిన అడ్వకేట్‌లు వివరణ ఇవ్వడంలో తిమ్మిని బమ్మిని చేసేందుకు ప్రయత్నించారని, అసంబద్ధ ప్రశ్నలు వేస్తున్నా బిఆర్ఎస్ నేతలు ఓపికతో సమాధానాలు ఇచ్చారని పల్లా రాజేశ్వర్ రెడ్డి వెల్లడించారు. నిస్సందేహంగా 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరలేదని వారు చెబుతున్నారు, కానీ పార్టీ మారి అధికారాన్ని అనుభవిస్తున్నారని స్పష్టంగా చెప్పాం అని ఆయన చెప్పారు.ఫిరాయింపు ఎమ్మెల్యేలను డిస్క్వాల్గి÷ చేయాలనే దిశగా చర్యలు తీసుకుంటామని పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. అక్టోబర్ 1న అడ్వకేట్‌లు ఫిరాయింపు ఎమ్మెల్యేల అడ్వకేట్ లను క్రాస్ ఎగ్జామిన్ చేయనున్నారు.

## బల్క్ డ్రగ్ నిరసనకారులతో అనిత చర్చలు

**అనకాపల్లి,సెప్టెంబర్29(సమయజ్యోతి):**

అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద ఏర్పాటు చేయబోయే బల్క్ డ్రగ్ పార్కు అంశంపై నిరసనకారులతో చర్చించినట్లు హోంమంత్రి అనిత తెలిపారు. వారిని బయట వ్యక్తులు కూడా రెచ్చగొడుతున్నారని ఆక్షేపించారు. రాజయ్యపేట వాసులు, అన్ని పార్టీల నాయకులతో అఖిలపక్ష కమిటీ వేస్తామని, అఖిలపక్షాన్ని డిప్యూటీ సీఎం వద్దకు తీసుకెళ్తానని చెప్పారు. 'స్థానికుల వినతితో బల్క్ డ్రగ్ పార్క్ పనులు ఆపాలని ఆదేశించా. మత్స్యకారులతో రాజకీయాలు చేయవద్దు. పాయకరావుపేట పరిధిలో స్టీల్ ఎ÷–లాంట్ ఏర్పాటును అందరూ స్వాగతించారు. రాజయ్యపేట ప్రజల సమస్యకు పరిష్కారం దిశగా ముందుకెళ్తా' అని అనిత తెలిపారు.

# ఓజి మూవీ రేట్లు తగ్గించండి

## పోలీస్ శాఖ ఆదేశాలు

**హైదరాబాద్,సెప్టెంబర్29(సమయజ్యోతి):**

పవన్ కల్యాణ్ నటించిన 'ఓజీ' సినిమా టికెట్ ధరల పెంపును రద్దు చేయాలంటూ తెలంగాణ పోలీస్ శాఖ సోమవారం జీవోను విడుదల చేసింది. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని సింగిల్ స్క్రీన్స్, మల్టీప్లెక్స్ యాజమాన్యాలను ఆదేశించింది. ఈ సినిమా టికెట్ ధరల పెంపును తెలంగాణ హైకోర్టును సస్పెండ్ చేయడాన్ని, ఆ తర్వాత పరిణామాలను జీవోలో పేర్కొంది. సినిమా విడుదలకు ముందు.. ప్రీమియర్ ప్రదర్శనతోపాటు సెప్టెంబరు 25 నుంచి అక్టోబరు 4 వరకు టికెట్ రేట్లు పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. సంబంధిత మెమోను సవాల్ చేస్తూ మహేశ్ యాదవ్ అనే వ్యక్తి హైకోర్టులో ఇటీవల పిటిషన్ దాఖలు చేశారు. విచారణ అనంతరం ఆ ఉత్తర్వులను సస్పెండ్ చేస్తూ.. జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ఈ నెల 24న ఆదేశాలు జారీ చేశారు. ఈ సినిమా టికెట్ రేట్లపై సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై డివిజన్ బెంచ్ ఈ నెల 26 వరకు స్టే విధించింది. రివ్యూ పిటిషన్‌పై ఇరు వర్గాల వాదనలు విన్న కోర్టు.. టికెట్ ధరలు పెంచడానికి వీల్లేదని స్పష్టం చేసింది.

## కాంతారా మూవీ టిక్కెట్ ధరల పెంపు

### ఓజికి ఇబ్బందులు పెట్టారని మనం అడ్డుకోవద్దు

### అభిమానులకు పవన్కళ్యాణ్ సముదాయింపు

**అమరావతి,సెప్టెంబర్29(సమయజ్యోతి):**

కన్నడ సినిమా 'కాంతార చాప్టర్ 1'టికెట్ ధరల పెంపునకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అవకాశం కల్పించనుంది. ఈ చిత్ర టికెట్ ధరల పెంపుపై చర్చ జరిగినట్టు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. తాను హీరోగా నటించిన 'ఓజీ' సినిమాకి కర్ణాటకలో ఎదురవుతున్న ఇబ్బందులను తెలుగు సినీ వర్గాలు పవన్ దృష్టికి తీసుకొచ్చాయి. ఈ సినిమా పోస్టర్లు, బ్యానర్లు తొలగించే చర్యలకు దిగుతున్నారని తెలిపాయి. దీనిపై పవన్ స్పందించారు. కర్ణాటకలో పరిణామాలను దృష్టిలో ఉంచుకొని అక్కడి చిత్రాలకు ఇక్కడ ప్రోత్సాహం ఇవ్వడం ఆపొద్దు.

# ఘర్షణలకు దారితీసిన ఐలవ్ మహమ్మద్

**ముంబై, సెప్టెంబర్29(సమయజ్యోతి):**

ఐ లవ్ మహమ్మద్' వివాదంపై మహారాష్ట్రలోని అహిల్యానగర్‌లో మత ఘర్షణలు చోటుచేసుకున్నాయి. పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు లాఠీచార్జి జరిపారు. 30 మందిని అరెస్టు చేశారు. అహిల్యానగర్ సిటీలోని మలివాడ ప్రాంతంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు 'ఐ లవ్ మహమ్మద్' రంగోలిని ఏర్పాటు చేశారు. దీంతో తమ మనోభావాలు దెబ్బతిన్నాయని ఆగ్రహిస్తూ ఒక వర్గానికి చెందిన వందలాది మంది సిటీలోని కొత్వాలి పోలీస్ స్టేషన్ ఎదుట నిరసనలకు దిగారు. దీంతో పోలీసులు అప్రమత్తమై వదంతులు నమ్మరాదని ప్రజలను కోరారు. కాగా, రంగోలి వేసిన వ్యక్తులను స్థానిక పోలీసులు గుర్తించారు. ఇద్దరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఒకరు పోలీసు కస్టడీలో ఉన్నారు. రంగోలి వివాదంతో రోడ్లపైకి వచ్చిన పలువురిని అదుపు చేసేందుకు పోలీసులు స్వల్పంగా లాఠీచార్జి జరిపారు. అహిల్యానగర్‌లో భద్రతను కట్టుదిట్టం చేశామని, ప్రజలు వదంతులు నమ్మరాదని పోలీసులు కోరారు.

# ఓటర్ల ప్రత్యేక సవరణను వ్యతిరేకించిన కేరళ అసెంబ్లీ

**తిరువనంతపురం, సెప్టెంబర్29(సమయజ్యోతి):**

ఓటర్ల జాబితా ప్రత్యేక అత్యవసర సవరణను వ్యతిరేకిస్తూ కేరళ అసెంబ్లీ సోమవారం ఏకగ్రీవ తీర్మానం చేసింది. కేరళలో ఓటర్ల జాబితా ప్రత్యేక అత్యవసర సవరణ చేపట్టేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధమవుతున్న క్రమంలో.. ఆ రాష్ట్రంలోని అధికార లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్, ప్రతిపక్ష యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ కలిసి అందుకు వ్యతిరేకంగా ఏకగ్రీవ తీర్మానం చేశాయి. ముఖ్యమంత్రి పినరయి విజయన్ అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆ తీర్మానానికి ప్రతిపక్ష కూటమి మద్దతు తెలిపింది. దాంతో తీర్మానం ఏకగ్రీవంగా సభ ఆమోదం పొందింది. ఈ సందర్భంగా తీర్మానంలో సవరణల కోసం ఎమ్మెల్యే షంసుద్దీన్ చేసిన రెండు ప్రతిపాదనలకు సీఎం అంగీకారం తెలిపారు. మిగతా సవరణల ప్రతిపాదనలను స్పీకర్ తోసిపుచ్చారు. ఎన్నికల జాబితాలో 'ప్రత్యేక అత్యవసర సవరణ' అనేది దేశంలో 'నేషనల్ పాపులర్ రిజిస్టర్' అమలుకు వెనుక ద్వారం లాంటిదని తీర్మానంలో పేర్కొన్నారు. కాగా కేరళ, పశ్చిమబెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడ్డాయని, ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో అధికార బీజేపీకి లబ్ధి చేకూర్చే ప్రయత్నం చేస్తోందని దేశంలోని విపక్ష పార్టీల నేతలు విమర్శిస్తున్నారు.

# నిజమైన భారతీయులు నిన్నటి మ్యాచ్‌ను వీక్షించరు

## సంజయ్‌రౌత్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్29(సమయజ్యోతి):**

భారత్–పాకిస్థాన్ క్రికెట్ జట్ల మధ్య ఆదివారం రాత్రి జరిగిన ఆసియాకప్ ఫైనల్ మ్యాచ్‌లో భారత్ ఘన విజయం సాధించింది. ఈ క్రమంలో దేశ ప్రధాని, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు సహా పలువురు ప్రముఖులు భారత క్రికెట్ జట్టుకు అభినందనలు తెలియజేశారు. కానీ కొందరు మాత్రం ఈ విజయంపై స్పందించలేదు. దాంతో భారత జట్టును అభినందించని వారిపై బీజేపీ విమర్శలు గుప్పించింది. వారంతా పాకిస్థాన్ సపోర్టర్‌లు అని ఆరోపించింది. ఈ నేపథ్యంలో ఉద్ధవ్ థాకరే వర్గం శివసేన ఎంపీ సంజయ్ రౌత్ స్పందించారు. బీజేపీ పేరును ప్రస్తావించకుండానే విమర్శలు గుప్పించారు. నిజమైన జాతీయవాదులు అసలు నిన్నటి మ్యాచ్‌ను చూడనే చూడరని ఆయన వ్యాఖ్యానించారు. మోసిన్ నఖ్వీ చేతుల మీదుగా భారత క్రికెట్ జట్టు ట్రోఫీని స్వీకరించకపోవడం అనేది ఒక పెద్ద డ్రామా అని విమర్శించారు. భారత క్రికెట్ జట్టు సభ్యులు 10 రోజుల క్రితం మోసిన్ నఖ్వీతో కరచాలనం చేసిన ఘటనకు సంబంధించిన వీడియోను తాను ఎక్స్ ఖాతాలో పోస్టు చేశానని చెప్పారు. అప్పుడు షేక్ హ్యాండ్ ఇచ్చి, ఇప్పుడు ట్రోఫీని నిరాకరించడం డ్రామా కాకపోతే మరేందని ప్రశ్నించారు. అసలు పాకిస్థాన్‌తో క్రికెట్ ఆడేందుకు ఒప్పుకుని భారత్.. మనదేశపు సైన్యాన్ని, పహల్గామ్ మృతులను, మృతుల కుటుంబాలను అవమానించిందని రౌత్ వ్యాఖ్యానించారు. మ్యాచ్ ఆడటం ఎందుకు, ట్రోఫీని నిరాకరించడం ఎందుకు..? అని ఆయన ప్రశ్నించారు.

# గన్నవరంలో ఉడాన్ యాత్రీ కేఫే

## ప్రారంభించిన మంత్రి రామ్మోహన్ నాయుడు

**విజయవాడ,సెప్టెంబర్29(సమయజ్యోతి):**

గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో ఉడాన్ యాత్రీ కెఫేను కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు ప్రారంభించారు. సోమవారం జ్యోతి ప్రజ్వలన చేసి ఉడాన్ యాత్రీ కెఫేను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు కెఫేలో కాఫీని ఆయనే స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో ప్రయాణికుల అభిప్రాయాలను కేంద్ర మంత్రి స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కేంద్ర మంత్రి చేతుల మీదుగా ఇలా కాఫీని అందుకోవడం ఆనందంగా ఉందని ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అమ్మ పేరుతో ఒక చెట్టు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. విమానాశ్రయం ఆవరణలో మొక్కను నాటారు.అనంతరం కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. విమానాశ్రయ అధికారులు, ప్రయాణికుల తో కలిసి ఇంత పెద్ద కార్యక్రమం చేయడం తనకు సంతోషంగా ఉందన్నారు. 10 ఏళ్ల క్రితం దేశంలో కేవలం 74 విమానాశ్రయాలు మాత్రమే ఉండేవన్నారు. ప్రస్తుతం వాటి సంఖ్య 160కి చేరిందని చెప్పారు. ఇన్ని విమానాశ్రయాలు ఉండడం వల్ల.. చిన్న పట్టణాలకు కూడా ఎయిర్ కనెక్టివిటీ ఇవ్వగలిగామని పేర్కొన్నారు. పట్టణాలకు సైతం ఎయిర్ కనెక్టివిటీ ఇవ్వడం వల్ల సామాన్యులు సైతం విమానాల్లో ప్రయాణిస్తున్నారని చెప్పారు. ఇక విమానంలో ప్రయాణిస్తున్న సామాన్య ప్రయాణికుల నుంచి ఫీడ్ బ్యాక్ సైతం తాము తీసుకున్నామని వివరించారు. విమానాశ్రయాల్లో తినుబండారాలు అధిక ధరలకు విక్రయిస్తున్నారంటూ ఈ సందర్భంగా తమకు ఫిర్యాదులు అందాయన్నారు. వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా తొలిసారి ఉడాన్ యాత్రీ కెఫేను ముంబై విమానాశ్రయంలో ప్రారంభించామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. దీనికి ప్రయాణికుల నుంచి అనుహ్య స్పందన వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో ఈ యాత్రి కెఫేను గన్నవరంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని నాని, విమానాశ్రయ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు. గన్నవరం విచ్చేసిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు.. సోమవారం విజయవాడ ఉత్సవ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే ఇంద్రకీలాద్రిపై కొలువు తీరిన దుర్గమ్మ వారిని సైతం కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు దర్శించుకున్నారు.

# పార్టీ ఏర్పాటుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు

## తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

## లండన్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**లండన్,సెప్టెంబర్29(సమయజ్యోతి):**

పార్టీ ఏర్పాటుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తెలిపారు. లండన్‌లోని తెలంగాణ ప్రవాసులతో కవిత ముఖాముఖి మాట్లాడారు. 20 ఏళ్లు భారత రాష్ట్ర సమితి కోసం కష్టపడ్డాను. కొందరిలో స్వార్థం పురుడుపోసుకుంది. వారివల్ల కోట్లాది మంది బాధపడొద్దన్నదే నా తపన. పార్టీలో చీలికలు రావొద్దని ఎంత ఇబ్బందైనా తట్టుకొని నిలబడ్డాను. పార్టీలో చాలా అవమానాలు ఎదురయ్యాయి. నా ఓటమి మొదలు అసెంబ్లీ ఎన్నికల్లో భారాస ఓటమి వరకు ఎన్నో కుట్రలు జరిగాయి. తప్పనిసరి పరిస్థితుల్లోనే ఇప్పుడు మాట్లాడాల్సి వచ్చిందని అన్నారు. తెలంగాణ జాగృతిని దేశానికి రోల్ మోడల్‌గా నిలపాలన్నదే సంకల్పమని చెప్పారు. సామాజిక తెలంగాణ కోసం జాగృతి పనిచేస్తుందన్నారు. అవసరం, సందర్భం వచ్చినప్పుడు ప్రజలు కోరుకుంటే పార్టీ పెడతాం. ప్రజల జీవితాల్లో మార్పులు తేవడంపై స్పష్టమైన ఆలోచన ఉంది. తప్పనిసరిగా నాకు అవకాశం వస్తుంది. ఎన్నికలకు ఇంకా మూడున్నరేళ్ల సమయం ఉంది. అప్పటి వరకు ఎలాంటి మార్పులు వస్తాయో చూడాలి. నా వెనక ఏ జాతీయ పార్టీ లేదు.. జాతీయ పార్టీల్లో చేరే ఉద్దేశం కూడా లేదు. కాంగ్రెస్ పార్టీ మునిగిపోయే పడవ. అభివృద్ధి పథంలో సాగుతున్న తెలంగాణను భ్రష్టు పట్టిస్తోంది. భాజపా డీఎన్ఏ నాకు సరిపడదన్నారు. విషయం ప్రజల్లోకి వచ్చిన తర్వాత వాటిపై స్పందించకపోతే తప్పవుతుంది. అందుకే మాట్లాడాల్సి వచ్చింది. పార్టీ నన్ను వద్దనుకుంది కాబట్టే.. పార్టీ ఇచ్చిన పదవిని వద్దనుకున్నాను. నిర్ణీత నమూనాలో రాజీనామా చేశాను. ఛైర్మన్ ఎందుకు ఆమోదించడం లేదో తెలియదు. నేను ఈ పరిస్థితికి రావడానికి అవతలి వాళ్లే కారణం. కష్టమవుతుందని తెలిసినా.. కేసీఆర్ బిడ్డగా ధైర్యంగా పంథాను ఎంచుకుంటాను. జైలు జీవితం నాలో అనేక మార్పులు తీసుకొచ్చింది. సమూలంగా మార్చేసింది. నిజమైన మార్పు కోసం తెలంగాణ ఉద్యమకారులు ఒక్కటై పని చేయాలని కవిత అన్నారు. ఇదిలావుంటే తెలంగాణ పూల సింగిడి బతుకమ్మ పండుగ ఎల్లలు దాటింది. తెలంగాణలోనే కాకుండా పలు దేశాల్లోనూ బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు తెలుగువారు. వివిధ పనుల నిమిత్తం విదేశాల్లో ఉంటున్నప్పటికీ మూలాలు మర్చిపోకుండా తెలంగాణ సంస్కృతి, వైభవాన్ని చాటుతూ కెనడా, అమెరికా, ఖతర్, యూఏఈ, యూకే వంటి దేశాల్లోని తెలుగు ప్రజలు బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే ఈ ఏడాది లండన్‌లో కన్నుల పండుగగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. లూటన్ సిటీలో ఉంటున్న తెలుగు ప్రజలు లూటన్ తెలుగు అసోసియేషన్ (ఎల్‌టీఏ) ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకున్నారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చిన ఆటపాటలతో మహిళలు సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పడుతూ, పూలను పూజిస్తూ, గౌరమ్మను ఆరాధించారు ఆడబిడ్డలు. ఈ సందర్భంగా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించారు. బతుకమ్మలను పేర్చిన వారందరికీ అసోసియేషన్ ప్రతినిధులు బహుమతులు అందజేశారు. ఎంతో ఆనంద భరితంగా సాగిన ఈ కార్యక్రమంలో చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు.





# ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారం

## తొలిరోజు ఎనిమిది మందిపై విచారణ

**హైదరాబాద్,సెప్టెంబర్29(సమయజ్యోతి):**

తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా మారిన ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసు మొదటి రోజు విచారణ ముగిసింది. సోమవారం ఉదయం 11 గంటల నుంచి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చాంబర్లో విచారణ కొనసాగింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేల తరుపు న్యాయవాదులు పిటిషన్ దారులను క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. విచారణకు పిటిషనర్లు కల్వకుంట్ల సంజయ్, చింతా ప్రభాకర్, పల్లా రాజేశ్వర్ రెడ్డి, వారి తరపు న్యాయవాదులు హాజరయ్యారు. అలాగే.. ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు ప్రకాష్ గౌడ్, కాలే యాదయ్య, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, వారి తరుపు న్యాయవాదులు విచారణలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ అసెంబ్లీ స్పీకర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. రోజులు గడుస్తున్నా స్పీకర్ నిర్ణయం తీసుకోవడం లేదంటూ.. సుప్రీంకోర్టును బీఆర్ఎస్ ఆశ్రయించింది. దీంతో విచారణ చేపట్టిన న్యాయస్థానం కీలక ఆదేశాల జారీ చేసింది. ఈ నేపథ్యంలో పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు జారీ చేశారు. అయితే దానం నాగేందర్, కడియం శ్రీహరి మినహా మిగిలిన 8 మంది తాము పార్టీ మారలేదంటూ అఫిడవిట్ల పూర్వకంగా వివరణ ఇచ్చారు. ఫిర్యాదుదారులూ వారికి వ్యతిరేకంగా ఆధారాలు సమర్పించారు. ఈ మేరకు నాలుగు రోజులు ఎమ్మెల్యేల విచారణ కొనసాగనుంది. దీనిలో భాగంగా మొదటి రోజు విచారణ ముగిసింది. కాగా, విచారణ అనంతరం స్పీకర్ నిర్ణయం తీసుకుంటారా..? లేదా సుప్రీంకోర్టును మరికొంత సమయం కోరుతారా..? అనేది రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# అక్రమంగా 40 పిడిఎస్ బియ్యం సంచుల తరలిస్తున్న బొలెరో వాహనాన్ని పట్టుకున్న మెదక్ టాస్క్ ఫోర్స్ అధికారులు

**మెదక్ జిల్లా బ్యూరో / సమయజ్యోతి / సెప్టెంబర్ 29 /**

శంకరంపేట్-ఎ మాండలం, ఉతులూర్ గ్రామ పరిధిలో 40 పీడీఎస్ బియ్యం సంచులను అక్రమంగా తరలిస్తున్న మహీంద్రా బొలెరో వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. వాహనం మరియు స్వాధీనం చేసుకున్న బియ్యం సంచులను శంకరంపేట్-ఎ పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేశారు. సందర్భంగా జిల్లా ఎస్పీ. డి.వి. శ్రీనివాసరావు, మాట్లాడుతూ %-%జిల్లాలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు కూడా ఇలాంటి సమాచారాన్ని పోలీసులకు అందించి సహకరించాలి అని తెలిపారు.



# జర్నలిస్టులకు ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుంది దనసరి అనసూయ

**వరంగల్ జిల్లా బ్యూరో (సమయజ్యోతి)సెప్టెంబర్ 29**

జర్నలిస్టులకు ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమి ఆడిటోరియంలో జర్నలిస్టుల సంక్షేమ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మీడియా రంగంలో వృత్తిని కొనసాగిస్తూ అమరులైన జర్నలిస్టులకు జోహార్లు అర్పించారు.





జర్నలిస్టులు సమాజంలోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తారన్నారు. అదే విధంగా ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పని చేస్తూ ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నారు అని అన్నారు. అందుకు నిదర్శనం తెలంగాణ ఉద్యమంలో ప్రజల అకాంక్షల మేరకు తమ ఉద్యోగాలు ఉంటాయే ఉండవో అనే సందర్భంగా తెలంగాణ లోని గ్రామీణ విలేకరి నుండి ఉన్నత జర్నలిస్టుల వరకు ప్రతి ఒక్కరు తెలంగాణ ఉద్యమంలో పాల్గొని మిగతా సమాజానికి ఆదర్శంగా నిలిచారని వారి సేవలను కొనియాడారు. తెలంగాణ మీడియా అకాడమి చనిపోయిన జర్నలిస్టు కుటుంబాలకు ఆర్థిక చేయూతను అందించడం వలన ఆయా కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని ఆమె అన్నారు. అదే విధంగా జర్నలిస్టులకు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడానికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం వలన క్షేత్రస్థాయిలోని విలేకరులకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. ప్రభుత్వం చేపట్టిన గృహ నిర్మాణ పథకంలో ఇండ్లు లేని జర్నలిస్టులకు ఇండ్లను కేటాయించాలని, మరణించిన కుటుంబాలకు హెల్త్ కార్డులు అందజేసేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నట్లు రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి తెలియజేశారు. సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ సి. హెచ్. ప్రియాంక మాట్లాడుతూ, మీడియా అకాడమి భవనం బహుళ అంతస్తులలో కొనసాగుతున్నందున అందులో శిక్షణ కొరకు ఆడిటోరియం ఉండడంతో జర్నలిస్టులకు ఏ.ఐ., సోషల్ మీడియా, భాషపై పట్టు కోసం నిరంతరం జర్నలిస్టులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు. అదే జర్నలిస్టుల సౌకర్యార్థం కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరరీ ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి సూచన మేరకు క్షేత్రస్థాయిలో పని చేస్తున్న పౌర సంబంధాల అధికారులకు మీడియా అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణను ఏర్పాటు చేస్తామన్నారు. తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, 18 మంది మరణించిన వర్కింగ్ జర్నలిస్టుల ప్రతి కుటుంబానికి ఒక లక్ష రూపాయలు, అయిదు సంవత్సరాల వరకు పెన్షన్ మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రమాదాలు/ దీర్ఘకాలికంగా అనారోగ్యం బారిన పడిన ఆరుగురు వర్కింగ్ జర్నలిస్టులకు లక్ష రూపాయలు, ఒక జర్నలిస్టుకు యాభై వేలు, మొత్తం 24 లక్షల 50 వేల రూపాయల ఆర్థిక సహాయం చెక్కులను మంత్రి చేతుల మీదుగా లబ్దిదారులకు అందజేయడం జరిగింది. ఇప్పటికే కొన్ని జిల్లాలలో శిక్షణా తరగతులు నిర్వహించడం జరిగిందన్నారు. అంతేగాక ఏ.ఐ., సోషల్ మీడియా, ఉర్దూ, గిరిజన జర్నలిస్టులకు ప్రత్యేక వర్క్ షాప్ లు నిర్వహించి వృత్తిలోని నైపుణ్యాలను ఏలా పెంపొందించుకోవాలో జర్నలిస్టులకు వివరించి అవగాహన కలిగిస్తున్నట్లు ఆయన తెలిపారు. త్వరలోనే ములుగు జిల్లాలో శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఛైర్మన్ మంత్రికి తెలియజేశారు. జర్నలిజం వృత్తిలో పని వత్తిడి కారణంగా అకాల మరణాలు, అనారోగ్యాల పాలు అవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సంక్షేమ నిధులపై వచ్చే వడ్డీని మాత్రమే జర్నలిస్టుల సంక్షేమానికి వినియోగిస్తున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో మీడియా అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు, జర్నలిస్టు నాయకులు, తదితరులు పాల్గొన్నారు. జారీ చేసినవారు : శ్రీయుత కార్యదర్శి, తెలంగాణ మీడియా అకాడమి, హైదరాబాద్.

# ఎమ్మెల్యే టీఆర్ఆర్ నివాసంలో వైభవంగా బతుకమ్మ సంబురాలు...

## బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే టీఆర్ఆర్

**పరిగి (సమయజ్యోతి, ప్రతినిధి) సెప్టెంబరు 29**



పరిగి పట్టణంలోని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి నివాసంలో బతుకమ్మ సంబురాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఎమ్మెల్యే టీఆర్ఆర్ సతీమణి టి.ఉమారామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. వివిధ రకాల పూలతో బతుకమ్మల పేర్చి మహిళలు ఆట,పాటలతో నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టీఆర్ఆర్ దంపతులు గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... బతుకమ్మ సంబరాలు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకాని, బతుకమ్మ పండుగ మహిళలకు ప్రత్యేకమైనదని, ఈ పండుగలో తెలంగాణ సాంప్రదాయం, ఆచారాలు, ఆత్మీయత ప్రతిబింబిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# స్థానికంలో కాషాయ జెండా ఎగురవేస్తాం - రాంచందర్‌రావు

**హైదరాబాద్, సెప్టెంబర్29(సమయజ్యోతి):**

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు గుణపాఠం చెబుతారని బీజేపీ రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆలస్యమైనా తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తుందని చెప్పుకొచ్చారు. ఇప్పటివరకు రాష్ట్రపతి, గవర్నర్‌ల పేరిట కాలయాపన చేసింది రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. రెండేళ్లకే కాంగ్రెస్ మీద ప్రజలకు విరక్తి కలిగిందని విమర్శించారు. పదేళ్ల కేసీఆర్ ప్రభుత్వం మీద ప్రజలు విసిగిపోయారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాషాయ జెండా ఎగురువేస్తామని ధీమా వ్యక్తం చేశారు రాంచందర్ రావు తమ గెలుపునకు స్థానిక సంస్థల ఎన్నికలే నిదర్శనం కాబోతున్నాయని ఉద్ఘాటించారు. తమకు ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ఎనిమిది మంది ఎంపీలు, ముగ్గురు ఎమ్మెల్సీలు ఉన్నారని గుర్తుచేశారు. తాను స్వయంగా ఇప్పటివరకు 23 జిల్లాల్లో యాత్రలు చేశానని తెలిపారు. ఇంకో నాలుగు జిల్లాల్లో యాత్ర చేయాల్సి ఉందని వివరించారు.

# జగన్ పాలనలో అనేక గుళ్లు ధ్వంసం

## -వైఎస్ కుటుంబం హిందూవ్యతిరేక వైఖరి-టిటిడిపై షర్మిల వ్యాఖ్యలు దారుణం

## -మండిపడ్డ ఎపి బిజెపి చీఫ్ మాధవ్

**న్యూఢిల్లీ,సెప్టెంబర్29(సమయజ్యోతి):**

మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి వచ్చిన తర్వాత అనేక దేవాలయాలపై దాడులు జరిగాయని ఏబీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ ఆరోపించారు. తిరుమల తిరుపతి నిధులతో గుళ్ల నిర్మాణం చేస్తే మీకేంటి ఇబ్బందని ఆయన ప్రశ్నించారు. నిధులు ఆలయాల నిర్మాణాలు, ధార్మిక సంస్థల నిర్మాణం, ధూపదీప నైవేద్యం కోసం ఉపయోగించుకుంటున్నారని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం టీటీడీలో 434 గదులు కూల్చి రూ. 600 వందల కోట్లు ఖర్చు చేశారని మండిపడ్డారు. దేవాలయాలను కించ పర్చడంలో దివంగత మాజీ సీఎం రాజశేఖర్ రెడ్డి కుటుంబం మొదటి నుంచి ఇదే వైఖరి వ్యవహరిస్తోందని కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. జగన్ పరిపాలన జరిగిన అవినీతిపై విచారణ జరుగు తోందని ఆయన చెప్పుకొచ్చారు. అదేవిధంగా ఏపీ కాంగ్రెస్ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల రెడ్డి హిందూ మనోభావాలకు విఘాతం కలిగించే విధంగా మాట్లాడారని పీవీఎన్ మాధవ్ ఆరోపించారు. టీటీడీ నిధులతో సుమారు 5 వేల దేవాలయాలు నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటన చేశారని గుర్తు చేశారు. దేవాలయాల నిర్మాణాలు ఆర్ఎస్ఎస్ ఎజెండా అని షర్మిల వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. దేవాలయాలపై పరిజ్ఞానం లేకుండా, అవివేకంగా షర్మిల మాట్లాడారని విమర్శించారు. ఆమెకు దేవాలయాల వ్యవస్థపై ఎటువంటి అవగాహన, ఆలోచన లేదని పేర్కొన్నారు. వైఎస్ షర్మిల జీవితంలో ఎప్పుడైనా దేవాలయాలను సందర్శించారా అని మాధవ్ ప్రశ్నించారు. మత ప్రచారాలు స్వయంగా భర్తతో కలిసి చేశారని ఆరోపించారు. మత మార్పిడి చేయాలని పెద్ద ప్రయత్నం చేశారని కీలక వ్యాఖ్యలు చేశారు. టీటీడీపై షర్మిల చేసిన వ్యాఖ్యలపై సోనియాగాంధీ, రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. దివంగత మాజీ సీఎం రాజశేఖర్ రెడ్డి గతంలో ఏడుకొండలు మూడు కొండలుగా మార్చాలని జీవో ఇచ్చారని గుర్తు చేశారు. తిరుమల తిరుపతి నిధులు ఎలాంటి దుర్వినియోగం అవ్వడం లేదని స్పష్టం చేశారు. నిధులను ఆలయాల నిర్మాణాలు, ధార్మిక సంస్థల నిర్మాణం, ధూపదీప నైవేద్యం కోసం ఉపయోగించు కుంటు న్నారని మాధవ్ వెల్లడించారు.

ఏపీలో కూటమి నేతృత్వంలో మంచి పాలన జరుగుతుందని మాధవ్ తెలిపారు. డీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాలు ఇవ్వడం మంచి పరిణామమని పేర్కొన్నారు. అందుకు కృషి చేసిన మంత్రి నారా లోకేష్‌కు అభినందనలు తెలిపారు. పెట్టుబడులకు మంచి అవకాశంగా అమరావతి ఉందని పేర్కొన్నారు. గ్రీన్ హైడ్రోజన్ పనులు నడుస్తున్నాయని వివరించారు. కొత్తగా కొన్ని పోర్టుల నిర్మాణాలు జరుగు తున్నాయని స్పష్టం చేశారు. జగన్ మళ్లీ అధికారంలోకి వస్తా మంటూ.. పోలీసులను, కాంట్రా క్టులను బెదిరించడం మంచిది కాదని హెచ్చరించారు. జగన్ వైఖరి మారకపోతే వచ్చే ఎన్నికల్లో 11 సీట్లు కూడా రావని హితవు పలికారు. జగన్మోహన్ రెడ్డి వైఖరిని అన్నివర్గాల ప్రజలు ఖండించాలని పిలుపునిచ్చారు.

# తిరుమలలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

## హనుమంత వాహనంపై ఊరేగిన శ్రీవారు

**తిరుమల,సెప్టెంబర్29(సమయజ్యోతి):**



శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు సోమవారం ఉదయం 8 గంట లకు శేషాచలాధీశుడు శ్రీ కోదండ రాముని అవతారంలో ధనుస్సు, బాణం ధరించి తన భక్తుడైన హనుమంతునిపై ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. వాహనం ముందు భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలా టాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలా హలంగా జరిగింది. భక్తులు అడు గడు గునా కర్పూరహారతులు సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు. హను మంతుడు భగవత్ భక్తులలో అగ్రగణ్యుడు. రామా యణం లో మారుతి స్థానం అద్వి తీయం. చతుర్వేద నిష్ణాతుడుగా, లంకా భీకరుడిగా ప్రసిద్ధుడైన ఆంజనేయుడు వేంకటాద్రివాసుని మూపున వహించి దర్శనమిచ్చారు. గురు శిష్యులైన శ్రీరామ హనుమంతులు తత్త్వ వివేచన గావించిన మహనీయులు కనుక వాహ్యా వాహకరూపంలో ఈ ఇరువురిని చూసిన వారికి పుణ్య ఫలం లభిస్తుంది.సాయంత్రం 4 నుండి 5 గంటల వరకు స్వర్ణరథంపై శ్రీమలయప్ప స్వామివారు భక్తులను కటాక్షిస్తారు. రాత్రి 7 గంటలకు గజవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. వాహన సేవలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, పలువురు బోర్డు సభ్యులు, జేఈవో వీరబ్రహ్మం, సివిఎస్వో మురళి కృష్ణ,





# లిక్కర్ కేసులో మిథున్ రెడ్డికి బెయిల్

## -షరతులతో బెయిల్ ఇచ్చిన ఎసిబి కోర్టు

## -71 రోజుల తరవాత దక్కిన ఊరట

**విజయవాడ,సెప్టెంబర్29(సమయజ్యోతి):**

లిక్కర్ కేసులో అరెస్ట్ అయ్యి.. రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ మిథున్ రెడ్డికి ఏసీబీ కోర్టు బెయిల్ ఇచ్చింది. సోమవారం ఈ కేసులో విచారణ చేసిన ఏసీబీ కోర్టు.. షరులతో బెయిల్ మంజూరు చేసింది. వారంలో రెండు రోజులు ఏసీబీ కోర్టుకు హాజరుకావాలనే కండీషన్ కింద బెయిల్ ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఏపీ లిక్కర్ కేసులో అరెస్ట్ అయిన ఎంపీ మిథున్ రెడ్డి.. 71 రోజులు జైలులో ఉన్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేయటానికి మధ్యంతర బెయిల్ ఇచ్చింది కోర్టు. ఆ తర్వాత ఆయన మళ్లీ జైలుకు వెళ్లారు. లిక్కర్ కేసులో 2025, జూలై 19వ తేదీన విజయవాడలోని సిట్ ఆఫీసుకు విచారణ కోసం వచ్చారు. ఏడు గంటల సుదీర్ఘ విచారణ తర్వాత.. సరైన సమాధాలు చెప్పలేదని.. లిక్కర్ స్కాంలో ఎంపీ మిథున్ రెడ్డి పాత్రపై స్పష్టమైన ఆధారాలు ఉన్నాయంటూ అరెస్ట్ చేశారు అధికారులు. అక్కడి నుంచి కోర్టులో హాజరుపరిచి.. ఆ తర్వాత రిమాండ్ కింద రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు అధికారులు. పలుసార్లు బెయిల్ పిటీషన్ డిస్మస్ అయ్యింది. ఛార్జిషీటు ఇంకా దాఖలు చేయకపోవటంతో ఏసీబీ కోర్టు షరతులతో బెయిల్ ఇచ్చింది. మంగళవారం ఆయన జైలు నుంచి విడుదల అయ్యే అవకాశం ఉంది.

# సరస్వతీ అలంకారంలో కనకదుర్గమ్మ

## అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన చంద్రబాబు

**విజయవాడ,సెప్టెంబర్29(సమయజ్యోతి:**

ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగు తున్నాయి. అమ్మవారి జన్మనక్షత్రమైన మూలా నక్షత్రం కావడంతో శ్రీ సరస్వతి దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ప్రభుత్వం తరఫున సీఎం చంద్రబాబు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. దుర్గమ్మ వారి దర్శనానికి సాధారణ భక్తులకు ప్రాధాన్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. భక్తుల కోసం నిర్మిస్తున్న అన్న ప్రసాద భవనం మరో ఆరు నెలలో పూర్తవుతుందని చెప్పారు. సోమవారం ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వారి దేవాలయంలో కొలువు తీరిన శ్రీదుర్గమ్మ వారికి సీఎం చంద్రబాబు నాయుడు దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు.అనంతరం దేవాలయం బయట సీఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ.. రూ.25 కోట్లతో 1500 మంది భక్తులు భోజనం చేసే విధంగా అన్న ప్రసాద భవనం నిర్మిస్తున్నామన్నారు. రూ. 27 కోట్లతో 3 నెలల్లో ప్రసాదం తయారీ కేంద్ర పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు. అలాగే రూ.5.5 కోట్లతో ప్రధాన ఆలయం వద్ద పూజా మండపానికి సంబంధించిన నిర్మాణ పనులు చేపట్టామని చంద్రబాబు నాయుడు వివరించారు. సతీసమేతంగా ఆలయానికి చేరుకున్న ముఖ్యమంత్రికి ఆలయ అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. చినరాజగోపురం వద్ద స్థానాచార్యులు శివ ప్రసాద్‌శర్మ సీఎంకు పరివేష్టం కట్టారు.





# ట్రూ అప్' పేరిట విద్యుత్ భారం మోపిన జగన్

## మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి

**గుంటూరు,సెప్టెంబర్29(సమయజ్యోతి:**

బాదుడే బాదుడు నినాదంలో 'ట్రూ అప్' పేరిట విద్యుత్ భారాన్ని ప్రజలకు జగన్ పరిచయం చేశారని మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి అన్నారు. గతంలో విద్యుత్ ఛార్జీల భారం ఇప్పటికీ భరిస్తున్నామని అన్నారు. ఇవన్ఈనమరచి జగన్, ఆయన బృందం విమర్శలు చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం మాత్రం 'ట్రూ డౌన్' పేరును పరిచయం చేస్తోందని చెప్పారు. మంగళగిరిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన చంద్రబాబు.. వీలైతేనే తగ్గిస్తామని చెప్పినట్లు గుర్తు చేశారు. కానీ, అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే చిత్తశుద్ధితో ఛార్జీలు తగ్గించి చూపించారని చెప్పారు. హ్యాండ్‌ల్యూమ్స్, సెలూన్‌లకు సబ్సిడీ కూడా ఇస్తున్నట్లు తెలిపారు. స్వలాభం కోసం అధిక మొత్తానికి విద్యుత్ కొనుగోలు చేసిన జగన్ ప్రభుత్వం.. వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టిందని మండిపడ్డారు. శాసనమండలిలోనే ట్రూ డౌన్‌పై ప్రకటన చేయాలని భావించామని, అయితే, కాఫీ కోసం వైకాపా సభ్యులు గొడవ చేసి.. ముఖ్యమైన అంశం సభకు రాకుండా అడ్డుకున్నారని విమర్శించారు.

వైసిపి డిజిటిల్ బుక్‌లో సొంత నేతలపైనే ఫిర్యాదులు

# విడుదల రజనిపై ఫిర్యాదు చేసిన నేతలు

**అమరావతి,సెప్టెంబర్29(సమయజ్యోతి:**

వైసీపీ కొత్తగా తెచ్చిన 'డిజిటల్ బుక్' యాప్‌లో ఆ పార్టీ నేతలపైనే ఫిర్యాదులు అందుతున్నాయి. మాజీ మంత్రి విడదల రజినిపై తాజాగా ఫిర్యాదు అందింది. విడదల రజినిపై నవతరం పార్టీ జాతీయ అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యం ఆదివారం ఫిర్యాదు చేశారు. 2022లో పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని నవతరం పార్టీ కార్యాలయం, తన ఇంటిపై రజిని దాడి చేయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మాజీ మంత్రి రజినిపై చర్యలు తీసుకుని, తనకు న్యాయం చేయాలని సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. సొంత డిజిటల్ బుక్ యాప్‌లో ఫిర్యాదు అందడంపై వైసీపీలో కలకలం రేపింది.'2022లో చిలకలూరిపేటలోని నవతరం పార్టీ కార్యాలయం, నా ఇల్లు, కారుపై మాజీ మంత్రి విడదల రజిని దాడి చేయించారు. మాజీ మంత్రిపై చర్యలు తీసుకుని నాకు న్యాయం చేయాలని వైసీపీ అధ్యక్షుడు జగన్‌కి డిజిటల్ బుక్ యాప్ ద్వారా ఫిర్యాదు చేశా. ఈ ఫిర్యాదుపై నాకు న్యాయం చేస్తే జగన్ చెప్పినట్లు వైసీపీ కార్యకర్తలకూ న్యాయం జరుగుతుందనే నమ్మకం కలుగుతుంది' అని రావు సుబ్రహ్మణ్యం తెలిపారు. వైసీపీ డిజిటల్ బుక్ యాప్‌లో మాజీ మంత్రిపై ఫిర్యాదు చేసిన తర్వాత వచ్చిన టికెట్‌ను సుబ్రహ్మణ్యం మీడియాకు చూపించారు. మాజీ సీఎం వైఎస్ జగన్ ఇటీవల వైసీపీ కార్యకర్తల కోసం 'డిజిటల్ బుక్' వెబ్ సైట్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. తాజాగా తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో జరిగిన పార్టీ సమావేశంలో యాప్‌ను లాంచ్ చేశారు. ఈ డిజిటల్ బుక్ వైసీపీ కార్యకర్తలకు శ్రీరామ రక్ష అని జగన్ చెప్పారు. 'రెడ్ బుక్' గురించి మాట్లాడుతున్న వారికి 'డిజిటల్ బుక్' సమాధానం అని పేరొన్నారు. కార్యకర్తలకు అన్యాయం జరిగితే యాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

# నల్లధనంలో మోడీ రూపాయి అయినా తెచ్చాడా?

## చంద్రబాబు 15 ఏళ్ల పదవిలో ఏం చేశారు

## మాజీఎంపి చింతామోహన్ ఆగ్రహం

**అమరావతి,సెప్టెంబర్29(సమయజ్యోతి):**

ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబుపై మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత చింతా మోహన్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. 'భారత దేశ వ్యాప్తంగా భారత రాజ్యాంగ పరిరక్షణ యాత్ర సాగుతోంది. 11 ఏళ్లుగా ప్రధానిగా మోడీ కొనసాగుతున్నారు. నల్లధనం బయటకు తీస్తా అన్న మోడీ ఇప్పటికి ఒక్క రూపాయి తీసాడా?. మోడీ చెప్పిన వాగ్దానం అమలులో పూర్తిగా ఫెయిల్ అయ్యారని మండిపడ్డారు. ప్రతి ఒక్కరి ఖాతాల్లో 15 లక్షలు వేస్తామన్న మోడీ ఇంతవరకు ఒక్క పైసా కూడా వేయలేదు. ఒక్క ఉద్యోగం అయినా ప్రధాని ఇచ్చాడా?. ఉద్యోగాలు రాక పట్టభద్రులు పారిశుధ్య కార్మికులుగా మారుతున్నారు' అని చింతా మోహన్ ఫైర్ అయ్యారు. '15 ఏళు ్లగా ముఖ్యమంత్రిగా చంద్రబాబు రాష్ట్రానికి ఏమైనా చేశాడా?. తన సొంత నియోజకవర్గానికి కూడా ఏమి చేయలేదు. అభివృద్ధి అభివృద్ధి అంటున్న చంద్రబాబు కనీసం ఇడ్లీ కొట్టు కూడా పెట్టలేదు. సామాజిక న్యాయం అంటూ కులాల మధ్య చిచ్చు పెడుతున్నారు. చంద్రబాబు స్వార్ధ రాజకీయ ప్రయోజనాల కోసం కులాల మధ్య గొడవలు పెట్టారు. దళితులకు న్యాయం అంటున్న నీవు 2 ఏళ్ళు సీఎంగా మాదిగలకు ఇవ్వు. దళితులు, మైనార్టీలు సంతోషంగా లేరు. ఒకప్పుడు పేదల గురించి అసెంబ్లీలో మాట్లాడేవారు కానీ.. ఇప్పుడు పరిస్తితి అలా లేదు. పనికిమాలిన మాటలు మాట్లాడుకునేందుకు అసెంబ్లీని వాడుకుంటున్నారు. రాష్ట్రంలో పేరుకే కూటమి.. కానీ వారిలో వారికే ఐక్యత లేదు. రాష్ట్రంలో 2024లో జరిగిన ఎన్నికలు పలు అనుమానాలకు దారి తీస్తుంది. ఈవీఎం ట్యాంపరింగ్ జరిగినట్లు అనుమానాలు ఉన్నాయి. చంద్రబాబుపై ప్రజల్లో విపరీతమైన వ్యతిరేకత ఏర్పడింది. మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం పూర్తిగా తప్పు. పెండింగ్ లో ఉన్న 15 మెడికల్ కళాశాలల నిర్మాణాలు పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అమరావతి కి ఉన్న నిధులు మెడికల్ కళాశాలల నిర్మాణానికి లేవా?' అని చింతా మోహన్ ప్రశ్నించారు.

# ట్రోఫీని తిరస్కరించిన భారత ఆటగాళ్లు






ఆసియా కప్ ఫైనల్‌లో భారత్ పాకిస్థాన్‌పై అద్భుత విజయం సాధించింది. కానీ ఆ తర్వాత జరిగిన పరిణామాలు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడు, పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ అయిన మొహ్సిన్ నఖ్వీ నుంచి ట్రోఫీ తీసుకోవడానికి భారత ఆటగాళ్లు నిరాకరించారు. ట్రోఫీ, మెడల్స్ తీసుకోకుండానే ఆటగాళ్లు డగౌట్‌కు వెళ్లిపోయారు. భారత్ ట్రోఫీని తిరస్కరించినట్లు ప్రెసెంటేటర్ ప్రకటించారు. దీంతో గ్రౌండ్‌లో ఉన్న ట్రోఫీని వెనక్కి తీసుకెళ్లారు. టీమిండియా ఆటగాళ్లు ట్రోఫీ లేకుండానే సంబరాలు చేసుకున్నారు. ఈ ఊహించని సంఘటనతో దుబాయ్ అంతర్జాతీయ స్టేడియంలో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. భారత జట్టు ఈ విజయంతో 21 కోట్ల రూపాయల ప్రైజ్‌మనీ గెలుచుకుంది. భారత జట్టు ట్రోఫీ తీసుకోవడానికి నిరాకరించడంతో బహుమతి ప్రదానోత్సవం ఆలస్యమైంది. అదే సమయంలో పాకిస్థాన్ ఆటగాళ్లు కూడా తమ డ్రెస్సింగ్ రూమ్‌లోనే ఉండిపోవడంతో పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. ఇరు దేశాల మధ్య ఉన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ సంఘటన జరిగింది. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత జరిగిన ఈ టోర్నమెంట్‌లో.. మొదటి నుంచి వాతావరణం వేడిగా ఉంది. అంతకుముందు జరగాల్సిన ట్రోఫీ ఫోటో షూట్‌కు కూడా భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ నిరాకరించారు. టోర్నమెంట్‌లో లీగ్, సూపర్ ఫోర్ మ్యాచ్‌లలో ఇరు జట్ల ఆటగాళ్లు షేక్ హ్యాండ్ కూడా ఇచ్చుకోలేదు.ఆసియా కప్ 2025 ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠగా సాగింది. భారత్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించి తొమ్మిదోసారి ఆసియా కప్ గెలుచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్.. 13 ఓవర్లలో 113/1 స్కోరుతో బలంగా కనిపించింది. కానీ భారత స్పిన్నర్లు అద్భుతంగా బౌలింగ్ చేయడంతో.. పాకిస్థాన్ కేవలం 33 పరుగులలో 9 వికెట్లు కోల్పోయి 19.1 ఓవర్లలో 146 పరుగులకు ఆలౌట్ అయింది. కుల్దీప్ యాదవ్ ఒకే ఓవర్లో మూడు వికెట్లతో సహా మొత్తం నాలుగు వికెట్లు తీసి పాకిస్థాన్‌ను కుప్పకూల్చాడు. బుమ్రా, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి ఒక్కొక్కరు రెండు వికెట్లు తీశారు.భారత్ 147 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ షురూ చేసింది. కానీ 20 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ సమయంలో తిలక్ వర్మ అద్భుతంగా ఆడి 51 బంతుల్లో 69 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. సంజూ శాంసన్, శివమ్ దూబేతో కలిసి ముఖ్యమైన భాగస్వామ్యాలు నెలకొల్పి జట్టును విజయం వైపు నడిపించాడు. చివర్లో రింకూ సింగ్ బౌండరీతో ఒక బంతి మిగిలి ఉండగానే భారత్‌కు అద్భుతమైన విజయాన్ని అందించాడు.




## సూర్య రెండుసార్లు షేక్‌హ్యాండ్ ఇచ్చాడు

### సూర్యకుమార్‌పై పాక్ కెప్టెన్ ఆరోపణలు

ఆసియా కప్ ఫైనల్‌లో భారత్ చేతిలో ఓడిన పాకిస్థాన్ మరోసారి వక్రబుద్ధి ప్రదర్శించింది. మ్యాచ్ అనంతరం ప్రెస్?మీట్?లో పాల్గొన్న పాక్ కెప్టెన్ సల్మాన్ అఘా భారత జట్టును తీవ్రంగా విమర్శించాడు. భారత్ తన చర్యలతో క్రికెట్‌ను అగౌరవపరుస్తోందని అన్న సల్మాన్, కెప్టెన్ సూర్యకుమార్?పై కూడా గంభీరమైన ఆరోపణలు చేశాడు.ఈ టోర్నీలో భారత్- పాక్ తలపడిన తొలి మ్యాచ్? నుంచే కాంట్రవర్సీలు ప్రారంభమయ్యాయి. సెప్టెంబర్ 14న జరిగిన ఈ మ్యాచ్?లో పాక్ ఆటగాళ్లకు టీమ్ఇండియా ప్లేయర్లు షేక్?హ్యాండ్ ఇవ్వలేదు. ఇది వివాదస్పదం అయ్యింది. ఆ తర్వాత సూపర్ 4, ఫైనల్ లోనూ టీమ్ఇండియా ప్లేయర్లు ఇదే ఫాలో అయ్యారు. దాయాది దేశం ఆటగాళ్లతో కరచాలనం చేసేందుకు నిరాకరించారు.ఫైనల్ మ్యాచ్ అనంతరం ట్రోఫీ ప్రజెంటేషన్ సమయంలో కాసేపు హైడ్రామా జరిగింది. పాకిస్థాన్?కు చెందిన మోసిన్ నఖ్వీ ప్రస్తుతం ఏసీసీ ప్రెసిడెంట్?గా ఉన్నారు. ఈయన ఏసీసీ ప్రెసిడెంట్ హోదాలో ఛాంపియన్?గా నిలిచిన టీమ్ఇండియాకు ట్రోఫీ అందించాల్సి ఉంది. కానీ ఆయన చేతులమీదులగా ట్రోఫీ తీసుకునేందుకు మనోళ్లు నిరాకరించారు. దీంతో నఖ్వీ ట్రోఫీని తీసుకుని వెళ్లిపోయారు.ఫైనల్లో భారత్ చేతిలో ఐదు వికెట్ల తేడాతో ఓడిపోయిన తర్వాత జరిగిన విలేకరుల సమావేశంలో అఘా మాట్లాడుతూ "ఈ టోర్నమెంట్‌లో భారత్? చర్యలు మమ్మల్ని చాలా నిరాశపర్చాయి. కరచాలనం చేయకపోవడం మమ్మల్ని అగౌరవపర్చినట్లు కాదు, క్రికెట్‌ను అగౌరవపరుస్తున్నారు" అని సల్మాన్ అన్నాడు."మంచి జట్లు ఇలా ప్రవర్తించవు. కానీ మేం మా బాధ్యతలను నెరవేర్చాలని కోరుకున్నాము. అందుకే ట్రోఫీతో ఒంటరిగా ఫోజులిచ్చాము. మేం అక్కడ నిలబడి మా పతకాలను అందుకున్నాము. నేను కఠినంగా మాట్లాడాలనుకోవడం లేదు. కానీ వాళ్లు చాలా అగౌరవంగా ప్రవర్తించారు" అని తెలిపాడు. కాగా, ఈ క్రమంలోనే కెప్టెన్? సూర్యపై పాక్ సారథి సల్మాన్ గంభీరమైన ఆరోపణలు చేశాడు. తనకు సూర్య రెండుసార్లు షేక్ హ్యాండ్ ఇచ్చినట్లు ప్రెస్ కాన్ఫరెన్స్ లో చెప్పాడు. "టోర్నీ ప్రారంభం కాకముందు, సెప్టెంబర్ 09న కెప్టెన్ల ప్రీ టోర్నమెంట్ ప్రెస్ కాన్ఫరెన్స్ జరిగింది. ఆ సమావేశంలో మేమిద్దం కలిశాం. అప్పుడు సూర్య నాకు రెండుసార్లు షేక్?హ్యాండ్ ఇచ్చాడు.

# ఫీజును ఇండియన్ ఆర్మీకి ఇచ్చిన సూర్యా

ఆసియా కప్ ఫైనల్‌లో భారత్ 5 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌ను ఓడించింది. ఫైనల్ గెలిచిన తర్వాత, పాకిస్తాన్ మంత్రి చేతుల మీదుగా ఆసియా కప్ ట్రోఫీని స్వీకరించడానికి టీం ఇండియా నిరాకరించింది. దీని తర్వాత, భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ నుంచ ఒక ప్రకటన వెలువడింది, దీనిలో నిజమైన ఆసియా కప్ ట్రోఫీ ఎవరి వద్ద ఉందో ఆయన వెల్లడించారు. మ్యాచ్ జెంటేషన్ తర్వాత, టీం ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అభిషేక్ శర్మతో కలిసి విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు, అక్కడ వారు అన్ని ప్రశ్నలకు సమాధానమిచ్చారు.భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ట్రోఫీని అంగీకరించకపోవడం గురించి మాట్లాడుతూ, "నేను క్రికెట్ ఆడటం ప్రారంభించినప్పటి నుంచి, ఒక ఛాంపియన్ జట్టు ట్రోఫీని తిరస్కరించడం నేను ఎప్పుడూ చూడలేదు. మాకు అలా చేయడం చాలా కష్టం, సులభం కాదు. మేం వరుసగా మంచి మ్యాచ్‌లను గెలిచాం మరియు మేము ఈ ట్రోఫీకి అర్హులం. నేను ఎక్కువ చెప్పనవసరం లేదు, ఎందుకంటే మేం టోర్నమెంట్‌ను అద్భుతంగా ముగించాము."ఆసియా కప్ ట్రోఫీ గురించి సూర్యకుమార్ యాదవ్ ఇలా అన్నాడు, "నాకు, ట్రోఫీ నా డ్రెస్సింగ్ రూమ్‌లో ఉంది. నా జట్టులోని 14 మంది ఆటగాళ్లు, సహాయక సిబ్బంది నా వద్ద ఉన్న నిజమైన ట్రోఫీ. నాకు, నిజమైన ట్రోఫీ ఆసియా కప్ ప్రారంభం నుంచి మాకు మద్దతు ఇచ్చిన వ్యక్తులే. మేము ఎప్పటికీ నాతో నిలిచి ఉండే మంచి జ్ఞాపకాలతో ఇక్కడి నుంచి బయలుదేరుతున్నాము." గెలిచిన తర్వాత, పెద్ద తెరపై ఇలా రాశారని సూర్యకుమార్ యాదవ్ అన్నారు: "భారతదేశం, 2025 ఆసియా కప్ ఛాంపియన్లు, మీరు దాని కోసమే ఆడుతున్నారు." అని రాశారని ఆటగాళ్లందరూ దీనికి అంగీకరిస్తారని భావించాడు. అభిషేక్ శర్మ దానికి తల ఊపాడు. విజేత ఎవరని అక్కడే ఉన్న పాకిస్తాన్ మీడియాప్రతినిధిని అడిగాడు సూర్య, అతను కూడా మీరే అని చెప్పాడు. దీనికి సూర్య నవ్వుతూ స్పందిస్తూ "చూడండి, అతను అవును అని కూడా చెప్పాడు" అని అన్నాడు. ఒక పాకిస్తాన్ జర్నలిస్ట్ సూర్యను టీం ఇండియా ప్రవర్తన గురించి ప్రశ్నించాడు, భారతదేశం పాకిస్తాన్ ఆటగాళ్లతో కరచాలనం చేయలేదని లేదా సల్మాన్ అలీ అఘాతో ఫోటోషూట్ చేయలేదని పేర్కొన్నాడు. పాకిస్తాన్ జర్నలిస్ట్ ప్రశ్నకు సూర్య రోహిత్ శైలిలో స్పందించాడు.మ్యాచ్ తర్వాత ఒక పాకిస్తాన్ జర్నలిస్ట్ సూర్యకుమార్ యాదవ్‌ను ఇలా అడిగాడు, "ఈ టోర్నమెంట్ అంతటా మీరు పాకిస్తాన్ జట్టుత ప్రవర్తించిన విధంగా, మీరు కరచాలనం చేయలేదు, ట్రోఫీ కోసం ఫోటోషూట్ చేయలేదు, అప్పుడు మీరు విలేకరుల సమావేశం నిర్వహించారు, క్రికెట్‌లోకి రాజకీయాలను తీసుకువచ్చిన మొదటి కెప్టెన్ మీరేనని మీరు అనుకుంటున్నారా?"సూర్యకుమార్ యాదవ్ మొదట "నువ్వు మాట్లాడాలనుకుంటున్నావా లేదా?" అని అడిగాడు. తర్వాత, నవ్వుతూ, ఒక మీమ్ వీడియో శైలిలో, "నువ్వు కోపంగా ఉన్నావా? నాకు ఆ ప్రశ్న కూడా అర్థం కాలేదు" అని అన్నాడు. సూర్య స్పందన అక్కడున్న వారందరినీ నవ్వించింది.ఇంతలో, ఒక జర్నలిస్ట్, "మొహ్సి నఖ్వీ నుంచి ట్రోఫీని స్వీకరించబోమని %ాూజజ%కి %దీజజ×% ఇమెయిల్ పంపింది. ఇది అధికారిక నిర్ణయమా లేక మీ వ్యక్తిగత నిర్ణయమా?" అని అడిగాడు. సూర్య, "మీరు ఏ ఇమెయిల్ గురించి ప్రస్తావిస్తున్నారో నాకు తెలియదు, కానీ ఈ నిర్ణయం మైదానంలోనే తీసుకున్నాం. మీరు ఎప్పుడు గెలుస్తారు, చాలా బాగా ఆడినప్పుడే కదా, టోర్నీ మొత్తం బాగా ఆడాం మేం ట్రోఫీకి అర్హులం కాదా." అప్పుడు జర్నలిస్ట్ అవును అని అన్నాడు, దానికి సూర్య, "మీరు ఇప్పటికే దానికి సమాధానం ఇచ్చారు" అని బదులిచ్చారు."నేను క్రికెట్ ఆడుతున్నప్పటి నుంచి, ఛాంపియన్ జట్టుకు ట్రోఫీ ఇవ్వకపోవడం నేను మొదటిసారి చూశాను. మేము చాలా కష్టపడి ఈ టోర్నమెంట్‌ను గెలుచుకున్నాము. మేము దానికి అర్హులం. ఇంతకంటే ఎక్కువ చెప్పలేను. నా ట్రోఫీలు నా డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్నాయి. 14 మంది ఆటగాళ్లు సహాయక సిబ్బంది అందరూ నాతో ఉన్నారు. ఇవే నిజమైన ట్రోఫీలు." అని అన్నారు. సూర్యకు టోర్నీలో వచ్చిన ఫీజు మొత్తాన్ని భారత ఆర్మీకి ఇస్తున్నట్టు ప్రకటించాడు. ఇది వివాదం అయ్యే అవకాశం ఉందంటూనే ఇదో మంచి పరిణామంగా సూర్య అభిప్రాయపడ్డాడు. దీన్ని కూడా వివాదం చేయబోరని అనుకుంటున్నట్టు చెప్పాడు. గంభీర్ పై తనకు అపారమైన నమ్మకం ఉందని, తన స్వభావాన్ని ఎప్పుడూ అనుమానించనని సూర్య వెల్లడించాడు. అతను ఇలా అన్నాడు: "ప్రతి ఓవర్, రెండు ఓవర్లు, మూడు ఓవర్లు తర్వాత, నేను డగౌట్ వైపు చూస్తాను, నేను అతని వైపు చూస్తాను, అతను ఏదో ఒకటి చెబుతాడు, ఎందుకంటే బయటి నుంచి ఆట పూర్తిగా భిన్నంగా కనిపిస్తుంది. కొన్నిసార్లు, నేను మైదానంలో ఉన్నప్పుడు, ఎవరు బౌలింగ్ చేయాలి, ఏ ఫీల్డ్ ప్లేస్‌మెంట్ చేయాలో నా మనస్సులో చాలా విషయాలు తిరుగుతూ ఉంటాయి, కానీ అతను బయటి నుంచి ఏదైనా సిగ్నల్ ఇచ్చిన వెంటనే, నేను ఆలోచించకుండా చేస్తాను,"పాకిస్తాన్‌తో జరిగిన ఆసియా కప్ ఫైనల్‌లో హార్దిక్ పాండ్యా లేనప్పుడు గౌతమ్ గంభీర్ శివమ్ దూబేను ఎలా నమ్మాడో కూడా భారత కెప్టెన్ మాట్లాడాడు. "మా ఇద్దరికీ ఒకరిపై ఒకరికి అంత నమ్మకం ఉంది, ఈ ఆట (ఆసియా కప్ ఫైనల్) కూడా, దురదృష్టవశాత్తు హార్దిక్ ఆడలేదు. దీంతో మాకు అదనపు బ్యాటర్ కూడా కావాలి" అని సూర్య చెప్పాడు.."శివం దుబే హార్దిక్ పాండ్యా స్థానంలో బాధ్యత తీసుకుంటాడని గౌతమ్ గంభీర్ చెప్పాడు, నేను అదే అనుకున్నాను, అని చెప్పాను. అతనే సరైన ఎంపికని అనిపిస్తుంది, నేను సరే అన్నాను. దాని గురించి మరింత చర్చించకూడదు, అతను కొత్త బంతిని బౌలింగ్ చేయనివ్వండి, అతను ఆ బాధ్యతను తీసుకోనివ్వండి అని చెప్పాడు. అతను మైదానంలో అదే అద్భుతం చేశాడు."

# అత్యంత ఒడిదుడుకులతో సాగిన తిలక్ వర్మ కెరీర్



నంబూరి ఠాకూర్ తిలక్ వర్మ.. ప్రస్తుతం దేశవ్యాప్తంగా మారుమోగుతున్న పేరు. పహల్గాం ఉగ్రదాడిలో భారతీయ వనితల తిలకాన్ని పాక్ ఉగ్రమూక తుడిచేస్తే..ఆసియా కప్ 2025 టోర్నీ ఫైనల్లో అసాధారణ బ్యాటింగ్ ప్రదర్శనతో ఈ తెలుగు తేజం భారత్‌కు విజయ తిలకాన్ని దిద్దాడు. అయితే ఈ మ్యాచ్ తర్వాత సోషల్ మీడియా వేదికగా ఓ మాట బాగా వైరల్ అయ్యింది.పాకిస్థాన్ జట్టు అభిషేక్ శర్మ కోసం బాగా ప్రిపేర్ అయ్యి ఔట్ చేస్తే.. ఔటాఫ్ సిలబస్‌లా తిలక్ వర్మ దూసుకొచ్చి విజయాన్ని అందించాడు. పాక్ మాజీ క్రికెటర్లు సైతం అభిషేక్ శర్మను ఔట్ చేస్తే మ్యాచ్ గెలిచినట్లేనని పాక్ ఆటగాళ్లకు నూరిపోసారు. అలానే అభిషేక్ శర్మను ఔట్ చేసిన అనంతరం పాకిస్థాన్ సంబరాలు చేసుకుంది. కానీ తిలక్ వర్మ మాత్రం చివరి వరకు నిలబడి.. పాక్ ఆశలను గల్లంతు చేశాడు. హైదరాబాద్‌కు చెందిన తిలక్ వర్మ దేశవాళీ క్రికెట్‌లో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్నాడు. ఐపీఎల్‌లో గత నాలుగు సీజన్లుగా ముంబై ఇండియన్స్ జట్టుకు ఆడుతున్నాడు. ఈ ఏడాదే ఇంగ్లండ్ కౌంటీల్లోకి అడుగుపెట్టాడు. హాంప్‌షైర్ తరపున బరిలోకి దిగాడు. 2023లో అంతర్జాతీయ టీ20ల్లోకి అరంగేట్రం చేశాడు. అయితే అందరి క్రికెటర్లలానే అతని క్రికెట్ జర్నీ కూడా అంత సాఫీగా ఏమీ సాగలేదు. ఒక లోయర్ మిడిల్ క్లాస్ కుటుంబంలో పుట్టిన తిలక్ వర్మ కెరీర్ అత్యంత ఒడిదుడుకులతో సాగింది.నంబూరి నాగరాజు, గాయత్రి దేవి దంపతులకు ఇద్దరు కుమారులు. అందులో చిన్నవాడే తిలక్ వర్మ. నాగరాజు ఒక సాధారణ ఎలక్ట్రీషియన్. తన కుటుంబ పోషణ కోసం ఎంతో కష్టపడ్డాడు. తిలక్ వర్మకు చిన్నతనం నుంచే క్రికెట్ అంటే ఇష్టం. అందరి కుర్రాళ్లలానే సరదాగా క్రికెట్ ఆడేవాడు. అయితే తన 11వ ఏట టెన్నిస్ బాల్ క్రికెట్ ఆడుతున్న తిలక్ వర్మను సలామ్ బయాష్ అనే క్రికెట్

# బీసీసీఐ కొత్త ప్రెసిడెంట్‌గా మిథున్ మన్హాస్



భారత క్రికెట్ కంట్రోల్ బోర్డుఅధ్యక్షుడిగా.. ఢిల్లీ మాజీ కెప్టెన్, డొమెస్టిక్ క్రికెట్ గ్రేట్ మిథున్ మన్హాస్ నియమితులయ్యాడు. ముంబైలోని కార్యాలయంలో జరిగిన వార్షిక సర్వసభ్య సమావేశంలో.. మిథున్ మన్హాస్‌ను ఏకగ్రీవంగా ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా రాజీవ్ శుక్లా, కార్యదర్శిగా దేవజిత్ సైకియా, సంయుక్త కార్యదర్శిగా ప్రభ్‌తేజ్ సింగ్ భాటియా, కోశాధికారిగా రఘురామ్ భట్ ఎన్నికైనట్లు వెల్లడించాయి. ఒక్కటే నామినేషన్ దాఖలు కావడంతో 45 ఏళ్ల మిథున్ మన్హాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఇటీవల 70వ వసంతంలోకి అడుగుపెట్టడంతో రోజర్ బిన్నీ.. బీసీసీఐ అధ్యక్ష పదవికి ఆగస్టులో రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో మిథున్ మన్హాస్ బీసీసీఐ అధ్యక్షుడిగా పని చేయనున్నాడు.1979 అక్టోబర్ 12న జమ్మూ కశ్మీర్‌లో జన్మించారు మిథున్ మన్హాస్.. టీమ్ఇండియా తరుపున అంతర్జాతీయ క్రికెట్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. అయినప్పటికి దేశవాళీ క్రికెట్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. సుదీర్ఘ దేశవాళీ కెరీర్?లో 157 ఫస్ట్-క్లాస్ మ్యాచ్‌లు, 130 లిస్ట్-ఎ మ్యాచ్‌లతో పాటు 55 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడిన అనుభవం మన్హాస్‌కు ఉంది. మన్హాస్ ఫస్ట్-క్లాస్ క్రికెట్‌లో 1714 పరుగులు సాధించాడు, వాటిలో 27 సెంచరీలు ఉన్నాయి, వీటిలో 4126 పరుగులు ఉన్నాయి.

## తండ్రి అడుగుజాడల్లో
# అజిత్ కుమారుడు



తన విజయాల వెనుక భార్య షాలిని హస్తం ఎంతో ఉందని చెబుతూ ప్రముఖ తమిళ నటుడు అజిత్ కుమార్ తాజా ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.. రీసెంట్‌గా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాలను ఎలా బ్యాలెన్స్ చేస్తున్నారన్న విషయంపై స్పందించారు. భార్య షాలిని సహకారం లేకపోతే తాను ఇంతదూరం రావడం సాధ్యపడేదికాదని అజిత్ స్పష్టంగా పేర్కొన్నారు. “మేము 2002లో పెళ్లి చేసుకున్నాం. అప్పటినుంచి ఆమె నాకు బలంగా నిలిచింది. నేను రేసింగ్‌కు తిరిగి వచ్చినప్పుడు కూడా ఆమె నాతోపాటే వచ్చేది. ఇంటి విషయాలు, పిల్లల సంరక్షణ, నా పనులపై దృష్టి అన్నింటినీ సమర్థంగా నిర్వహించేది అని ఆయన అన్నారు. పిల్లలు పుట్టిన తర్వాత షాలిని ఎక్కువగా ఇంటికే పరిమితమైపోయినా, మోటార్ స్పోర్ట్స్ పట్ల ఆసక్తిని మాత్రం కొనసాగిస్తోందని తెలిపారు. తన కుమారుడు గో-కార్టింగ్ ప్రారంభించిన విషయాన్ని వెల్లడించిన అజిత్, “అతను రేసింగ్‌ను కొనసాగిస్తాడో లేదో అతడే నిర్ణయించాలి. సినిమాలు అయినా, రేసింగ్ అయినా నేను నా అభిప్రాయాలను పిల్లలపై రుద్దను. వారు తమ ఇష్టమైన దారిని ఎంచుకోవాలి. వారికి నేను పూర్తి మద్దతు ఇస్తాను,” అని అన్నారు. వృత్తిపరంగా తరచూ ప్రయాణాల్లో ఉండడం వల్ల పిల్లలతో గడిపే సమయం కొంత మేర కోల్పోతున్నానని, కానీ నిజంగా ప్రేమించే పనిని చేస్తే కొన్ని త్యాగాలు అవసరమేనని భావోద్వేగంగా పేర్కొన్నారు. ప్రొఫెషనల్ రేసర్‌గా అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధించిన అజిత్ ఇటీవల 24హెచ్ దుబాయ్ కారు రేసింగ్ పోటీలో తన జట్టుతో కలిసి మూడో స్థానం సాధించగా, ఇటలీలో జరిగిన 12 రేస్‌లోనూ మూడో స్థానం దక్కించుకున్నారు. సినిమాల పరంగా ఈ ఏడాది 'పట్టుదల' మరియు 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన అజిత్, త్వరలో తన తదుపరి సినిమా వివరాలను అధికారికంగా ప్రకటించనున్నట్టు సమాచారం. రేసింగ్ ట్రాక్‌లో వేగంగా పరిగెత్తే అజిత్, జీవితాన్ని మాత్రం నెమ్మదిగా, విలువలతో, ప్రేమతో నడిపించడంలోనూ ముందున్నారు.

## టీమిండియాకు చిరంజీవి, పవన్
# కల్యాణ్ శుభాకాంక్షలు
## తెలుగుతేజానికి ప్రశంసల వెల్లువ



ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్‌లో భారత క్రికెట్ జట్టు పాకిస్థాన్‌పై ఘన విజయం సాధించి, చారిత్రక మైలురాయిని చేరుకుంది. ఈ అద్భుత విజయంతో దేశవ్యాప్తంగా సంబరాలు అంబరాన్నంటాయి. భారత జట్టు ప్రదర్శించిన పోరాట స్ఫూర్తి, నైపుణ్యం పై ప్రముఖులు ప్రశంసలు కురిపించారు. యువ ఆటగాడు తిలక్ వర్మ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడడంతో అతనిపై కూడా ప్రశంసల వర్షం కురుస్తుంది. తాజాగా మెగాస్టార్ చిరంజీవి తన సోషల్ మీడియాలో.. ఆసియా కప్ ఫైనల్‌లో పాకిస్థాన్‌పై టీమిండియా చూపించిన ప్రదర్శన అద్భుతం. టీమ్ ప్రదర్శించిన పోరాట స్ఫూర్తి, నైపుణ్యం, సంయమనం మెచ్చుకోవల్సిందే. ప్రత్యేకంగా తిలక్ వర్మకు అభినందనలు. ప్రతి భారతీయుడికి ఇది గర్వకారణం” అని తెలిపారు. టాలీవుడ్ హీరో ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా భారత జట్టు సభ్యులపై ప్రశంసలు కురిపిస్తూ పోస్ట్ పెట్టారు. టీమ్ ఇండియా మరోసారి తమ సత్తా చూపించింది. తొమ్మిదోసారి ఆసియా కప్ టైటిల్ కైవసం చేసుకుంది. జట్టు సమష్టికృషితోనే ఈ చారిత్రక విజయం సాధ్యమయ్యింది అని అన్నారు. ఇది మన భారతదేశానికి ముందస్తు దసరా కనుక. దీన్ని దేశమంతా సెలబ్రేట్ చేసుకుంటుంది అని పవన్ కళ్యాణ్ పోస్ట్ చేయగా, ఇది కూడా సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. తమిళ, మలయాళ సినీ తారలు కూడా భారత జట్టును అభినందించారు. మలయాళ సూపర్ స్టార్లు మమ్ముట్టి, మోహన్ లాల్, తదితరులు భారత జట్టు విజయాన్ని మెచ్చుకున్నారు. మమ్ముట్టి మాట్లాడుతూ, “టీమిండియా కేవలం ఆసియా కప్ గెలవడమే కాకుండా, అన్ని మ్యాచ్‌లలో పకడ్బందీగా ఆధిపత్యం చూపించింది. ఇది వారి అసాధారణ సామర్థ్యాన్ని నిరూపిస్తుంది” అని పేర్కొన్నారు.యువ నటుడు నిఖిల్ సిద్ధార్థ్ కూడా తన ఆనందాన్ని ట్విట్టర్‌లో పంచుకున్నారు. ఈ విజయం భారత క్రికెట్‌కి గర్వకారణం. తిలక్ వర్మ మంచి ఆటగాడు, అతని ప్రదర్శన చాలా అద్భుతంగా ఉంది అంటూ అభినందనలు తెలిపారు

# మనల్ని మనం ప్రేమించడమే



టాలీవుడ్ స్టార్ నటి సమంత మళ్లీ తన వ్యక్తిగత జీవితం, ఆలోచనలు గురించి ఓపెన్‌గా మాట్లాడారు. సోషల్ మీడియాలో షేర్ చేసిన ఇప్పుడు హాట్ టాపిక్ అయింది. సమంత చెప్పినదాని ప్రకారం, 20 ఏళ్ల వయసులో తాను గుర్తింపు కోసం పరుగులు పెట్టి, రెస్ట్ లేకుండా జీవితం గడిపేసిందని, ఆ ప్రక్రియలో తనను తాను కోల్పోయానని పేర్కొన్నారు. ప్రేమ అంటే ఏమిటో ఎవరూ చెప్పలేదు. కానీ 30 ఏళ్లకు వచ్చేసరికి మహిళలు చూసే ప్రతి విషయం భిన్నంగా ఉంటుంది. అందం, ఆలోచనల్లో మార్పు వస్తుంది” అని చెప్పారు. మనల్ని మనమే ప్రేమించుకోవడమే నిజమైన ప్రేమ అని ఇప్పుడు అర్థమైంది. నా ఆలోచన విధానాన్ని పూర్తిగా మార్చుకున్నాను. గతంలో చేసిన తప్పుల జ్ఞాపకాలను మోయడం మానేశాను. ప్రతి అమ్మాయి కూడా ఇలాగే ముందుకు సాగాలని కోరుకుంటున్నాను” అంటూ భావోద్వేగంగా మాట్లాడారు.ఇక అభిమానులకు పలు విషయాల గురించి సూచించిన సమంత.. జీవితాన్ని ఆస్వాదించండి, పరుగు తగ్గించండి. మీరు మీలా ఉన్నప్పుడే గర్వంగా, ధైర్యంగా, ఆనందంగా ఉండగలరు. అప్పుడే నిజమైన స్వేచ్ఛ అనుభూతి వస్తుంది” అని చెప్పారు.ఈ వ్యాఖ్యలతో సమంత చైతన్యతో విడాకుల తర్వాత ఎదుర్కొన్న ఒత్తిడి నుంచి బయటపడే ప్రయత్నం చేస్తోందని, ఇంకా పూర్తిగా తేరుకోలేదని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. అయితే ఆమె చెప్పిన మాటల్లో కొత్త ఆత్మవిశ్వాసం కనిపిస్తోంది. కెరీర్ మొదట్లో ఎన్నో ఇబ్బందులు పడ్డ సమంత ఆ తర్వాత మెల్లగా నిలదొక్కుకొని స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. పెద్ద హీరోలతో సినిమాలు చేస్తూ ఓ రేంజ్‌కి వెళ్లిన తర్వాత అక్కినేని హీరో నాగ చైతన్యని వివాహం చేసుకుంది. నాలుగేళ్ల తర్వాత ఎందుకో వారిరివురు విడిపోయారు. ఇప్పటికీ వారి విడాకులకి సంబంధించి క్లారిటీ లేదు. ఇక మయోసైటిస్ బారిన పడి చాలా ఇబ్బందులు ఎదుర్కొన్న సమంత క్రమంగా కోలుకొని కెరీర్‌పై ఫోకస్ పెట్టింది. ఫ్యామిలీ మ్యాన్, సిటాడెల్: హనీ, బన్నీ లాంటి సినిమాలతో సమంత క్రేజ్ బాలీవుడ్‌కి కూడా పాకింది. ప్రస్తుతం నిర్మాతగా కూడా సత్తా చాటుతుంది.

## నందమూరి తారకరత్న జ్ఞాపకాల్లో
# ఆలక్య

ఒకటో నంబర్ కుర్రాడు' సినిమాతో హీరోగా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టాడు నందమూరి తారకరత్న. ఎన్నో సినిమాల్లో కథానాయకుడిగా నటించి మెప్పించారు. కేవలం హీరోగానే కాకుండా విలన్ గానూ అదరగొట్టాడీ నందమూరి హీరో. అమరావతి సినిమాలో తారకరత్న విలనిజానికి ఏకంగా నంది అవార్డు కూడా వచ్చింది. తాత ఎన్టీఆర్ లాగే సినిమాలతో పాటు రాజకీయాల్లోనూ రాణించాలనకున్న తారకతర్న ఊహించని విధంగా చిన్న వయసులోనే ఈ లోకాన్ని విడిచి వెళ్లిపోయాడు. 2024 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు నారా లోకేష్ యువగళం పాదయాత్రలో పాల్గొన్న అతను గుండెపోటుకు గురయ్యాడు. సుమారు 23 రోజుల పాటు ఆస్పత్రిలో చికిత్స పొందిన తర్వాత 2023 ఫిబ్రవరి 18 శివరాత్రి రోజున తుదిశ్వాస విడిచాడు. తారకరత్న మరణంతో నందమూరి కుటుంబ సభ్యులు, అభిమానులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఇక ప్రేమించి పెళ్లి చేసుకున్న అతని భార్య అలేఖ్యా రెడ్డి ఇప్పటికీ ఈ విషాదాన్ని జీర్ణించుకోలేకపోతోంది. నిత్యం తారకరత్న తో గడిపిన మధుర క్షణాలను గుర్తు చేసుకుంటూ జీవితాన్ని గడుపుతోంది. తాజాగా మహాలయ అమావాస్య సందర్భంగా తన ముగ్గురు పిల్లలతో కలిసి తారకరత్నకు నివాళులర్పించింది. అనంతరం ఇందుకు సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసి ఎమోషనల్ అయ్యింది. నా మనసులో భరించలేని బాధ ఉంది. అది ఎప్పటికీ మానిపోని గాయమని తెలుసు. నీ కళ్లు శాశ్వతంగా మూసుకున్న తర్వాతే నీ కోరిక నెరవేరింది. అదే క్షణంలో మిగతావన్నీ కూడా నీతో పాటే వెళ్లిపోయాయి.



ప్రస్తుతం నాకు బాధ కలిగించే రోజుల్లో.. నీ కథను తిరిగి వ్రాయడానికి చాలా ఆసక్తిగా ఉన్న ప్రపంచంలో ప్రయాణిస్తున్నా. కాలం గడిచే కొద్దీ నిన్ను మరింతగా మిస్ అవుతున్నా. కొన్ని రోజుల పాటు ఊపిరి పీల్చుకోవడానికి చాలా కష్టంగా అనిపించించింది. దుఃఖం నా గొంతును చుట్టుకున్నట్లు, నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నట్లుగా.. అయినప్పటికీ నేను ఆశను వదులుకోను.. ఎందుకంటే నీ గుండె చప్పుడు ఇప్పటికీ నాలో బతికే ఉంది. అది ఎన్నటికీ నిన్ను గుర్తు చేస్తుంది' అంటే తన భర్తపై తనకున్న ప్రేమకు అక్షర రూపమిచ్చింది తారకరత్న. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్ గా మారింది. నందమూరి అభిమానులు అలేఖ్యా రెడ్డికి ధైర్యం చెబుతూ కొ... నసాగిస్తున్నారు.

EDITED, PRINTED AND PUBLISHED BY FAISAL KHAN PRINTED AT UJALA PRESS, LIG, 211 APHB COLONY ADILABAD, TELANGANA.
PUBLISHED FROM H.NO.4-4-120/C/3, SANJAY NAGAR COLONY, ADILABAD, TELANGANA STATE. EDITOR : FAISAL KHAN, RNI : APTEL/2013/53323, CELL : 94400 62685